
# కథామంజరి


## పది కథల సమాహారం



డిసెంబర్ 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**డిసెంబర్ 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 12



# మా జట్టు


సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి




## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i

విశిష్ట అతిథి ... ... ... ... ... ... iii

కథా మార్గదర్శి ... ... ... ... ... ... v

కథాపుస్తక పరిచయం ... ... ... ... ... ... vi

కథా పరిచయం ... ... ... ... ... ... vii


## కథలు, వ్యాసాలు


కృషితో నాస్తి దుర్భిక్షం ... టి. వి. ఎల్. గాయత్రి ... ... 1

మనోనేత్రం ... శ్రీసుధామయి ... ... ... 8

మారుతున్న కుర్రతరం ... పి.వి.ఆర్. శివకుమార్ ... ... 13

సర్దుకుపోదాం రండి!! ... ప్రశాంత్ వర్మ ఉప్పలపాటి ... ... 19

అమ్మ నవ్వింది ... గౌతమ్ లింగా ... ... ... 26

బ్రెయిన్ గెయిన్! ... పాణ్యం దత్తశర్మ ... ... ... 31

ప్రాణభిక్ష ... ముద్దు హేమలత ... ... ... 37

అనుకున్నోడు దొరికాడు.. ... కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ... ... 40

గడ్డి గులాబీ ... అవధానుల విజయలక్ష్మి ... ... 42

పాకశాస్త్ర పరీక్ష ... కీ. శే. చింతా దీక్షితులు ... ... 52


Cover Page Credits : Mr Simon Berger, Austria

# కథాకీయం



తెలుగు హాస్యానికి ఓ ప్రత్యేకమైన విశిష్టత ఉంది. హాస్యం గురించి మాట్లాడడానికి బస్కీలు తీసి, పుస్తకాలతో కుస్తీపట్లు పడితే.. హాస్యం వచ్చి చావదు. అది అలవోకగా ఆశువుగా రావాలి. వ్యవహారిక భాష తెలుగునాట పూర్తి అధికారంతో అడుగుపెట్టిన తర్వాత, ఆ మాటల్లో వినబడే పట్టు పదాలు, మాట విరుపులు, దీర్ఘాలు, నొక్కి వక్కా నింపడాలు.. వంటి హాస్య చతురతలు కలాల్లోకి దూరిపోయి.. కాగితాల మీదకు వచ్చేశాయి. గిడుగు రామమూర్తి గారి రచనల్లో కంటే వారి మాటల్లో హాస్యం ఉండేదిట! గురజాడ వారి సాహిత్యంతో వ్యవహారం మారిపోయింది. ఆయన రాతలు తెలుగు భాష రాతల్ని మార్చివేయడమే కాదు, ఇప్పటికీ సజీవంగా అక్షర సత్యాలుగా మనకి కనబడతాయి. ఆ కాలంలో ఇళ్ళల్లో కనబడే వాతావరణం, మాటలు, చేష్టలు.. ఇవే కదా ఆయన రచనల్లో కనబడేవి. 'మనవాళ్ళు వట్టి వెధవాయిలోయ్'.. అని ఆయన ఊరుకోలేదు, 'తాంబులాలిచ్చేశాను, ఇక తన్నుకు చావండి' అంటూ వ్యావహారిక భాషని వెలికి తీసి, అక్షరాన్ని అద్ది, ప్రపంచం మీదకు వదిలేసారు. ఇప్పటికీ ఈ రెండు మాటల్లో హాస్యం తొంగిచూసి, నాలుగు మొట్టికాయలు మొట్టినట్లు ఉంటుంది. చమత్కారాలు, మూతి విరుపులు, చేష్టలు, చిలిపి పనులు.. ఇవన్నీ ఇళ్ళల్లో మనుషుల వెంట తిరుగుతూ ఉండేవి. అలాగే.. పూర్వకాలం ఇంట్లో పెద్దవాళ్ల తిట్లు కూడా చాలా సొగసుగా ఉండేవి. మా తాతగారికి పిల్లల మీద కోపం వస్తే, 'ఏడాకుల వెధవ' అని తిట్టేవారు. మాకు ఆ తిట్టు వినడం చాల సరదాగా ఉండేది. ఇంట్లో నవ్వులు పుట్టించడానికి, ఇతిహాసాల దగ్గర్నుంచి.. పద్యం, గద్యం.. చివరికి ప్రకృతి కూడా ఇతోధికంగా సహాయపడ్డాయనే చెప్పాలి. "ప్రపంచంలో ఉన్న చెట్లలో ఏ చెట్టంటే ఇష్టమని" ఓసారి భారతకోకిల సరోజినీ నాయుడు గారిని అడిగారుట. "పత్తి చెట్టు" అంటూ ఠక్కున సమాధానం చెప్పారుట. ఎందుకంటే 'మానాన్ని' కాపాడేది పత్తి చెట్టు ఒక్కటే అని చమత్కరించారుట! ఆచార్య తిరుమల రామచంద్రగారి మిత్రుడు.. ఎప్పుడూ ఆధునిక కవిత్వం గురించి తెగ జోకులు వేస్తూ.. ఓసారి రెండు లైన్ల కవిత రాసుకొచ్చి "ఈ కవిత విని ఆశీర్వదించమని' అడిగాడుట. సరే వినిపించమంటే.. అతను.. " నేనొక లుంగీ కొన్నాను.." అంటూ ఆ వాక్యాన్నే పదిసార్లు తిప్పితిప్పి చదివాడుట. రామచంద్ర గారికి చిరాకు వేసి.. "ఇంతకీ ఏవిటంటా" అన్నారుట. "నేనొకలుంగీకొన్నాను.అందులోనేనున్నాను"అంటూపూరించేసరికిరామచంద్రగారుకూడానవ్వాపుకోలేకపోయారుట! కాని.. మరో చిక్కేమిటంటే... ఇలాంటి చెణుకులు బెణుకులు చెప్పిన వారిని బట్టి కూడా ఉంటాయి. ఫర్ సపోజ్.. ఒకానొక సభలో.. నా బోటివాడు మాట్లాడుతూ.. "ఈ సభలో ఉన్నవాళ్ళల్లో సగంమంది మూర్ఖులు" అన్నాడుట. సభలో అందరు లేచి గోల చేసారుట. వెంటనే ఆయన "సరే.. సరే.. ఈ సభలో ఉన్నవాళ్ళల్లో సగం మంది తెలివైనవాళ్ళు" అనే సరికి సద్దుమణిగి కూర్చున్నారుట. ఇదో జోకు కింద నేను చెప్తే కిక్ రాదు. తంతారు. ఇది బెర్నార్డ్ షా గారి స్వానుభవం అని చెప్తే.. 'ఆహా.. ఏమి చమత్కారం' అంటూ సభ చప్పట్లతో మ్రోగుతుంది. నిజానికి ఈ జోకు ఆయనదే!

మన హాస్యంలో మరో ప్రత్యేకత ఏమిటంటే.. సాంప్రదాయ సాహిత్యాన్ని అందించిన మన సాహితీ దిగ్గజాలు కూడా చక్కటి హాస్యాన్ని అలవోకగా పండించారు. విశ్వనాథ వారు.. "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు" లో "ఆ భాష భలే భాషలే. ఆ భాషలో దేవుడు, కుక్కా ఒకటే కదా. కుక్కని తలకిందులుగా నిలుచోబెడితే దేవుడు అవుతాడు" అంటారు. ఇంగ్లీషు GOD ని తిరగేస్తే DOG అవుతుంది. హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు గారు చాలా గంభీరంగానూ, ముభావంగానూ కనిపించేవారుట. "మీ రచనల్లో బోలెడంత హాస్యం గుమ్మరిస్తారు. మీరేంటి సీరియస్‌గా ఉంటారని" అడిగితే..

"వడ్డించేవాడు తింటూ వడ్డిస్తాడా? నేనూ అంతే" అని అనేవారుట! మునిమాణిక్యం గారు ఇంకో ఆకు ఎక్కువ హాస్యాన్ని ఆశువుగా సృష్టించారు. "సుబ్బారావు గారి ఇల్లెక్కడా?" అని అడిగితే.. "అబ్బే ఆయనెప్పుడూ ఇల్లు ఎక్కరు సార్.. ఇంట్లోనే ఉంటారు" అనే ఝలక్ ఎప్పుడు విన్నా అజరామరంగా హాస్యాన్ని పండిస్తుంది. ఇంటావిడతో పోట్లాటను కూడా సరసజన మనోభిరామంగా చూడగలిగి.. "మొగుడూ పెళ్లాల మధ్య పోట్లాట తప్పనప్పుడు.. విసుక్కుంటూ పోట్లాడుకునే దాని కన్నా, అది ఒక ఉదాత్తమైన ప్రదర్శనలాగా జరగాలనీ, సంగీత కచేరీ లాగా జరగాలనీ.." ఆయన కోరుకునేవారు.

ఇలా ఎన్నో విషయాలు మన పూర్వీకులు కథల్లో, నవలల్లో, వ్యాసాల్లో.. హాస్య రచనల ద్వారా అందించారు! వాటికి అందరు చదవాలి. ముఖ్యంగా రచనా వ్యాసంగంలో ఉన్నవాళ్లు ఖచ్చితంగా చదివి, అవగాహన చేసుకుంటే.. మంచి కథ వస్తుంది. మంచి హాస్యం వస్తుంది.

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**శ్రీమతి అవధానుల విజయలక్ష్మి**


మన తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగం అనదగ్గ కాలం.. అంటే వ్యవహారిక భాషలో తెలుగు కథ, నవల పురుడు పోసుకున్న తర్వాత నుంచి, సంప్రదాయబద్ధమైన జీవనం గడుపుతున్న రోజుల్లో కూడా.. తెలుగు సాహిత్యంలో మహిళా రచయితలు ఎక్కువ మందే ఉండేవారు. సమాజం పట్ల బాధ్యత వహించి, ఉద్యమాల వైపే కాకుండా.. కొంతమంది రచనా రంగం వైపు కూడా తమ సేవలను అందించి, సాహిత్యరంగంలో తమ ప్రతిభను ప్రదర్శించేవారు. అలాగే.. సాధారణమైన ఉపాధ్యాయుల నుంచి ఐఎఎస్, ఐపిఎస్ ఆఫీసర్ల వరకు తెలుగులో కథా రచనలు చేసే రచయిత్రులు ఎందరో ఉండేవారు. మన రాష్ట్రంలోనే కాకుండా.. ప్రవాసాంధ్రలో ఉద్యోగాలు చేసుకుంటూ కూడా తమ రచనలతో అలరించిన ఆనాటి ప్రముఖ రచయిత్రులలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన రచయిత్రి శ్రీమతి అవధానుల విజయలక్ష్మి గారు.

సాహిత్యం పై మక్కువ ఏర్పడడానికి కారణం ఏమిటని అడిగితే, చిన్నప్పట్నుంచీ పుస్తకాలు చదవడమే అని చెప్తారు.. విజయలక్ష్మి గారు! తన ఇరవై ఏట మొదటి కథకు శ్రీకారం చుట్టారు. ఆ కథ "అద్దం ప్రతిబింబం" 1970లో ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితమైంది. ఇక వెనక్కి చూడవలసిన పని పడలేదు. సాధారణ మధ్యతరగతి కుటుంబాల చుట్టూ తిరిగే అంశాల నుంచి, సమాజంలో కనబడే మంచి చెడులదాకా తన కథల్లో బంధించారు. ఓ ప్రత్యేకమైన శైలి, సహజమైన భాషా పదజాలం, ఆకట్టుకునేలా కథనాన్ని నడిపించగల నేర్పు.. ఇవన్నీ విజయలక్ష్మిగారికి స్వతహాగా లభించిన సంపద అనుకుంటే... సృజనాత్మకత, పరిశీలనా శక్తి, విషయ పరిశోధన చేయాలనే తలంపు.. ఇవన్నీ విజయలక్ష్మిగారి అదనపు అర్హతలే అని చెప్పాలి. వెరసి ఇవన్నీ ఆమె రచనల్లో కనబడతాయి! ఆ రోజుల్లో బి.యస్సీ. చదివిన తర్వాత.. మరో దిశలో ఉండే ఐ.సి.డబ్ల్యు.ఏ. చదవాలనే ఆలోచన కలగడం ఓ ఎత్తు అయితే, అదీ పెళ్ళై ఇద్దరు పిల్లల తల్లి అయిన తర్వాత రావడం.. అదీ ఆ రోజుల్లో.. గొప్ప విషయమని చెప్పుకోవాలి. మరో వైపు రచనా వ్యాసంగంలో.. అనతికాలంలోనే ఓ మంచి రచయిత్రిగా ఎదిగారు. ఆ రోజుల్లో దీపావళి ప్రత్యేక సంచికలలో.. ప్రత్యేకంగా పేరున్న రచయితల కథల్నే ప్రచురించేవారు. ఆ గుర్తింపు విజయలక్ష్మి గారికి కూడా దక్కింది. అంతే కాదు ప్రతిష్ఠాత్మకంగా జరిగే దీపావళి కథల పోటీలలో హేమాహేమీలతో పోటీపడి.. బహుమతులు పొందారు. విజయలక్ష్మిగారి తండ్రిగారు సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేసేవారు. వారి జీవనయాన నేపథ్యంలో "అనగనగా ఒక రామం" ధారావాహిక నవల వ్రాసారు. ఆ నవల బహుమతి పొంది, బాగా ప్రాచుర్యం పొందింది. దాదాపు తెలుగులో వచ్చే అన్ని పత్రికల్లో విజయలక్ష్మి గారి కథలు, నవలలు, వ్యాసాలు ప్రచురింపబడ్డాయి! కోల్ ఇండియా సంస్థలో పనిచేసి, పదవి విరమణ చేసిన తర్వాత 'ప్రతిలిపి' అంతర్జాల వేదికలో వీరి కథలు, నవలలు ప్రచురింపబడ్డాయి. ఓ మంచి రచయిత్రిగా పేరు పొంది, ఈ స్థాయికి రావడానికి కారణం.. విజయలక్ష్మి

గారి కథల్లో కనబడే కథావస్తువు, నిబద్ధత, చిత్తశుద్ధి అని చెప్పాలి. రెండు వందల పైగా వ్రాసిన వీరి కథలలో.. గురుస్సాక్షాత్, గడ్డి గులాబీ, జాతత్య హి ధృవోర్మృత్యుః, పాలైన కారేవే బంగారు కళ్ళు, భావుకతకు భాష్యం, లాన్ మోవర్... వంటి కథలకు బహుమతులు లభించాయి. అంతే కాకుండా ఇరవైకి పైగా వ్రాసిన నవలలలో.. అమ్మలు జీవనయానం, గూడు బండి బతుకులు, ఒక భవన నిర్మాణంలో, మృదుల.. వంటి నవలలకు ప్రతిలిపిలో బహుమతులు వచ్చాయి. విజయలక్ష్మిగారి సంపాదకత్వంలో ఏభై నాలుగు మంది రచయిత/రచయిత్రుల కథలతో "కలగూర గంప" అనే సంపుటి విడుదలైంది. ఇందులో ఒక్క పరభాషా పదం కూడా లేకుండా రచింపబడిన కథలే ఉండటం విశేషం!

1950లో సామర్లకోటలో జన్మించిన విజయలక్ష్మిగారి విద్యాభ్యాసం హైదరాబాదులో జరిగింది. భర్త శ్రీ అవధానుల జగన్నాధరావుగారు కూడా మంచి రచయితే! ఈ దంపతులు నాగపూర్, భువనేశ్వర్ వంటి నగరాల్లో పనిచేసిన తర్వాత.. ఇప్పుడు విశాఖపట్నంలో స్థిరనివాసంలో ఉంటున్నారు. కథామంజరి కోరిన వెంటనే.. ఈ సంచికకు విశిష్ట అతిథిగా అంగీకరించి.. ఎన్నో విషయాలను మాకు తెలియచేసినందులకు శ్రీమతి అవధానుల విజయలక్ష్మిగారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ.. వారి కలం నుంచి మరెన్నో ఆణిముత్యాల వంటి కథలు, నవలలు జాలువారాలనీ ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

## కీ.శే. చింతా దీక్షితులు

ఇరవయ్యవ శతాబ్దం ఆరంభానికి ముందే.. గ్రాంథిక భాష స్థానంలో వ్యవహారిక భాష రావాలనే ఉద్యమం మొదలయ్యింది. ఆ ఉద్యమానికి వ్యతిరేకంగా కూడా ఉద్యమం ఉండేది. ముఖ్యంగా భాషాపండితులు, ఉపాధ్యాయులు ఈ ఉద్యమంలో ఉండేవారు. ఈ ఉద్యమంలో పని చేసిన .. ఆ తరం సాహితీవేత్తలలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ సాహితీవేత్త కీ.శే. చింతా దీక్షితులు గారు. వాడుక భాషను వ్యతిరేకించినా.. దీక్షితులు గారు రచించిన జానపద గేయాలలో వాడుక భాషా పదాలే కనబడతాయి. ముఖ్యంగా వీరి "లక్క పిడతలు" గేయాలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఆ రోజుల్లో కనబడే ఆచారవ్యవహారాలను సమర్థిస్తూ, ఆధునిక నాగరికతను దీక్షితులు గారు వ్యతిరేకించేవారు. ఆ విషయాన్ని తన రచనల్లో గుప్పించారు. "వటీరావు ఎం.ఎ." అనే పాత్రను సృష్టించి, ఆ పాత్ర ద్వారా తను నమ్మిన సిద్ధాంతాలను కథల రూపంలో అందించారు. అలాగే.. బాల సాహిత్యంలో చాలా పేరు ప్రఖ్యాతులు సాధించిన దీక్షితులు గారు.. 'బాలానందం' పేరుతో భారతి మాసపత్రికలో సూరి, సీతి, వెంకి అనే శీర్షికతో ఎన్నో బాల కథలు వ్రాశారు! వీరి కథల్లో మధురమైన తేటతెనుగు పదాలు కనబడతాయి.

సాధారణంగా కనబడే మానవ జీవనవిధానం కథావస్తువుగా చేసుకుని రచనలు చేసారు. వీరి రచనలో జాతీయత, దేశభక్తి, లోకజ్ఞానం.. ప్రస్ఫుటంగా కనబడతాయి. మొట్టమొదట "చిత్రరేఖ" అనే అపరాధ పరిశోధన నవల వ్రాశారు. తర్వాత కాలంలో, ఆయన రచించిన "గోపి మోహిని" అనే పిల్లల నవల, ఏకాదశి కథలు, ఆంధ్ర దోమల సభ, తెలుగు శాస్త్రిల్లు, మిసెస్ వటీరావు కథలు... వంటి వీరి రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. కథలతో పాటు.. శబరి, వరూథ, శర్మిష్ఠ వంటి ఏకాంక నాటికలు రచించారు. దీక్షితులు గారు మంచి హాస్య కథారచయితగా కూడా పేరు తెచ్చుకున్నారు హాస్యం, చమత్కారం, నుడికారం, మాండలిక భాషా పదాలు.. మెండుగా వీరి రచనలలో సాక్షాత్కరిస్తాయి. వీరి రచన ప్రతిభను గుర్తించి, వీరికి "కథక చక్రవర్తి" అనే బిరుదు కూడా లభించింది.

తూగో జిల్లా రామచంద్రాపురం తాలుకా దంగేరులో 1901 లో జన్మించిన దీక్షితులు గారు బి.ఏ., బి.యిడి. చదివి, చాల కాలం ఉపాధ్యాయులుగా పనిచేసారు. తర్వాత కాలంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా, ఉపాధ్యాయ శిక్షణ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా కూడా పని చేసి, పదవీవిరమణ చేసారు. ఇటు వృత్తిలోనూ, అటు ప్రవృత్తిలోనూ పేరు ప్రఖ్యాతులు సాధించినా.. సత్కారాలకి, సన్మానాలకీ దూరంగా ఉండేవారు. ఆ రోజుల్లో యువరచయితను ఎంతగానో ప్రోత్సహించేవారు. దీక్షితులు గారు, చలంగారు.. వారి సిద్ధాంతాలు, ఆదర్శాలు.. చెరో వైపు ఉన్నా, వారి మధ్య మంచి స్నేహం ఉండేది. మాతృభాష, బాలసాహిత్యం ల ఉన్నతికి, మనుగడకు కృషి చేస్తున్న ప్రతీ తెలుగువారు కీ.శే. చింతా

దీక్షితులు గారి గురించి తెలుసుకుని, వారి రచనలను తప్పక చదవాలి. ఓ మహోన్నతమైన వ్యక్తిత్వంతో పాటు తెలుగు కథకి తనదైన శైలిలో మంచి గుర్తింపు తీసుకొచ్చిన చింతా దీక్షితులు గారిని తలచుకుని, వారి సాహిత్య సేవలను గుర్తు చేసుకునే అవకాశం ఈ సంచిక ద్వారా లభించినందులకు ఆనందిస్తున్నాం.

**కథామంజరి బృందం**

# కథాపుస్తక పరిచయం






## కథా కుసుమాలు

వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 34 మంది రచయితల కథల సంకలనం. ఏప్రిల్ 2025 లో విడుదల అయిన ఈ పుస్తకం వెల రు. 300/-.

# కథా పరిచయం

## శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు గారి కథ : నీలి మంట

ద్విభాష్యం రాజేశ్వరరావు గారిని ఈ వేదిక మీద పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు. విశాఖపట్నంలో ఉంటూ, అక్కడే సాహితీ సేద్యాన్ని చేస్తూ, ఆ ఫలితాల్ని నలుగురితో పంచుకుంటూ, ఒక స్నేహితుడిగా, ఒక సలహాదారునిగా, యువతకు దారి చూపిస్తూ తమ విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నారు. సాహితీ వనంలో ఆయన 'చెట్టంత మనిషి'. నాలుగొందలకు పైచిలుకు కథలు, కొన్ని నాటికలు, నాటకాలు వ్రాసిన రాజేశ్వరరావుగారు ఎన్నో కథా సంపుటాలను ప్రచురించడమే కాక, తమ రచనలనెన్నిటినో ఆలిండియా రేడియో ద్వారా ప్రసారం చేయడం జరిగింది. ఆయన కథలెన్నో వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఎన్నో కథలు వివిధ భాషలలోకి అనువదించబడ్డాయి. ఎన్నో కథల మీద పరిశోధనలు జరిగాయి.

రాజేశ్వరరావుగారు వ్రాసిన కథ 'నీలి మంట' 1969 ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురించబడింది. అంతే కాదు. ఈ కథకు దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి కూడా వచ్చింది. ఆయన రాసిన ఎన్నో మంచి కథలలో ఇదొక మచ్చుతునక!

ఈ కథ ఆయన కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో చేరిన (1967) కొత్తల్లో రాసింది. కథలో ప్రత్యేకత ఏమిటంటే, ఇతివృత్తానికి ఒక పారిశ్రామిక నేపథ్యాన్ని తీసుకోవడం. కంపెనీలో చేరిన కొత్తలేమో, తప్పక అక్కడ అనుభవాల ప్రభావం ఉండడం ఒక ఎత్తైతే, ఆ అనుభవాన్ని మానవ స్వభావానికి అనుసంధించి కథ రాయడం ఇంకో ఎత్తు. ఎంత మంది చెయ్యగలరలాగ?

సల్ఫ్యూరిక్ ఆసిడ్ తయారుచేసే ఒక కెమికల్ ప్లాంట్ అది. గంధకాన్ని మండించడం ఆ తయారు చేసే ప్రక్రియలో ఒక భాగం. అది మండుతున్నప్పుడు కొలిమికి అమర్చిన గుండ్రని అద్దంలోంచి చూస్తున్నప్పుడు కనబడే మంటలు నీలం రంగులో అందంగా ఉంటాయి.

కంట్రోల్ రూములో ఆ షిఫ్టులో ఉన్నది నలుగురు ఆపరేటర్లు. అందరికీ తెలుగు వచ్చు! కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రాజన్, సునీల్, తను (రచయిత), మరియు, సుధాకర్! సుధాకర్ అక్కడ పనిచేస్తున్న వారందరిలోకి, జూనియర్. సునీల్ ఓ ఏడాది క్రితం బెంగాల్ నుంచి వచ్చాడు. చలాకీ మనిషి. బెంగాలీ అయినా, స్పష్టంగా తెలుగు మాట్లాడగలడు. ఎన్నో కథలు ప్రచురించి మంచి పేరు తెచ్చుకున్న రచయిత. అంతకంటే ఇష్టంగా కథలు చెప్పగలడు. రాజన్ ప్రకృతి ఆరాధకుడు. తమిళుడైనా తన పై తరాల వాళ్ళు ఆంధ్రాలో సెటిల్ అవడం మూలాన.. తెలుగు స్వచ్ఛంగా మాట్లాడగలడు.

షిఫ్టులో అంతా ప్రశాంతంగానే గడిచిపోతోంది. అంతా సవ్యంగానే నడుస్తూ, పెద్ద పనేమీ లేకపోవడం వల్ల నలుగురికీ మాటల్లోనే సమయం గడిచిపోతోంది. సంభాషణ గోడ మీదున్న అందమైన అమ్మాయి ఫోటో మీదకు మళ్ళింది. సునీల్ చెప్పడం మొదలు పెట్టాడు, తనకు అంతకంటే అందమైన అమ్మాయితో పరిచయముందని. పర్స్ లోంచి, కాగితం మడతల

మధ్యలోంచి... ఒక ఫోటో తీసి చూపించాడు అందరికీ! అందమైన అమ్మాయి. మిగతా ముగ్గురూ చూసారా అమ్మాయి ఫోటోని!

సునీల్ చెప్పిన గతం:

కలకత్తాలో తన మామయ్యగారింట్లో ఉంటున్నప్పుడు, ఈ అమ్మాయి వుండడానికి ఒక గది అద్దెకు కావాలని వచ్చిందని, తనో చిన్న నాటకమాడి అత్తయ్యను తనకు తెలిసిన అమ్మాయే అని చెప్పి ఒప్పించి, మేడమీద తనుండే గదికి ఎదురుగానే ఇంకో గది ఖాళీ చేయించి ఇప్పించాడు సునీల్. ఆ అమ్మాయి పేరు రాధ.

ఆమె గురించి ఎన్నో వివరాలు తెలుసుకున్నాడు. వాళ్లది విజయవాడ. ఆమె తండ్రి ఒక మందుల కంపెనీలో గుమాస్తా. అయిదుగురు పిల్లలు. రాధ పెద్దది. ఆర్థికమైన ఇబ్బందులుండడం వల్ల ఇంత దూరం వచ్చి, ఉద్యోగం చేసి కుటుంబాన్ని ఆదుకోవలసి వచ్చింది. మూడు నెలలలోనే, సాన్నిహిత్యం వెన్నెల నీడల్లో ఎన్నో రాత్రులు గడిపే దాకా వచ్చింది.

అంతలో ఆమెకు ఇంటి నుంచి టెలిగ్రామ్ వచ్చింది.. తండ్రికి ఒంట్లో బాగాలేదని! ఏడుస్తూ వెళ్ళింది. తనే విజయవాడ ట్రైన్ ఎక్కించి వచ్చాడు. పరిస్థితులు బాగు పడగానే పెళ్ళి చేసుకుంటానని. అయితే ఆమె తిరిగి రాలేదు వెనక్కి. తండ్రి పోయాక, వేరే గత్యంతరం లేక తన బావనే చేసుకోవలసి వచ్చింది. తనను మరచిపొమ్మని ఉత్తరం రాసింది.

కథ చెప్పి నిట్టూర్చాడు సునీల్.

ఇంతలో, రాజన్ గుర్తించాడు.. సల్ఫర్ గోడౌన్ టెంపరేచర్ బాగా పెరిగిపోయిందని! అందులోని గంధకం గుట్ట అంటుకుని, నీలిరంగు మంటలు నాలుకలు చాచి, భయంకరంగా కాలసర్పం పడగలా బయటకు లేస్తున్నాయి. అందరూ బయటకు వచ్చి గోడౌన్ వైపు పరిగెత్తి ఫైర్ వాటర్ మంటలపై చల్లడం మొదలెట్టారు. ఫైర్ సర్వీస్‌ని పిలిచారు. ఫైర్ వాటర్ గొట్టం పట్టుకుని సుధాకర్ ముందుకు వెళ్ళాడు.. మాస్క్ వేసుకోకుండా! ఘాటెక్కిన గంధక ధూమం త్వరగా వ్యాపిస్తోంది. ఆ పొగల్లోకి వెళ్ళద్దని చెప్పినా సుధాకర్ వినలేదు. ముందుకు దూసుకెళ్ళిపోయాడు.

ముఖానికి మాస్క్ తగిలించుకుని వెళ్ళిన నాథ్, సుధాకర్ని భుజం మీద వేసుకుని తిరిగి వచ్చాడు. వళ్ళంతా కాలిపోయి ఉంది. గంధకం శరీరానికంతటా అతుక్కుపోయి అట్టలు కట్టినట్లుంది. అతన్ని హాస్పిటల్‌లో చేర్చారు. సెక్యూరిటీ గార్డులు వచ్చాక, ఒక ఇరవై నిముషాల్లో మంటలు అదుపులోకి వచ్చాయి. ప్రదేశమంతా వేడిగా, ఘాటుగా తయారయింది. రాక్షసుణ్ణి దహనం చేశాక, మిగిలిపోయిన చితి తాలూకు చిహ్నంలా ఉంది. కొద్ది క్షణాలలోనే ఎంత మార్పు? రచయిత మాటల్లో.. జీవితాలు శాసించే విధాత లీలలు ఎంత విచిత్రంగా ఉంటాయి?

మర్నాడు ఉదయం సునీల్ తలుపు తట్టి నిద్రలేపాడు. దిగాలు పడిన ముఖంతో ఉన్నాడు. సుధాకర్‌కి ఇంకా తెలివి రాలేదని, సాయంత్రంలోగా వచ్చేస్తే పరవాలేదని.. తనే అన్నాడు, తనొక అపరాధం చేసేడనీ, రాధకీ, తనకీ ఎలాంటి సంబంధం లేదని! అతని వింత ధోరణి అర్థం కాలేదు. తను క్రితం రోజు రాత్రి చెప్పిన కథంతా అబద్ధమని, రాధకు తనకు అసలు సంబంధమేమీ లేదని. తను ఉన్న మూడు నెలలలో తను కేవలం ఒకటి రెండు సార్లు మాత్రమే మాట్లాడానని. తను మాత్రం ఆమెను ప్రేమించాడని, తన మనసులో మాట ఉత్తరం ద్వారా తెలిపినప్పుడు ఆమె తన బావతో వివాహం కుదిరిపోయిందని, అనవసరంగా ఆశలు పెంచుకోవద్దని హెచ్చరించిందని చెప్పాడు. తరవాత వాళ్ళ నాన్నగారికి ఒంట్లో బాగులేదని

టెలిగ్రామ్ రావడంతో, విజయవాడ వెళ్ళిపోయిందని, తరవాత తిరిగి రాలేదని, ఆమె వెళ్ళే ముందు తనే ఆమె ఫోటోని దొంగిలించి తన దగ్గర పెట్టుకున్నాడని చెప్పాడు.

ఇంకా అతని ప్రవర్తన వింతగానే కనిపించింది. అబద్ధం చెప్పినా అంత బాధెందుకు? అప్పుడు చెప్పాడు. క్రితం రోజు రాత్రి షిఫ్ట్ అయ్యాక, ఈ ప్రమాదం గురించి చెప్పడానికి సుధాకర్ ఇంటికి వెళ్ళాడు సునీల్. అతని భార్య తలుపు తీసింది. ఆ అందమైన ముఖాన్ని గుర్తుపట్టడానికి సునీల్‌కి ఎంతో సమయం పట్టలేదు. ఆమె ఎవరో కాదు. రాధ! శూన్యంలోకి చూస్తుండిపోయిన నాకు (రచయిత) సునీల్ చెప్తున్న మాటలేవీ వినపడలేదు.

అదీ కథ.

కథ మధ్యలో రచయిత అసంకల్పితంగానో, సంకల్పితంగానో తన మాటలలో చెప్తారు. “గంధకం అంటుకుంటే దాన్ని ఆర్పడం సులభసాధ్యం కాదు. అది గాలితో కలిసి లేత నీలం రంగులో అందంగా మండుతూ అతివేగంగా పక్కలకు పాకుతుంది.. అసత్యం కూడా చాలా సమయాలలో అతి అందంగా ఉంటుంది. అదికూడా కారుచిచ్చులా వ్యాపిస్తుంది. అది మండుతూంటే వెలువడే భయంకరమైన ధూమం “అనుమానం’ అనుకుంటాను! అనుమానపు ధూమం మనిషిని ఒక్కసారిగా ఆక్రమించి, ఉక్కిరి బిక్కిరి చేసి, కర్తవ్యతా మూఢుని చేస్తుందేమో మరి!”

పై వాక్యాలు చాలు కథ సారాంశం గుర్తించడానికి. తను గమనించిన కెమికల్ బిహేవియర్‌ని, ఒక కథారూపంలో మానవ సంబంధాల పరిధిలో ఇమిడ్చి పాఠకులకందించడం రచయిత చేసిన మంచి ప్రయోగం.

సుమారు 55 సంవత్సరాల తరవాత ఈ కథ చదువుతూంటే, భావపూర్వకంగా కథని సులభంగా అర్థం చేసుకున్నప్పటికీ, ఆ రోజులకి ఇప్పటికీ, ఇండస్ట్రీలో సేఫ్టీ పాటించే పద్ధతుల్లో వచ్చిన తేడాలవల్లో, రచయితగా తను తీసుకున్న స్వతంత్రం వల్లో, రచయిత రాసిన కొన్ని విషయాలు ఇబ్బందికరంగా అనిపించాయి. అది సహజం. అయితే ఈ సందర్భాలు, కథలో రచయిత చెప్పదలచిన భావం ఎంతో బలమైనదవడం వల్ల, పాఠకుడు చేసుకునే అవగాహనలో ఎలాంటి అడ్డు రానివ్వలేదు.

మంచి కథలను ఎన్నింటినో తెలుగు సాహితీలోకానికి అందజేసిన రాజేశ్వరరావుగారికి మరోసారి నమస్కారం.

*పరిచయ కర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్*

# కృషితో నాస్తి దుర్భిక్షం

**టి. వి. ఎల్. గాయత్రి**

✆ 8390705200

***"ఇంకో ఆర్నెల్లు ఇలాగే గడిస్తే కొంచెం ఊపిరి పీల్చుకుంటాను!" చెప్పింది జయంతి.***

***"గుడ్ గుడ్! నీ ధైర్యానికి మెచ్చుకోవాలి! ఉద్యోగం కోసం చూస్తూ టైమ్ వేస్ట్ చెయ్యకుండా, మంచిదారి చూసుకున్నావు!" మనస్ఫూర్తిగా జయంతిని మెచ్చుకున్నాడు సంజయ్.***

***జయంతి యూనిట్ చూసాక, అతడి మనసులో ఇలాటిదే ఏదన్నా చేద్దామనే ఆలోచన వచ్చింది.***

ఉదయం పదిగంటలు!

కంప్యూటర్ ముందు కూర్చుని ఉద్యోగాలు ఏమన్నా ఉన్నాయేమోనని చూస్తున్నాడు సంజయ్. గదిలోకి వచ్చింది శారద.

"ఎంతసేపు అలా చూస్తూ కూర్చుంటావు? వచ్చి టిఫిన్ తిను!" అంది మెల్లగా శారద.

ఎంబీఏ పూర్తి చేసిన సంజయ్‌కు ఉద్యోగం రాలేదు. ఏడాదినుండి నిరీక్షణ! ఎంబీఏ చేయంగానే కంపెనీల వాళ్ళు వచ్చి ఎగిరేసుకుపోతారని కలలు కన్నారు సంజయ్ తల్లిదండ్రులు శారద, శ్రీహరిలు.

ఇప్పుడు మార్కెట్ పరిస్థితి అంతగా బాగాలేదు. చాలా కంపెనీలు తమ దగ్గర ఉన్న ఉద్యోగస్థులను పీకేస్తున్నాయి. దేశవిదేశాల్లో ఉన్న కొన్ని సాఫ్ట్వేరు కంపెనీలు చాలా నష్టాలను ఎదుర్కొంటున్నాయి. మైక్రోసాఫ్ట్ లాంటి పెద్దపెద్ద కంపెనీల్లో కూడా వేలకొద్దీ లేఆఫ్స్ జరుగుతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెరికాకు వెళ్ళే దారి లేదు. అంతటా మాంద్యం... ఏం చేయాలో తెలియక మన యువత బుర్ర బద్దలు కొట్టుకుంటోంది. సంవత్సరంనుండి వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నాడు సంజయ్. అతడికి దిగులుగానే ఉంది.

"ఇప్పుడేం వద్దమ్మా! ఏకంగా భోజనం చేస్తాలే!" చెప్పాడు సంజయ్.

మాట్లాడకుండా వంటింట్లోకి నడిచింది శారద. రోజురోజుకూ కొడుకు పరిస్థితి చూస్తుంటే బెంగగా ఉంది శారదకు.

"త్వరగా వాడికి ఉద్యోగం ఇప్పించు తండ్రీ!" అంటూ దేవుడి మందిరం ముందు నిల్చొని ప్రార్థించింది.

ఇంతలో ఫోన్ మోగింది.

భానుమతి ఫోన్ చేసింది. ఆమె రామాలయంలో మేనేజరుగా పనిచేస్తోంది.

"ఏమిటి భాను?" అడిగింది శారద.

"ఈరోజు సాయంత్రం గుడిలో కళ్యాణం కదా! మీకు గుర్తు చేద్దామని!" చెప్పింది భానుమతి.

"అరె! ఎలా మర్చిపోతాను? పెందలాడే వచ్చేస్తాను!" అంది శారద.

ఈరోజు సాయంత్రంనుండి మూడురోజులు గుడిలో ఉత్సవాలు.

ఫోన్ పెట్టేసి కొడుకు గదిలోకి వచ్చింది శారద.



"సంజూ! సాయంత్రం నీ బైక్ మీద గుడికి తీసుకెళ్తావా!"

"ఎన్నింటికమ్మా?"

"ఆరింటికి అక్కడ ఉంటే చాలు! కళ్యాణం అయ్యేసరికి రాత్రి తొమ్మిది అవుతుంది. నన్ను గుడిలో దించేసి నువ్వు మళ్ళీ వచ్చి తీసుకొద్దువు గాని!"

"అలాగేనమ్మా!" అన్నాడు సంజయ్.

ఇప్పుడేమి పని ఉంది? ఉద్యోగం ఎలాగూ లేదు. ఇంట్లోకి కూరలు, సరుకులు తెచ్చి పెడుతూ, తల్లిదండ్రులకు హెల్ప్ చేస్తున్నాడు సంజయ్.

సాయంత్రం బైక్ మీద శారదను కూర్చోబెట్టుకొని గుడికి తీసుకెళ్లాడు.

బైక్ స్టాండ్‌లో పెట్టి గుడిలోకి వస్తుంటే, ఆకుల ప్లేట్స్ పట్టుకొని ఆటో దిగింది జయంతి. ఆటో నిండా ప్లేట్స్, కప్పులు ఉన్నాయి. జయంతి భానుమతి కూతురు. సంజయ్‌తో పాటు ఎంబీఏ చేసింది.

ప్లేట్ల బండిల్స్ దించేసి ఆటోవాడు వెళ్ళిపోయాడు. దాదాపు వెయ్యికి పైగా ప్లేట్స్ ఉంటాయి. గబగబా జయంతి దగ్గరికి వచ్చాడు సంజయ్.

"ఎలా ఉన్నావు సంజూ! ఏమన్నా జాబ్ ఆఫర్స్ వచ్చాయా?" అడిగింది జయంతి.

"ఎక్కడా? ఇప్పటికేం లేదు! అంతా ఖాళీయే...." సంజయ్ కంఠంలో నిరాశ ధ్వనించింది. ప్లేట్స్ బండిల్స్ జయంతి ఒక్కతే మోస్తుంటే, కొన్ని బండిళ్ళు తను కూడా పట్టుకున్నాడు సంజయ్.

"మార్కెట్ నుండి గుడివాళ్ళు తెమ్మన్నారా జయా?"

"లేదు సంజూ! నేను వీటిని తయారు చేస్తున్నాను. గుళ్ళకు, కల్యాణమంటపాలకు సప్లయ్ చేస్తున్నాను."

"నువ్వే ఈ ప్లేట్స్ తయారు చేసే యూనిట్ పెట్టుకున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు సంజయ్.

"ఏం చెయ్యను? ఉద్యోగం దొరకటం లేదు. నీకు మా ఇంటి పరిస్థితి తెలుసుగా! నా చదువుకే మా నాన్న తెలిసిన వాళ్ళ దగ్గర అప్పు చేశారు. అది కట్టలేక బాధ పడుతున్నారు. ఊరికే తిని కూర్చోవటం ఎందుకని బ్యాంకులోన్ పెట్టుకొని స్టార్ట్ చేశాను. నాలుగు నెలలయ్యింది. ప్రస్తుతం లోను తీర్చటానికి సరిపడా ఆదాయం వస్తోంది. నేనే ఆటోలో సప్లయ్ చేస్తున్నాను. అమ్మ, చెల్లి సహాయం చేస్తున్నారు!"

విభ్రాంతిగా జయంతి వైపు చూశాడు సంజయ్.

తమతో పోల్చుకుంటే జయంతి వాళ్ళు పేదవాళ్ళ కింద లెక్క!

జయంతి తండ్రి శ్రీనివాసరావు ఒక కిరణాకొట్టులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య భానుమతి గుడిలో మేనేజరుగా పనిచేస్తోంది. అదేమంత పెద్దదేవాలయం కాదు. అయినా ఎండోమెంట్స్ డిపార్ట్మెంటుకు లెక్కలు చూపాల్సిందే.

ఆ లెక్కలు వ్రాస్తూ, గుడిలో చిన్నాపెద్దా పనులు చేస్తూ ఉంటుంది భానుమతి. వాళ్ళకు ఇద్దరాడపిల్లలు. జయంతి పెద్దపిల్ల. చిన్నపిల్ల అవంతి ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. జయంతి చిన్నప్పటి నుండి బాగా చదివే పిల్ల. ఎప్పుడూ క్లాసులో ఫస్ట్ వస్తుంది. నల్లగా, పీలగా, పొట్టిగా ఉండే జయంతి కళ్ళల్లో మేధాసంపత్తి తొణికిసలాడుతూ ఉంటుంది.

గుడిలో ఉండే స్టోర్ రూములో ప్లేట్స్ సర్దారు ఇద్దరూ.

"నీకు తెలిసిన వాళ్ళ ఇళ్ళల్లో ఏవైనా ఫంక్షన్స్ జరిగితే ఈ ఆకుల ప్లేట్స్ గురించి చెప్తావా! కొంచెం ఆర్డర్స్ ఎక్కువ వస్తే లోన్ తొందరగా తీర్చెయ్యొచ్చు!" సంజయని అభ్యర్థించింది జయంతి.

"ష్యూర్ ష్యూర్!" అన్నాడు సంజయ్.

ఇంతలో భానుమతి 'పని ఉందంటూ' జయంతిని తీసికెళ్ళింది.

అక్కడి నుండి వెనక్కు వస్తుంటే ఫోన్ మోగింది. సుధీర!

సుధీర, సంజయ్ గర్ల్ ఫ్రెండ్.

"ఒక్కసారి అమీరుపేట దగ్గరికి వస్తావా!"

టైమ్ చూసుకున్నాడు సంజయ్.

'గుడిలో కళ్యాణం ఇంకా మొదలు పెట్టలేదు. అంతా అయ్యేసరికి సులభంగా నాలుగు గంటలు పడుతుంది. సుధీరతో మాట్లాడి వచ్చి అమ్మను ఇంటికి తీసికెళ్లొచ్చు!' అనుకుంటూ బైక్ మీద అమీరుపేటకు బయలుదేరాడు సంజయ్.

ఉద్యోగాల వేటలో ఉన్నాడు సంజయ్. సుధీర ఇంట్లోవాళ్ళు సంబంధాలు చూస్తున్నారు. ఇప్పటికి సంవత్సరంనుండి సంజయ్‌కు ఉద్యోగం వస్తుందని పెద్దవాళ్ళను ఆపగలిగింది సుధీర. అయితే ఎంతకాలం? శ్రీహరికి సుధీర తండ్రి కృష్ణమూర్తి తెలిసినవాడే. కానీ, ఉద్యోగం సద్యోగం లేని సంజయ్‌కు కృష్ణమూర్తి పిల్లనెలా ఇస్తాడు? ఒకవైపు సుధీరకు మంచి సంబంధాలు వస్తున్నాయి. కూతురి పెళ్లి గురించి బెంగ తినేస్తుంటే సగటు తండ్రిలాగా ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి.

ఎప్పుడూ వాళ్ళు కలుసుకొనే స్నాక్స్ సెంటర్ దగ్గర కూర్చుని ఉంది సుధీర.

బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ దాని మీద ఎల్లో కలర్ టీ షర్ట్. జుట్టు వదిలేసింది. మెరిసిపోయే అందం సుధీరది.

వచ్చి ప్రక్కన కూర్చున్నాడు సంజయ్.

"ఏమన్నా ఆఫర్స్ వచ్చాయా?"

మౌనంగా ఉన్నాడు సంజయ్.

సుధీర కళ్ళల్లో నిరాశ.

ఆరునెలల నుంచి సంజయతో పెళ్లి గురించి మాట్లాడుతూనే ఉంది సుధీర. ఆమె వైపు పెద్దవాళ్ళ నుండి ఒత్తిడి రోజు రోజుకూ అధికమౌతోందని తెలుసతడికి. ఏం చెయ్యటం?

చివరకు గొంతు విప్పింది సుధీర. "అమ్మావాళ్ళు మొన్న వచ్చిన సంబంధం.... ఓకే అని..." చెప్పలేక పోతోంది సుధీర.

తల విదిల్చాడు సంజయ్. అతడి ముఖం గంభీరంగా ఉంది.

"నాకు ఉద్యోగం వస్తుందో రాదో తెలియదు. నువ్వు మీ వాళ్ళు చూసిన సంబంధం చేసుకో సుధీ!" అంటూ లేచాడు సంజయ్.

"అదికాదు సంజూ..." అంటూ ఏదో చెప్పబోయింది సుధీర.

"బెస్ట్ ఆఫ్ లక్! నీ లైఫ్ బాగుండాలి! బై!" అంటూ బయటికి వచ్చాడు.

బైక్ స్టార్ట్ చేస్తూ 'ఒకసారి వెనక్కు చూద్దామా' అనుకున్నాడు.

మళ్ళీ 'వద్దులే' అనుకుంటూ గట్టిగా కిక్కుకొట్టి, స్పీడుగా బైకు మీద ఆ ప్రదేశం నుండి దూరంగా వచ్చేశాడు సంజయ్.

ఆడపిల్లలు ఏం కోరుకుంటారు? ఆర్థిక భద్రత! అదిప్పుడు తన దగ్గర లేదు. సుధీరతో గడిపిన రోజులు గుర్తుకొస్తుంటే హృదయంలో దుఃఖం సుళ్ళు తిరుగుతోంది. ఎలాగో ఇల్లు చేరాడు సంజయ్.

నీరసంగా సోఫాలో కూలబడ్డాడు.

అతడి మొహం చూసి "ఏమైంది సంజూ!" అడిగాడు శ్రీహరి.

"సుధీర పెళ్లి చేసుకుంటోంది నాన్నా!" అని మాత్రం చెప్పగలిగాడు.

కొడుకు దగ్గరిగా కూర్చుని అతడి భుజాలు పట్టుకున్నాడు శ్రీహరి.

అంతలో... కళ్యాణం పూర్తిగా చూడకుండానే, ఇంటికి వచ్చింది శారద.

చాలాసేపు కొడుకును ఓదారుస్తూ కూర్చున్నారిద్దరూ.

"నువ్వు ప్రేమించిన అమ్మాయితో పెళ్ళిజరిగే పరిస్థితులు లేవు. జీవితం అయిపోయిందని బాధ పడకూడదు. ఏమో రేపు నిన్ను ప్రేమించే జీవితభాగస్వామి దొరకొచ్చు! కాస్త మెచ్యూరిటీగా ఆలోచించు నాన్నా!" తండ్రి అలా చెప్తుంటే, చిన్నపిల్లాడిలా భోరుమన్నాడు సంజయ్.

గుండెల్లో బాధ తగ్గుతుందా? కాలమే ఔషధం..

రెండోరోజు శారదను తీసికొని గుడికి వచ్చాడు సంజయ్. అక్కడే కనిపించింది జయంతి.

"ఏదీ నీ ప్లేట్స్ యూనిట్ చూపించు!" అడిగాడు సంజయ్.

అతడిని తీసికొని తన యూనిట్ దగ్గరికి వచ్చింది జయంతి.

ఒక సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు తీసికొని అందులో మిషనరీ పెట్టుకొంది. విస్తరాకులను పేపర్‌షీట్ మీద ప్రెస్ చేసే మిషన్ అది. ఇంటినిండా కప్పుల, ప్లేట్ల బండిల్స్ ఉన్నాయి.

"ఇంకో ఆర్నెల్లు ఇలాగే గడిస్తే కొంచెం ఊపిరి పీల్చుకుంటాను!" చెప్పింది జయంతి.

"గుడ్ గుడ్! నీ ధైర్యానికి మెచ్చుకోవాలి! ఉద్యోగం కోసం చూస్తూ టైమ్ వేస్ట్ చెయ్యకుండా, మంచిదారి చూసుకున్నావు!" మనస్ఫూర్తిగా జయంతిని మెచ్చుకున్నాడు సంజయ్.

జయంతి యూనిట్ చూసాక, అతడి మనసులో ఇలాటిదే ఏదన్నా చేద్దామనే ఆలోచన వచ్చింది.

ఆ తర్వాత ఇలాటి ప్రోడక్ట్సుని తయారుచేసి అమ్మే బిజినెస్సుల గురించి కంప్యూటరులో వెదకటం ప్రారంభించాడు. ఎక్కువ పెట్టుబడి లేకుండా, కొంచెం సులభంగా సేల్ అయ్యే ప్రోడక్ట్ ఒకటి కనిపించింది. అదే టీ షర్ట్సు తయారీ యూనిట్.

పెట్టుబడి బ్యాంక్ ఇస్తుంది. కొన్ని రోజులు ట్రైనింగ్ తీసికొన్నాడు.

తల్లిదండ్రులకు చెప్పి బిజినెస్ మొదలు పెట్టాడు సంజయ్.

అతడు చదివిన ఎంబియే పరిజ్ఞానం... ఈరోజు అతడి టీ షర్ట్సును మార్కెటింగ్ చెయ్యటంలో పనికి వస్తోంది. రెండేళ్ళు తిరిగాయి. లోను తీర్చేసి కొంచెం కొంచెం లాభాలు చూస్తున్నాడు సంజయ్.

ఆ రోజు ఇంటికొచ్చి, లెక్కలు చూసుకొంటున్నాడు సంజయ్.

అతడి గదిలోకి వచ్చింది శారద.

"ఇంక నీకు సంబంధాలు చూద్దామనుకుంటున్నాము సంజూ!" అంది కొడుకు జుట్టు సవరిస్తూ.

"చూడటం ఎందుకమ్మా! నీ కోడలు నీ కళ్ళెదురుగ్గా ఉంటే!" అన్నాడు సంజయ్ నవ్వుతూ.

విస్మయంగా చూసింది శారద.

"ఎవర్రా అమ్మాయి?"

"ఇంకెవరు? మన భానుమతి ఆంటీ వాళ్ళ అమ్మాయి జయంతి."

ఇంకా ఆశ్చర్యం!

సంజయ్ తెల్లగా, చక్కని రూపసౌష్టవంతో ఆరడుగుల పొడుగు ఉంటాడు. అతడి పక్కన నల్లగా పొట్టిగా పీలగా ఉండే జయంతి! సరియైన ఈడూజోడూ కాదనిపించింది శారదకు.

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు? మన స్థాయి కాదనా?"

"అదికాదురా! పిల్ల కొంచెం రంగు తక్కువ అనీ... పైగా పొట్టి..." నీళ్లు నమిలింది శారద.

పెద్దగా నవ్వాడు సంజయ్.

"చాలా తెలివైన అమ్మాయమ్మా. ఎంత ఓర్పుగా బిజినెస్ చేస్తుందో తెలుసా! తనని చూస్తూ, తన సలహాలు తీసుకుంటూ,

నేనీ బిజినెస్ చేస్తున్నానమ్మా! ఇంకేమీ ఆలోచించకు! అందమని... ఆడంబరమని పై పై మెరుగులు చూసి సుధీర వెంటపడి వెధవనయ్యాను. నన్ను ప్రేమించే భార్య నాకు దొరుకుతుందని ఆరోజు నాన్న నాకు చెప్పిన మాట నాకు బాగా గుర్తుంది. జయంతి నా కోసమే పుట్టిందని పిస్తోంది. మొన్ననే తనని పెళ్లి గురించి అడిగాను. మీ అభిప్రాయం తెలుసుకోమంది. చెప్పమ్మా... నీకు నాన్నకు ఇష్టమేనా!" తల్లి కళ్ళల్లోకి చూస్తున్నాడు సంజయ్

సమర్థుడైన కొడుకు ఇంతగా చెప్తుంటే ఏ తల్లి మాత్రం ఏమంటుంది? కొడుకు తలనిమిరి, శుభవార్త భర్తకు చెప్పటానికి వెళ్ళింది శారద.

ఆ రోజు వాళ్ళ ఇల్లు వెన్నెల వెలుగులతో నిండిపోయింది.

# మనోనేత్రం

శ్రీసుధామయి
✆ 7981085444

***వారు ఆగిపోవడం గమనించిన నేత్ర.. "ఎదురుగా మంచులో ఎవరైనా పడిపోయి కనిపిస్తున్నారా?" అడిగింది. తాము చూసిన విషయాన్ని నేత్ర కనిపెట్టడమే కాక అక్కడ ఏముందో చెప్పడం వారికి విస్మయాన్ని కలిగించింది. ఎట్టకేలకు వారందరూ బాల్కనీ మీదకు అడుగుపెట్టారు. అక్కడ నుండి వారందరి శిఖరాగ్రానికి చేరుకోవడం మాత్రమే మిగిలింది. అప్పటికే వారిలో కొందరికి 'మౌంటెన్ సిక్నెస్' ఆరంభమైంది.***

కళ్ళున్న వారికి వెలుగు చీకట్లు ప్రత్యక్షంగా నిత్యం తారసపడుతూనే ఉంటాయి. కానీ అంధులకు మాత్రం వారి జీవితాలు నిరంతరమూ చీకటిలోనే గడిచిపోతుంటాయి. అలాంటివారు చీకటిలో చిరుదివ్వెలు వెలిగించినట్టుగా తమ ఆత్మవిశ్వాసమనే వెలుగును నింపుకుని వారి జీవితాలను వెలిగించుకుంటే.. అలాంటివారు మరెందరికో మార్గదర్శకులు అవుతారు. అంధత్వమనే చీకటిని అధిగమించి తమ మనోనేత్రంతో వెలుగును చూడగలిగినవారు జీవితంలో ఎన్నో విజయాలకు నాంది పలుకుతారు.

★★★

హిమాలయ పర్వత శ్రేణులు.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్టు శిఖరం!

ఎవరెస్టు బేస్‌క్యాంపు, ఎన్నో ప్రతికూలతలు.. మరెన్నో ప్రకృతి సవాళ్లు నడుమ ఎవరెస్టును అధిరోహించడానికి పదిమందితో కూడిన ఒక బృందం సిద్ధంగా ఉంది. ఆ బృందానికి నాయకుడు రిషి! ఆ బృందంలో ఉన్నవారందరిని చూస్తూ "మనం ఈ రోజు ట్రెక్కింగ్‌లో అత్యున్నతమైన ఎవరెస్టును అధిరోహించబోతున్నాము. అంతే కాదు, ఇవాళ మనతో పాటు కొత్త ట్రెక్కర్ కూడా ఎవరెస్టును ఎక్కడానికి మనతో పాటు వస్తున్నారు." అంటూ ఒకమ్మాయిని ముందుకు పిలిచాడు రిషి.

ఆ అమ్మాయి ముందుకు వచ్చి రిషిని చూస్తూ చిరునవ్వు నవ్వింది. మిగిలిన అందరిని చూస్తూ "నా పేరు నేత్ర... నేను మీ అందరితో కలిసి ట్రెక్కింగ్ చేయడానికి వచ్చాను." అంటూ అందరికి చెప్పింది.

అందరు చప్పట్లు కొడుతూ... "వెల్కమ్ నేత్ర" అంటూ కోరస్‌గా పలికారు.

"మనం ఈరోజు ఎవరెస్టు అధిరోహణలో భాగంగా ఆక్సిజన్ తక్కువగా ఉన్న కొండప్రాంతంలో విడిది చేసి, అక్కడి వాతావరణాన్ని అలవాటు చేసుకోబోతున్నాం." అని రిషి వివరించాడు.



అందరు తమ ట్రెక్కింగ్ సరంజామాతో ముందుకు కదిలారు. బేస్‌క్యాంపులో సుమారు మూడు వారాల పాటు ఉండి అక్కడి వాతావరణానికి అలవాటు పడినవారే! కానీ నేత్ర మాత్రం ఎన్నో ఎత్తయిన కొండలు అధిరోహించి ఉండటం వలన ఆమెకు ఆ వాతావరణం కొత్తది కాదు. వారందరు కలిసి క్యాంపు–1 చేరుకోవడానికి మెల్లిగా ముందుకు సాగుతున్నారు. అది అక్కడ నుండి సుమారుగా ఆరువేల మీటర్ల ఎత్తులో ఉంది. నేత్ర అందరితో కలిసి ముందుకు నడుస్తోంది. పైకి ఎక్కుతున్న కొద్దీ మెల్లిగా చల్లటి గాలులు మొదలయ్యాయి. శీతల వాతావరణం చుట్టుముడుతోంది. మంచు అక్కడక్కడా విరిగిపడుతోంది. రిషి ముందు నడుస్తూ మిగిలినవారిని నడిపిస్తున్నాడు. ఇంకొద్ది గంటలలో క్యాంపు–1 కి చేరుకుంటారనే సమయంలో అప్పుడు జరిగింది ఆ సంఘటన.

ఒకచోట కనిపించని మంచుపగుళ్ళు మెల్లిగా విచ్చుకుంటున్నాయి. రిషి బృందం ఒకరి వెంట ఒకరు జాగ్రత్తగా తాడు పట్టుకుని అడుగులు వేస్తున్నారు. అప్పటికే అందరూ ముందుకు వెళ్లిపోయారు. సరిగ్గా అప్పుడే నేత్ర అడుగుపెట్టిన చోట పగుళ్లు వచ్చిన మంచు ఒక్కసారిగా విచ్చుకుంది. ఆ విచ్చుకున్న మంచులోకి నేత్ర దిగబడిపోయింది. తన నడుముకి కట్టుకున్న తాడువల్ల మంచు లోపలికి కూరుకుపోకుండా ఆగిపోయింది నేత్ర. అది గమనించిన బృందం వెనక్కి వచ్చింది. నేత్ర పడిపోయిన చోట మంచును వదులు చేస్తూ ఆమెను పైకి లాగడం మొదలుపెట్టారు. సరిగ్గా అదే సమయంలో మంచు

జారిపోయి నేత్ర మరింత లోపలికి పడిపోయింది. సుమారు నాలుగైదు గంటలు శ్రమించి నేత్రను బయటకు తీశారు. కానీ ఆమెకు మంచు శీతలం వలన కంటిచూపు దెబ్బతిని... శాశ్వతంగా అంధురాలై పోయింది.

★★★

ఆరునెలల కిందట జరిగిందంతా గుర్తుకు తెచ్చుకుంటూ దుఃఖిస్తూనే ఉంది నేత్ర. ఏదో ఆలోచనలో మునిగిపోయింది. ఒక్కసారిగా ఏడుపు ఆపేసింది. 'ఔను తన నిర్ణయమే సరైంది' అని నిర్ణయించుకుంది.

తాను పడుకున్న మంచంమీద నుండి మెల్లిగా తడుముకుంటూ పైకి లేచింది. తన గది తలుపు వద్దకు వచ్చింది. తన తల్లి తనకోసమే తన గదిముందు మంచం వేసుకుని పడుకుని ఉంది. తన తల్లి నిద్రపోతోందా లేక మేలుకుని ఉందా అనుకుంటూ మంచం వద్దకు వచ్చింది. తన తల్లి మెల్లిగా గురక పెడుతోంది. అమ్మ గాఢనిద్రలో ఉంది... అనుకుంటూ మెల్లగా తనగది లోపలకు అడుగులు వేసింది నేత్ర. తన గదిలో ఉన్న ఫ్యాన్ స్విచ్ బోర్డు వద్దకు అడుగులు లెక్కపెట్టుకుంటూ వెళ్ళింది. ఫ్యాన్ ఆపేసింది. అక్కడ నుండి అడుగులు లెక్క పెట్టుకుంటూ ముందుకు వెళ్ళి, చీర చేతుల్లోకి తీసుకుంది. తన మంచం వద్దకు వచ్చింది ఫ్యాన్‌కు ఆ చీరను తగిలించడానికి ప్రయత్నించసాగింది.

ఇంతలో అక్కడికి వాళ్ళమ్మ వచ్చింది. "నేత్రా... ఫ్యాన్‌కు చీర తగిలించి ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నిస్తున్నావా?" అడిగింది.

ఒక్కసారిగా నేత్రకు దుఃఖంతో పాటు ఆశ్చర్యం కూడా కలిగింది. తనేం చేస్తుందో తనకు మాత్రమే తెలుసు. కానీ అమ్మ... తన తల్లి పుట్టుకతోనే అంధురాలు. కానీ తన చర్యలను ఎంత బాగా పసిగట్టింది. "అమ్మా..." ఏడుస్తూ తల్లిని కావిలించుకుంది నేత్ర. "నాకు బ్రతకాలని లేదమ్మా" అన్నది.

కూతురిని పొదివి పట్టుకుని అక్కడున్న మంచం మీద కూర్చోబెట్టింది ఆమె. "నేత్రా.. నువ్వెందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావో నాకు అర్థమైంది. కానీ క్షణికావేశంలో ఈ జీవితాన్ని వద్దనుకుంటే, తరువాత ఏమీ మిగిలి ఉండదు... ఈ వయసులో నాకు కడుపుకోత తప్ప!" అన్నది.

వాళ్ళమ్మను చూస్తూ నేత్ర "నాకిలా కళ్ళు లేకపోవడం.. నాకిష్టమైన ట్రెక్కింగ్‌ను వదిలేయాల్సి రావడమే కాదు. నిన్ను చూసుకోవాల్సిన నేను నీకు భారం కాలేనమ్మా!" అన్నది.

"నేత్రా... నేను పుట్టినప్పుడే నాకు కళ్ళులేవు. నన్ను మా అమ్మానాన్నా వాళ్ళ కళ్ళల్లో పెట్టుకుని పెంచారు. నా అందాన్ని చూసి మీ నాన్న ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కానీ నేను గుడ్డిదాన్ని అని నన్ను వదిలేసి వెళ్ళిపోయాడు. కానీ నేను నిన్ను మీ నాన్నలా వదిలేయలేను కదా. నేను నా గుడ్డితనంలోనే చూపును... నిన్ను పెంచడంలో వెలుగును వెతుక్కున్నాను. నా కడుపున పుట్టిన నువ్వు ఇప్పుడిలా కళ్ళు లేవని నన్ను వదిలేసి వెళ్ళిపోతే, నా జీవితం ఇప్పుడు అంధకారం అవుతుంది. నువ్వు పుట్టినప్పటి నుండి ఇప్పటిదాకా ఈ ప్రపంచాన్ని చూసావు. అన్నింటి కంటే ముఖ్యంగా నన్నే చూసుకోలేని నేను... నిన్ను నా కంటివెలుగుగా మార్చుకున్నాను. నీకు ఈ గుడ్డితనం మధ్యలో వచ్చింది. కానీ నువ్వు దాన్ని నీకు బలంగా మార్చుకోవాలి. నీ ఆత్మవిశ్వాసం ఆ గుడ్డితనాన్ని జయించాలి. కళ్ళున్నప్పుడు ట్రెక్కింగ్ చేయడం గొప్ప కాదు. కళ్ళు లేకపోయినా ట్రెక్కింగ్ చేయడం అలవాటు చేసుకో! నేను నీకు తోడున్నాను." అని చెప్పింది. అమ్మ మాటలు విన్న నేత్ర

ఆలోచనలో పడింది. నిజమే తన తల్లి పుట్టుకతో కళ్ళు లేకపోయినా తనను జాగ్రత్తగా చూసుకుంది. ఇంటిపని, వంటపని మొత్తం చేస్తుంది. వంటింట్లోకి వెళ్ళడానికి అడుగులు లెక్క పెట్టుకుని వెళ్లి, ఏ వస్తువు ఎక్కడ ఉందో సులభంగా తెలుసుకుంటుంది. ఎక్కడ నుండి ఎన్ని అడుగులు వేస్తే, ఇంట్లో ఏ వస్తువులు ఎక్కడుంటాయో అమ్మకు బాగా తెలుసు. తన తల్లి చెప్పిన మాటలు మననం చేసుకుంటోంది నేత్ర.

★★★

ఎవరెస్టు బేస్‌క్యాంపు. తొమ్మిదిమంది ట్రెక్కర్లు, ఒక ట్రైనర్‌తో కూడిన ఒక బృందం ఎవరెస్టును అధిరోహించడానికి సిద్ధంగా ఉంది. ట్రెక్కర్లందరు చాలా ఉత్సాహంగా ఉన్నారు. కానీ వారికి ఆందోళనగా కూడా ఉంది. కారణం తమ బృందానికి నాయకురాలు, ఒక 'అంధురాలు'. అంధురాలై ఉండి కూడా ఎవరెస్టును ఎక్కాలనుకోవడమే గొప్ప అయితే అంతకంటే గొప్ప విషయం.. తమ బృందాన్ని ముందుండి నడిపించడం! ఆ నాయకురాలే 'నేత్ర'!

నేత్ర వారందరిని తన మనోనేత్రంతో చూస్తూ మాట్లాడటం మొదలుపెట్టింది.

"మీరందరు కఠోరమైన, కఠినమైన శిక్షణను పూర్తి చేసుకుని ఇలా ఎవరెస్టును అధిరోహించడానికి రావడం చాలా గర్వించదగ్గ విషయం! కాకలు తీరిన పర్వతారోహకులకు సైతం ఇదొక 'టఫ్ ఛాలెంజ్.' అలాంటి టఫ్ ఛాలెంజ్‌ను నేను సైతం ఇవాళ స్వీకరిస్తున్నాను. మనం ఎత్తుకు వెళ్లే కొద్దీ, అక్కడి వాతావరణం మనకు సవాళ్లు విసురుతుంటుంది. ప్రతికూల వాతావరణం మనకు ప్రాణాలతో చెలగాటం. మనం ఇప్పుడు గుండెల నిండా సాహసాన్ని నింపుకుని ముందుకు నడవాలి!" అని వివరించింది.

నేత్ర మాటలు వింటున్న అందరు చప్పట్లు కొట్టారు. ఇప్పుడు వారందరికీ నేత్రకు కళ్ళులేవన్న విషయం గుర్తులేదు. కానీ ఆమె నింపుతున్న స్ఫూర్తి మాత్రం అణువణువునా నింపుకున్నారు. నేత్ర సారథ్యంలో వారందరు అడుగు ముందుకు వేశారు. శిఖరాగ్రానికి వారి ప్రయాణం బేస్‌క్యాంపు నుండి మొదలయ్యింది.

సుమారు ఆరువేల మీటర్ల ఎత్తున్న క్యాంపు-1 కు చేరుకుంటున్న సమయంలో సంవత్సరం కిందట తనకు జరిగిన ప్రమాదం గుర్తొచ్చింది నేత్రకు! ఆ ప్రమాదం ఇప్పుడు తనకు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తన బృందానికి సూచనలు ఇవ్వడం మొదలుపెట్టింది. "ఇక్కడనుండి మనం చాలా జాగ్రత్తగా అడుగులు ముందుకు వేయాలి. మన కాళ్ళకింద ఉన్న మంచు ఎప్పుడు కుంగిపోతుందో మనకు తెలియదు. కాబట్టి మనం వేసే ప్రతి అడుగు చాలా జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేయాలి!" అని హెచ్చరించింది.

నేత్ర సారథ్యంలో వారందరు సులభంగా ముందుకు సాగుతున్నారు. శీతలమైన మంచుగాలి మెల్లిగా వీస్తోంది. అది గమనించిన నేత్ర... "ఇక్కడ మంచుగాలులు మరికొద్ది సేపట్లో తీవ్రంగా మారబోతున్నాయి. మనం ఈ ప్రాంతాన్ని తొందరగా అధిగమించాలి" అని వివరించింది.

నేత్ర సారథ్యంలో వారందరు విజయవంతంగా క్యాంపు-1 కి చేరుకున్నారు. అందరిలో ఉత్సాహం రెట్టింపయింది. "ఇక్కడ నుండి మనం క్యాంపు-2 చేరుకోవాలి. దీనినే 'అడ్వాన్స్డ్ బేస్‌క్యాంపు' అంటారు. వాతావరణం ప్రతికూలత కూడా ఎక్కువగా ఉంటుంది!" అని అందరికి వివరించింది నేత్ర.

కొన్నిగంటల్లో వారందరు క్యాంపు–2 చేరారు. అక్కడ నుండి వెయ్యి మీటర్ల ఎత్తులో ఉన్న క్యాంపు–3, ఆ తరువాత అయిదు వందల మీటర్ల ఎత్తులో ఉన్న క్యాంపు–4 చేరుకున్నారు. క్యాంపు–4 నుండి ఇంకా పైకి వెళ్లే సమయంలో నేత్ర చెప్పడం ఆరంభించింది. "మనం ఇప్పటివరకు క్యాంపు–4 కి విజయవంతంగా చేరుకున్నాం. ఇప్పటి వరకు మనం సాధించిన విజయం సామాన్యమైనది కాదు. కానీ ఈ క్యాంపు దాటిన తర్వాత వచ్చేది 'బాల్కనీ'. దాని ఎత్తు సుమారు 8400 మీటర్లు. దీన్ని మనం దాటితేనే శిఖరాన్ని చేరుకోగలం. మనం అందుకు నడుం లోతున్న మంచులో ప్రయాణించాలి. ఏ మాత్రం తేడా జరిగినా, మనం ఈ మంచులోనే సమాధి అయిపోతాం." అంటూ చెప్పింది.

బాల్కనీ చేరుకోవడానికి వారందరు ప్రయాణం మొదలెట్టారు. ఒక్కసారిగా వాతావరణం ప్రతికూలంగా మారింది. మంచు విపరీతంగా కురవడం మొదలుపెట్టింది. గాలులు విజృంభించసాగాయి. అదే సమయంలో వారి వెంట ఉన్న నీరు, ఆహారం కూడా తక్కువగా ఉన్నాయి! అదే సమయంలో నేత్ర వారికి అడుగడుగునా ధైర్యాన్ని నింపుతూ... ఉన్న ఆహారాన్ని నీటిని అందరు సమంగా పంచుకునేటట్టు సూచనలు ఇస్తోంది. మెల్లగా పైకి ఎక్కుతున్న వారందరూ ఒకచోట ఆగిపోయారు.

వారు ఆగిపోవడం గమనించిన నేత్ర, "ఎదురుగా మంచులో ఎవరైనా పడిపోయి కనిపిస్తున్నారా?" అడిగింది. తాము చూసిన విషయాన్ని నేత్ర కనిపెట్టడమే కాక, అక్కడ ఏముందో చెప్పడం వారికి విస్మయాన్ని కలిగించింది. ఎట్టకేలకు వారందరూ బాల్కనీ మీదకు అడుగుపెట్టారు. అక్కడనుండి వారందరు శిఖరాగ్రానికి చేరుకోవడం మాత్రమే మిగిలింది. అప్పటికే వారిలో కొందరికి 'మౌంటెన్ సిక్నెస్' ఆరంభమైంది. కానీ నేత్ర వారిలో నింపుతున్న ధైర్యంతో, వారు దాన్ని అధిగమిస్తున్నారు. ఒకపక్క మంచుకొండలు విరిగిపడుతున్నాయి. మరో పక్క భయంకరమైన ఖుమ్బు హిమపాతాన్ని విజయవంతంగా దాటారు.

భయంకరమైన చలి వాతావరణంలో నేత్ర తనను తాను సంసిద్ధపరుచుకుంటూ, మిగిలినవారికి ధైర్యాన్ని నింపుతోంది. అందరూ కలిసి శిఖరాగ్రం మీద అడుగుపెట్టారు. వారందరి కేరింతలు ఆ మంచుకొండల్లో ప్రతిధ్వనించాయి.

నేత్ర కళ్ళలో కన్నీరు కిందకు జారి ఆ మంచును ముద్దాడింది. నేత్ర ఆ ఎవరెస్టు శిఖరం మీద జాతీయ పతాకం ఉంచింది.

ఆ ఎవరెస్టు శిఖరం మీద నేత్ర పాతిన జాతీయ జెండా.. రెపరెప శబ్దం చేస్తూ ఎగురుతుంటే.. ఆమె నేత్రాలు వర్షధారలై మంచుని ముద్దాడాయి! ఆమె తిరుగు ముఖంగా వేస్తున్న అడుగులు.. నేటి యువతకి మార్గదర్శకంగా అవతరించాయి!

# మారుతున్న కుర్రతరం

పి.వి.ఆర్. శివకుమార్

✆ 8779258589

***సరఫరా కోసం ఇప్పుడు వాడుతున్న ట్యాంకర్లూ, వాటిని నింపే స్టాఫ్ ఖర్చూ, ప్యాకింగ్ కోసం అవసరమౌతున్న ప్లాస్టిక్ కవర్లూ, ఆ ప్లాస్టిక్ కవర్ల ఉపయోగం తగ్గటం వలన పర్యావరణానికి జరిగే మేలు, వాటిని నింపటానికి అవసరమౌతున్న మెషినరీ, మళ్ళీ వాటి ఆపరేటర్లూ, అంచెలంచెలుగా జరిగే వ్యాపారంలో ఆలస్యమయ్యే వసూళ్ళు.. ఇవన్నీ తప్పుతాయి. కొత్త పద్ధతి వల్ల, నేరుగా కస్టమర్ డైరెక్టే అనుసంధానం అవుతాడు.***

పదవతరగతి పరీక్షా ఫలితాలు వచ్చినరోజున తల పట్టుకున్నాడు సుబ్బారావు,

"చూశావా వీడినిర్వాకం?" వాపోయాడు భార్యతో.

"పాసయ్యాను కదా!" నెమ్మదిగా అన్నాడు విష్ణు.

"ఎందుకొచ్చిన ప్యాస్‌రా ఇది? నలభై మూడు శాతం మార్కులతో! ఏ కాలేజీవాళ్ళైనా తీసుకుంటారా నిన్ను? ఈ టెన్త్ కాగానే, ఐ ఐ టి కోచింగ్‌లో చేర్పించాలని, నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం నేనూ, మీ నాన్నా!" అరిచింది అపర్ణ.

విష్ణు జవాబిచ్చాడు. "నాకు ఐ ఐ టి కి ప్రయత్నించాలని లేదు. నేను ఐ టి ఐ లో చేరుతాను. అందుకు టెన్త్ పాస్ చాలు." అదిరిపడింది అపర్ణ!

"ఐ టి ఐ ఏమిట్రా? ఎవరు చెప్పారు? అది ఒక చదువా?"

"ఐ టి ఐ లో ఏడాదో, రెండేళ్ళో నేర్చుకుంటే చాలు. ఐ ఐ టి లో నాలుగైదేళ్లు పోటాపోటీగా చదివే ఓపిక, కోరిక నాకు లేవు" స్థిరంగా చెప్పాడు విష్ణు.

సుబ్బారావుకి కోపం ముంచుకు వచ్చింది. అపర్ణకి దుఃఖం ముంచుకు వచ్చింది.

కొడుకుని ఎలా తమ ఆలోచనా ధోరణికి మళ్లించాలో వాళ్ళకి అర్థం కాలేదు.

విష్ణుకీ అర్థం కావటం లేదు, తల్లి దండ్రులకి తన ఆలోచన ఎలా నచ్చజెప్పాలో!

మొదటినుంచీ, పాఠ్యపుస్తకాలలో అతడికి జవాబుల కన్న ప్రశ్నలే ఎక్కువగా కనిపించేవి.

“నాన్నా, అశోకుడు చెట్లు నాటించి, చెరువులు త్రవ్వించాడని చదువుకోవటం మాకు ఏ విధంగా ఉపయోగ పడుతుంది?” అని ప్రశ్నించాడు తండ్రిని ఒకసారి.

“పర్యావరణం మీద ఆ కాలంలోనే ఆ మహారాజుకి ఉన్న ముందుచూపు చెప్తుంది ఆ పాఠం! అందుకే అవి మీకు చెప్తున్నారు. వాతావరణాన్ని సమతుల్యం చేసి, కాపాడే ఆ పనులు మనం చేస్తుండక పోబట్టే కదా, ఇవాళ ప్రపంచం ఇంతలా కాలుష్యపూరితం కావటం, మన పొలాలకి నీళ్ళు లేక అల్లాడిపోవటం జరుగుతోంది! గ్లోబల్ వార్మింగ్ గురించి వింటున్నాం కదా. కారణం ఇదే.” వివరించబోయాడు సుబ్బారావు.

“మీరంతా కూడా మాకన్న ముందే ఈ పాఠాలు చదువుకున్నారు కదా, మరి ఆ పనులు ఎందుకు ఆచరించటం లేదు? ఎందుకు చెట్లు నరికేసి, చెరువులు పూడ్చేసి ఇళ్ళు కడుతున్నారు?”

“అదే కదా పిటీ! చదుకున్న చదువుని జీవితానికి అన్వయించి చూడకనే, ఇలా తయారయింది సమాజం.”

“అందుకే, ఈ చదువులు మన ఆలోచన ధోరణిని మార్చటం లేదని నాకు అనిపించింది. అందుకే, మా ఆలోచనలకు పదును పెట్టి, ప్రాక్టికల్‌గా గైడ్ చేసే చదువు చదువుకోవాలని అనుకుంటున్నాను. నేను డైరీ టెక్నాలజీలో సర్టిఫికెట్ కోర్స్ చదివి, పాల గురించి తెలుసుకుంటాను.”



"టెన్త్‌లో యాభై శాతం దాటటం చేతకాలేదు గానీ, మాటలు కోటలు దాటిస్తున్నావు. పాలగురించి తెలుసుకుని ఏం చేస్తావు? పొలాలకి పాలు పడతావా?"

"ఇప్పుడే ఏమీ చెప్పలేను. చదువుకున్న తరవాత, నా ఆలోచనకి రూపం తేవటం గురించి ఆలోచిస్తాను."

"ఏమిటో అంత గొప్ప ఆలోచన? పాల ప్యాకెట్లు అమ్ముకోవటమేనా? అంతోటి పనికి టెన్త్ కూడా ఎందుకు? ఎప్పుడో మొదలు పెట్టవలసింది! ఇప్పటికే గొప్ప సంపాదనపరుడివి అయిపోయేవాడివి!" వ్యంగ్యంగా అంటున్న సుబ్బారావుకు విష్ణు జవాబు చెప్పలేదు.

అపర్ణ ఇరకాటంలో పడింది.

చదువుగొడవ తప్పితే, విష్ణు ఇంటిపనుల్లో ఉత్సాహంగానే ఉంటాడు. తల్లికి, తండ్రికి ఏ సహాయమైనా చేయటానికి సిద్ధంగా ఉంటాడు. అందుకే వాడిమీద కోపం తెచ్చుకోవటం కూడా ఆమెకు కష్టంగానే ఉంటుంది.

అపర్ణ తమ పెరట్లో తీగె కట్టి, బట్టలు ఆరేసుకుంటుంది. వర్షాకాలంలో అది ఇబ్బందిగా ఉంటుంది. వాన రాకడ పసికట్టటం కష్టం. ఉదయం తెరిపిగా ఉండి, బట్టలు ఉతికి, ఆరవేస్తే, కాసేపట్లో ఉరుములు సైతం లేకుండా వర్షం పడుతుంది! పరుగులు పెడుతూ, తీగెమీది తడి, పొడి బట్టలన్నీ తీసి లోపలికి తెచ్చుకోవాలి. ఇంట్లో ఉన్న కుర్చీల మీద, తలుపుల మీద... దొరికిన చోటల్లా ఆరేసుకోవాలి.

మళ్ళీ ఎండ పొడ వస్తే, మళ్ళీ పరుగులు... లోపలి బట్టలు బయటి తీగెల మీదికి చేరవేస్తూ!

తల్లి తిప్పలు గమనిస్తూనే ఉన్నాడు విష్ణు. ఒకరోజు తమ దొడ్లో ఉన్న చెట్లకొమ్మల్ని నరికి, తిరగేసిన పంగల కర్ర ఆకారంలో రెండు స్టాండ్లు తయారు చేశాడు. రెండింటి మధ్య దూరం ఉంచి, వృధాగా పడి ఉన్నఅయిదడుగుల వెదురు బొంగు తీసుకుని, పంగల మధ్యగా అమర్చాడు. జాయింట్ల దగ్గర తాడుతో గట్టిగా కట్టి, రూపం తెచ్చాడు.

"అమ్మా... ఇది బట్టల స్టాండ్! దీన్ని దొడ్లోనే ఉంచి, బట్టలన్నీ దీని మీద ఆరేసుకో. వాన వస్తే, ఈ స్టాండుని రెండు వైపులా పట్టుకుని, వసారాలోకి చేరవేద్దాం. ఎండ వస్తే, మళ్ళీ అలాగే బయటకు తెచ్చేసుకోవచ్చు. వానరాగానే పరుగులు పెట్టి బట్టలు తీసే పని ఉండదు." తల్లితో చెప్పాడు.

తనకు తోచినంతలో బుర్ర ఉపయోగించి, ఉన్న వనరులతోనే విష్ణు చేసిన పనికి అపర్ణ పొంగిపోయింది. వాడి ఐడియాకి కాదు, వాడు తన కష్టాన్ని పట్టించుకున్నందుకు!

సుబ్బారావుది మరో సమస్య. వర్షాకాలంలో, శీతాకాలంలో తెల్లవారు జామునే లేచి వెళ్ళి, వీధి చివర ఉన్న పాలబూత్ నుంచి ప్యాకెట్స్ తేవటం ఆయన పని. హోమ్ డెలివరీ సౌకర్యం ఉంది. అయితే, ప్యాకెట్‌కి ఇంత అని అదనపు ఛార్జ్ ఉంటుంది. స్వయంగా వెళ్ళి తెచ్చుకుంటే, ఆ అదనపు ఖర్చు కలిసివస్తుంది. సుబ్బారావుది ఆ కొద్దిపాటి ఖర్చుని కూడా పట్టించుకోవలసిన ఆర్థిక స్థితి! అందుకే ఆయనే వెళ్ళి తీసుకు వచ్చేవాడు. వాన పడుతున్నా, చలి మెలిపెడుతున్నా అక్కడ క్యూ కట్టి నిలబడటం తప్పదు. ప్రతి ఉదయం అదొక అరగంట తంతు!

గత నెలరోజులుగా విష్ణు తండ్రి డ్యూటీని స్వచ్ఛందంగా స్వీకరించాడు. పదిరోజుల తరవాత నుంచీ, పాలకి వెళ్ళిన పదినిముషాల లోపే తిరిగి రావటం మొదలు పెట్టాడు.

సుబ్బారావు ఆశ్చర్యపడ్డాడు. "అదేమిట్రా, ఇంత తొందరగా వచ్చేస్తున్నావు? క్యూ ఉండటం లేదా?"

తను అనుసరించిన పద్ధతి తండ్రికి వివరించాడు విష్ణు.

ప్రతి ఉదయం పాలకోసం అంత సమయం వృధా కావటం విష్ణుకి నచ్చలేదు. ఒకరోజు సాయంత్రం పాలబూత్ సత్యం దగ్గరకు వెళ్ళి తనసంచి, డబ్బులు ఇచ్చేశాడు.

"రేపు ఉదయం పాలప్యాకెట్స్ రాగానే, మా ప్యాకెట్స్ నా సంచిలో వేసి, పక్కన ఉండే కౌంటర్ మీద ఉంచండి. నేను తీసుకుంటాను." అని చెప్పాడు. సత్యం అందుకు ఒప్పుకున్నాడు.

రెండురోజులు గడిచేసరికి, జనం గొణగటం, ఒకరిద్దరు బాహాటంగానే అరవటం చేశారు.

'ఇదేం పని? మేమంతా నిలబడి ఉండగా, అతడికి ముందే ఎలా ఇచ్చేస్తున్నారు?"

విష్ణు వాళ్ళకి ఓపిగ్గా వివరించాడు,

"మీరుకూడా ముందురోజే మీ సంచి, డబ్బు సత్యం గారికి ఇచ్చేస్తే, ఆయన పాలు రాగానే, సంచులు నింపి, వరసగా పెట్టేస్తారు. మనం క్యూ కట్టకుండా తీసుకు వెళ్లిపోవచ్చు. పాలవేన్ సాధారణంగా తెల్లవారుఝామునకే వస్తుంది. మనం ఆ తరవాత చాలసేపటికి వస్తుంటాం. ఈ పద్ధతిలో, మనం వచ్చేలోగా సత్యంగారు వీలైనన్ని సంచులు నింపి ఉంచుతారు. సంచుల మీద మన గుర్తు ఏదైనా రాసి ఉంచుకుంటే, వెదుకులాడే శ్రమకూడా లేకుండా, సంచులు తీసుకుని వెళ్లిపోవచ్చు. సత్యంగారికీ సమయం కలిసి వస్తుంది. మనం రెండు సంచులు ఉంచుకుంటే, ప్రతి ఉదయం పాలసంచి తీసుకుని, రెండవ సంచి ఇక్కడ వదిలి వెళ్లవచ్చు. ఆ పద్ధతి ఇష్టం లేని వాళ్ళు, ఇప్పటిలాగే క్యూలో నిలబడి తీసుకోవచ్చు!"

ఈ పద్ధతి చాలా మందికి నచ్చింది. ముఖ్యంగా సత్యంగారికి! వెంటనే అమలులో పెట్టాడు.

కొడుకు చెప్పింది విన్న సుబ్బారావు ఆశ్చర్యంగా కొడుకు వైపు చూశాడు.

★★★

విష్ణు ఐ టి ఐలో చేరిపోయాడు. కోర్సులో చేరినప్పటి నుంచీ, అతడిలో మార్పు కొట్టొచ్చినట్టు కనబడ సాగింది. ఇన్స్టిట్యూట్ నుంచి వచ్చిన దగ్గర నుంచి కంప్యూటర్ ముందే కూర్చుంటాడు. శ్రద్ధగా ఏవో రికార్డ్స్ తయారు చేసుకుంటూ, నోట్స్ రాసుకుంటూ ఉంటాడు.

"ఈపాటి శ్రద్ధ చదువులో ముందే పెట్టి ఉంటే, టెంత్‌లో ర్యాంక్ వచ్చి ఉండేది. ఐ ఐ టి కోచింగ్‌లో సులువుగా సీటు దొరికేది!" గొణుక్కుంటూ ఉంటాడు సుబ్బారావు.

ఏడాది పాటు చాలా శ్రద్ధగా శ్రమించాడు విష్ణు. అతడికి తోడుగా, అదే ఐ టి ఐ లో వాక్యూమ్ సైన్స్ కోర్స్ చేస్తున్న మిత్రుడు కూడా వస్తూ ఉండేవాడు. ఇద్దరు కలిసి ఏవేవో చర్చించుకుంటూ ఉండేవాళ్లు. కోర్స్ పూర్తి చేసి, బయటకు వచ్చేనాటికి, తన

మిత్రుడితో కలిసి, ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేశాడు విష్ణు. ఆ ప్రాజెక్ట్ పేరు, 'దుగ్ధ గంగ'. నియమిత సమయాల్లో పైపుల ద్వారా ఇంటింటికీ పాల సరఫరా చేసే విధానంపై "సాంకేతిక వివరాలు, బడ్జెట్ వివరాలు, సాధ్యతా సంబంధిత సాధక బాధకాలు" ఆ నివేదికలో విపులంగా చర్చించారు.

పాలు చాలా త్వరగా చెడిపోయే స్వభావం గల పదార్థం గనుక, పైపుల్లో సరఫరా అంటే, ఎన్నో జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది.

డైరీలో ప్రాసెస్ చేసిన పాలు, శీతలస్థితిలో నిలువ చేసే ట్యాంక్‌ను సైలో అంటారు. ఆ సైలోల నుంచి అతి చల్లని పాలను, ఎన్నో కిలోమీటర్ల దూరంలో ఉండే ఇళ్లకు పైపుల ద్వారా చేరవేయటం అంత సులభం కాదు. అయితే, అన్ని జాగ్రత్తలు తీసుకుని, అత్యంత పరిశుభ్రమైన పద్ధతిలో సరఫరా చేస్తే, అసాధ్యమూ కాదు. ఇదే విష్ణు చేసిన ఆలోచన. అతడి ఆలోచనను ముందు విన్న మిత్రులు, ముందు 'అసాధ్యం' అంటూ కొట్టిపారేసినా, అతడి పట్టుదల చూసి, తామూ ఆలోచించటం మొదలు పెట్టారు.

పాలు అలా రోజంతా పైపుల్లో ఉంచితే చెడిపోవటం ఖాయం. అందుకే, ఉదయం, సాయంత్రం ఒక గంట సేపు మాత్రమే సరఫరా ఉండేట్లు, ఆ సమయం పూర్తి కాగానే, పైపుల్లోని పాలు వెనక్కి సైలోలోకి పంప్ చేసుకొగలిగితే, పాలు చెడిపోయే ప్రమాదం ఉండదు.

దానికోసం, డైరీలో వాక్యూమ్ పంపింగ్ ప్రక్రియ నిర్మించి, పైపుల్లోని మిగులుపాలు ప్రతి పూటా తిరిగి సైలోలలోకి చేర్చే ప్రణాళిక రచించారు విష్ణు బృందం.

పాల సరఫరా పూర్తి కాగానే, ఏపూటకాపూట పైప్‌లైన్ మొత్తాన్నీ సి ఐ పి క్లీనింగ్ పద్ధతిలో శుద్ధి చేయటం మరో ప్రక్రియ. ఆ విధంగా ఆ పైపుల్లోకి బాక్టీరియా చేరే అవకాశం అరికట్టబడుతుంది.

విష్ణు తన పథకాన్ని లోకల్ డైరీవాళ్ళకు వివరించాడు. తర్జన భర్జనల తరవాత వాళ్ళు అతడి ప్రతిపాదనలోని లాభాలని, ప్రజలకు కలిగే సౌలభ్యాన్నీ గుర్తించారు. సరఫరా కోసం ఇప్పుడు వాడుతున్న ట్యాంకర్లూ, వాటిని నింపే స్టాఫ్ ఖర్చూ, ప్యాకింగ్ కోసం అవసరమౌతున్న ప్లాస్టిక్ కవర్లూ, ఆ ప్లాస్టిక్ కవర్ల ఉపయోగం తగ్గటం వలన పర్యావరణానికి జరిగే మేలు, వాటిని నింపటానికి అవసరమౌతున్న మెషినరీ, మళ్ళీ వాటి ఆపరేటర్లూ, అంచెలంచెలుగా జరిగే వ్యాపారంలో ఆలస్యమయ్యే వసూళ్ళు... ఇవన్నీ తప్పుతాయి. కొత్త పద్ధతి వల్ల, నేరుగా కస్టమర్ డైరీకే అనుసంధానం అవుతాడు. గ్యాస్ లాగానే, మీటరింగ్ పెడితే, నెలనెలా బిల్లు పంపి, డబ్బు ఆన్‌లైన్‌లో వసూలు చేసుకోవచ్చు.

పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు జరపదలిచాక, ఆ డెయిరీ చుట్టుపక్కల అయిదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇళ్ళవాళ్ళని సంప్రదించి, వాళ్ళ ఆమోదం తీసుకున్నారు. డైరీ యాజమాన్యంతో పాటు విష్ణు, అతడి మిత్రులు భాగస్థులుగా ఉండేలా ఒప్పందం జరిగింది. పెట్టుబడి విషయంలో, సింహభాగం డైరీ యాజమాన్యం భరించగా, మిగతాభాగం విష్ణు, అతడి మిత్రులు భరించేలా తీర్మానించుకున్నారు. ప్రాజెక్ట్ రిపోర్ట్ చూసిన స్థానిక బ్యాంక్ వారు, ఒక కొత్త విప్లవానికి బీజం పడుతోందని ఊహించారు. పూచీకత్తు లేకుండానే, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్ క్రింద విష్ణుకి లోన్ మంజూరు చేశారు.

పైపుల్లో వచ్చే పాలధర కొంత పెరిగినా, ఇంట్లోనే పంపులో నీళ్ళు పట్టుకున్నట్టుగా, పాలు పట్టుకోవచ్చునన్న ఉత్సాహంతో గృహస్థులు ఆ హెచ్చుధరకి తలలు ఊపారు.

ఇప్పుడు సుబ్బారావు చేయి తలమీద నుంచి క్రిందకు జరిగి, మీసం మీదకు వెళ్ళింది.

'క్వాలిఫికేషన్ కాదే... తెలివితేటలు ఉండాలి. మనిషి పైకి రావటానికి చదువు కొలమానం కాదు. బుర్ర... బుర్రలో గుజ్జు ఉండాలి' అని, పోజు కొడుతూ అపర్ణతో చెప్తున్నాడు. అపర్ణ సంతోషంగా నవ్వేస్తోంది. విష్ణు మాత్రం ప్రాజెక్ట్ పనిలో తల మునకలౌతున్నాడు. ఈ ప్రాజెక్ట్ అమలులోకి వచ్చి, విజయవంతమైతే, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే ప్రతిపాదన ప్రభుత్వం ముందుకు తీసుకు వెళ్ళటం అతడి తరువాతి పథకం.

# సర్దుకుపోదాం రండి!!

ప్రశాంత్ వర్మ ఉప్పలపాటి

✆ 8121534453

***ఇన్నాళ్ళూ నా సహధర్మచారిణిగా నాకు సేవలు చేసినందుకు నా సంపాదనలో మూడువంతులు నీకే ఇచ్చేస్తున్నాను. ఇల్లు నువ్వే ఉంచుకో. నేను కూడా నా మనసుకు నచ్చింది ఎలాంటి సర్దుబాటు లేకుండా చేస్తూ నా మిగిలిన జీవితం గడపాలని నిర్ణయం తీసుకుని వెళ్తున్నాను. నా కోసం వెతకొద్దని కోరుతున్నాను.***

"నువ్వసలు తల్లివేనా!?" భార్య మీద అరిచాడు.

"ఎందుకు నామీదరుస్తారు? దానికిష్టంలేక అదొచ్చేసింది. నేనేదో దగ్గరుండి పిల్చుకొచ్చినట్టు మాట్లాడతారేం?"

"అదొస్తే మాత్రం... సర్దిచెప్పి కాపురాన్ని చక్కదిద్దడం మన బాధ్యత! అంతేకాని ఇలా వాడు కాకపోతే ఇంకొకడు, ఎవడూ లేకపోతే మేంలేమా నీకు ... అంటూ రెచ్చగొట్టడమేంటి?"

తల్లిదండ్రుల మధ్య వాగ్వాదం దూరంగా నిలబడి చూస్తుంది మాళవిక. పెళ్ళయ్యి ఏడాది కాలేదు. నాలుగు నెలలు బానే గడిచిపోయింది. ఈ మధ్యనే ఉద్యోగం, బాధ్యతలు సమానత్వం అనే విషయాల్లో ఇద్దరి మధ్యా సమస్యలు మొదలయ్యాయి.

ఇంటిపనిలో తనకేం సంబంధం లేదంటాడు రంజిత్. 'నాకు మాత్రం ఏముంది, నేనూ సంపాదిస్తున్నా...' అంటుంది తను. పోనీ మనిషిని పెట్టుకుందామంటే... వచ్చే మనిషి లెక్క ప్రకారం చేసేసి వెళ్ళిపోతుంది. ఎంత పనిమనుషులున్నా తమకంటూ చేసుకోవాల్సిన పనులు కొన్నుంటాయి. అక్కడే ఇద్దరికీ గొడవ మొదలౌతుంది.

చూసి చూసి.. ఇక పడలేక వచ్చేసింది మాళవిక. 'ఉంటావో, పోతావో నీ ఇష్టం' అని వదిలేశాడు రంజిత్.

"కాకపోతే ఏంటి? మన పిల్లని మనమెలా పెంచాం? కాలు కందనిచ్చామా! అలాగని అదేమైనా తిని కూర్చుందా? కష్టపడి చదివింది. ఈరోజు లక్షలు సంపాదిస్తుంది. అలాంటిదాన్ని పట్టుకుని వండిపెట్టు, గిన్నెలు కడుగు, ఇల్లు తుడువు అంటే అదెక్కడ చేస్తుంది?"

"ఎవ్వరైనా చేసుకునే పనులేగా! ఆ మాత్రం దానికి వదిలేసి రమ్మంటావా? నువ్వు చక్కబెట్టలేదా ఇన్నాళ్ళు? నీ శ్రమేం లేకుండానే ఇవాళ ఇలా ఉన్నామా?"

"నాకంటే చదువు లేదు కాబట్టి చాకిరీ అంతా చేసాను. ఆ చదువే ఉండుంటే నేనూ ఊర్లు ఏలేదాన్ని!"

★★★



“చదువుకుంటే మాత్రం… ఇంటిని చక్కబెట్టుకోవద్దనేమన్నా ఉందా అమ్మా?” అడిగాడు రంజిత్.

“లేదు కదా! అప్పుడు మగపిల్లాడు కూడా ఇంటి పనులు చేయకూడదనేమీ లేదు కదరా! ఆపిల్ల నిన్ను పనిలో సాయంగా ఉండమంటుందే తప్ప, చాకిరీ అంతా నీ నెత్తిన వేయడం లేదుగా!”

“మరైతే నువ్వెందుకు నాకెప్పుడూ పని చెప్పలేదు? పైగా నాన్న చెప్పబోతే మగపిల్లాడినని, ఇంట్లో పని చేయమనడం సరైంది కాదని అడ్డు చెప్పేదానివిగా!”

“ఒక్కడే కొడుకువని నీ మీద ప్రేమతో అడ్డు చెప్పానే తప్ప, చేయడం తప్పని కాదు, చేయకూడదనీ కాదు!” వేలు తన వైపు తిరిగేసరికి కంగారుపడింది రంజిత్ తల్లి.

"భార్యాభర్తలంటే ఒకరికొకరు, ఒకరికోసం ఒకరు! జీవితాన్ని సమానంగా ఆస్వాదించాలి. ఏ వైపు బరువెక్కువైనా నావ ఎలా మునిగిపోతుందో, ఏ ఒక్కరిలో అసంతృప్తి మొదలైనా సంసారనావ కూడా అలానే మునిగిపోతుంది! ఇద్దరూ డిగ్రీలు చదివారు. అడవిలో కాకుండా సమాజంలోనే పెరిగారు. ఉద్యోగాలు చేసే చోట ఎలాగైతే సమస్యలను పరిష్కరించుకుంటారో, ఇక్కడా అదే పనిని చేయాలి. ఇలా వదిలించేసుకుని వచ్చేద్దామనుకోవడం సరైంది కాదురా!" రంజిత్ తండ్రి అన్నాడు.

"సలహాలు ఇచ్చినంత సులువు కాదు నాన్నా! ఏ రోజూ నేను ఆఫీసులో ఇంత ఒత్తిడి అనుభవించలేదు. ఎప్పుడెప్పుడు ఇంటికెళదాం అనే దానికన్నా, అప్పుడే వెళ్ళాలా అనేంత వరకూ వచ్చేసింది!"

"కావచ్చు... దాన్ని నువ్వే నెమ్మదిగా పరిష్కరించుకోవాలి. పైగా మాళవిక కోరింది కష్టసాధ్యమేమీ కాదు."

"ఎందుక్కాదు? ఈరోజువరకూ నాకు అలవాటు లేనిది, ఒక్కసారిగా తనొచ్చి పనిలో సాయమంటే ఎలా! ఐనా చదువుకుని సంపాదిస్తున్నంత మాత్రాన ఇంటిపని చేయలేను అంటే ఎలా! పోనీ నేనేమైనా అడిగానా సంపాదించమని? చదువుకుంటే ఉద్యోగం చేయాలని ఉందా? అంత ఇబ్బందిగా ఉంటే మానేయాలి."

★★★

"నువ్వు ఇంట్లో ఉంటేనే ఇలా ఉంది, ఇక ఊర్లు ఏలితే ఆపలేకపోయేవాడిని!" భార్యతో అని, "ఒక్కడే కొడుకు ఇంట్లో గారాబంగా పెరిగాడు. వాళ్ళు తనకి ఎప్పుడూ పని చెప్పకపోవడం వల్ల తనలా ఉన్నాడు. మెల్లగా సర్ది చెప్పాలి, అందాక సర్దుకోవాలి. అంతేగాని ఇలా చేయడం సరైంది కాదు." కూతురుతో చెప్పాడు.

"అలాంటప్పుడు నన్ను చదివించకుండా ఉండాల్సింది. తీరిగ్గా ఇంట్లోనే ఉండి పనులు చేయడం అలవాటు చేసుకునేదాన్ని! ఇంత చదువు చదివింది దేనికోసం? మొగుడనేవాడు రాగానే దాన్ని మూట కట్టేసి మూలన పడేయడానికా?"

"కాదు. ఆర్థికంగా కూడా ఒకరికొకరు తోడుగా నిలబడతారని."

"అదేకదా, అమ్మాయి అంటుంది. ఇంటిపనిలో కూడా అతగాడిని తోడుగా ఉండమంటుంది. అతడేమో మగాడినన్న అహంకారం చూపిస్తున్నాడు." మాళవిక తల్లి కోపంతో అంది.

"అహంకారమని ఆలోచిస్తున్నంతసేపూ సమస్య పెద్దదవుతుందే తప్ప పరిష్కారం కనిపించదు. పెరిగిన వాతావరణం అతడితో అలా మాట్లాడిస్తుంది. మనమే సర్దిచెప్పుకోవాలి. ఇంకా కావాలంటే అలా కష్టపడే వాళ్ళని చూపించాలి."

"అలాంటివి చూడకుండానే పెరిగాడంటారా నాన్నా?" మాళవిక ప్రశ్న.

"నా ఉద్దేశ్యం అతడు చూసినవాటిల్లో ఏదో ప్రత్యేక అవసరం కనిపించి ఉంటుంది. అందుకే అలా ఉన్నారని అనుకుని ఉంటాడు. ఇక్కడ రంజిత్‌కి ఉద్యోగం పెద్దది. సంపాదనా అవసరానికి మించే ఉంది. భార్య తెస్తేనే గడిచే పరిస్థితిలో అతను లేడు. అందుకే తను మనమ్మాయి ఉద్యోగానికి ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. మంచి భార్యగా తనని చూసుకుంటే చాలని అనుకుంటున్నాడు."

"నాకంటూ ఓ జీవితం ఉండాలని ఉండదా? ఇంట్లో వండి పెట్టడమే పనా? వండిపెట్టె మనిషే కావాలని అనుకుంటే... ఓ పనిమనిషిని పెట్టుకుంటే పోద్ది! దానికి లక్షలు తగలేసి పెళ్లిచేసుకోవడం దేనికీ?"

“నీకంటూ జీవితం లేదని, ఉండదని ఎలా అనుకుంటున్నావ్? ఉద్యోగం చేసి సంపాదిస్తేనే జీవితమా! ఆడవాళ్ళకి తమ ఉనికిని చాటుకోవడానికి ఉద్యోగమే మార్గమా!?”

“మీరూ అతడికే వత్తాసు పలుకుతున్నారా? ఎంతైనా మగాళ్లే కదా!” భార్య అంటుంటే కన్నెర్రజేశాడు. ఆమె మౌనం వహించింది.

“అమ్మ అన్నదాంట్లో తప్పేముంది నాన్నా! ఉద్యోగం, సంపాదన అక్కర్లేనప్పుడు, నన్ను అందాక చదివించడం దేనికి? నేను కష్టపడి డిగ్రీలు సాధించడం దేనికీ?”

“నీకు చదువు నేర్పింది నీ భవిష్యత్తు కోసమే. రేపటి రోజున నీ కాళ్ళ మీద నువ్వు నిలబడాలనే ఉద్దేశ్యంతోనే! నీ అదృష్టం నువ్వు సంపాదించాల్సిన అవసరం లేకుండానే నీకు మంచిజీవితం అమరింది. ఒక్క ఇంటిపని విషయం తప్ప అన్ని రకాలుగాను రంజిత్ మంచివాడే. ఒకవేళ అతడు సరైనవాడు కాకపోయుంటే, అప్పుడు నిన్నే సమర్థించేవాడిని. సమస్యను అతడి కోణంలో ఆలోచించి కూడా అర్థం చేసుకోమంటున్నాను. అతడికి విషయం అర్థమయ్యేలా చెప్పు అంటున్నాను.”

“అయితే ఉద్యోగం మానేసి ఇంట్లో ఉండమంటారు. లేదంటే ఉద్యోగం చేస్తూనే ఇంట్లో అతడికి ఊడిగం చేయమంటారు అంతేగా!”

★★★

“తనేదో ఊసుపోక, కాలక్షేపం కోసం చదవలేదు. ఒక ఆశయంతో కష్టపడి చదివింది. ఈరోజు నీతో సమానంగా మంచి పొజిషన్లో ఉంది. ఆ చదువుకునే క్రమంలో ఇంటిపనుల మీద, ఇదిగో పెళ్ళైతే జీవితం ఇలా మారడం మీద... ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. అందుకే తనకి సమస్య అర్థం కావడానికి, సర్దుబాటు చేసుకోవడానికి కాస్త సమయం అవసరమౌతుంది. ఆ విషయం మినహా, తనలో లోపమేంటి చెప్పు!”

“లేదు నాన్నా... కాకపోతే నాకు ఇంటిపని చెప్పడంలోనే సమస్యంతా! నేనెప్పుడూ ఇంట్లోనూ, బయటా చదువూ, నా వ్యాపకం తప్ప ఇలాంటి పనులు చేసింది లేదు.”

“కాదు... నీకా అవసరం మేం రానివ్వలేదు. ఆలోచిస్తే... ఇప్పుడు అదే మా తప్పుగా అనిపిస్తుంది. మొదట్లోనే ఆ పని చేసుంటే, ఇవ్వాళీ సమస్య వచ్చేది కాదేమో!” అన్నాడు రంజిత్ తండ్రి.

“ఇది మరీ బాగుంది. ఒక్కగానొక్క పిల్లాడు. వాడిని గారంగా చూసుకోవడం తప్పెలా అవుతుంది? ఒక్కడే కాదు, ఇద్దరున్నా ఇలానే చూసుకునేవాళ్ళం. తల్లిదండ్రులుగా వాళ్ళని మనం చదివించి ప్రయోజకుల్ని చేయాలని చూస్తాం కానీ, పనులు నేర్పించి పనిమంతుడుగా చూడాలనుకోము కదా! ఆ మాటకొస్తే పెళ్ళిచేసి అత్తారింటికి తమ పిల్లని పంపేవాళ్ళే ఇవన్నీ ఆ పిల్లకి చెప్పుకోవాలి.”

“గారంగా చూసుకోవడం అంటే పనీపాటా నేర్పకుండా తిండిపెట్టి కూర్చోపెట్టడం కాదు. మనమున్నప్పుడే కాదు, లేనప్పుడు కూడా పిల్లలు ధైర్యంగా నిలబడేలాగ, ప్రతిదానికి ఒకరిమీద ఆధారపడకుండా వాళ్ళ జీవితాలని వాళ్ళు

చక్కదిద్దుకునేలాగా పెంచడం! బ్రతకడానికి డబ్బు అవసరం. దాన్ని సంపాదించే చదువు నేర్పించాం తప్ప, ఎదురుదెబ్బలను, సమస్యలను తట్టుకుని ముందుకెళ్ళే జీవితపాఠాలను నేర్పలేదని ఇప్పుడే అర్థమౌతుంది."

★★★

"నీకున్న తెలివితేటలతో ఉద్యోగంలో సమస్యలను ధైర్యంగా ఎదుర్కొగలుగుతున్నావు. అందుకు ఈరోజు నువ్వున్న స్థాయి ఉదాహరణ! కానీ, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు లొంగిపోతున్నావు. దాన్నుండి తప్పించుకోవాలని చూస్తున్నావు. కేవలం రంజిత్ పనిలో సాయంగా ఉండటం లేదనే చిన్న కారణంతో వదిలేయాలని అనుకుంటున్నావు. రేపటి రోజున సమాజం నీ గురించి వందర రకాలుగా మాట్లాడుతుంది. నీ చుట్టూ ఉన్న మగాళ్ళ చూపులు ఒంటరైన నీ వైపు ఆశగా చూస్తాయి. ఇవి ప్రధానమైనవి అయితే, ఇలాంటివి ఎన్నో సమస్యలు నీ చుట్టూ చేరతాయి. వాటిని ఎలా ఎదుర్కుంటావు? ఎన్నింటి నుండి తప్పించుకుంటావు?"

"నాన్నా! మీరు మరీ అమాయకంగా ఉన్నారు. ఈరోజుల్లో అంతా సవ్యంగా ఉంటేనే మీరన్నవన్నీ జరుగుతున్నాయి. ఇక విడిగా ఉంటే ఎలా ఉంటుందో నాకా మాత్రం తెలీదా?"

"అంతే తప్ప అతడితో సర్దుకోలేనంటావ్!"

"లేదు నాన్నా! ఈ సర్దుకుపోయే విధానం నాకొద్దు. ఒక్కసారి తగ్గితే ప్రతిదానికి ఇదే అలవాటవుతుంది. ఏదైతే అదే కానివ్వండి. ఒకవేళ మీకేమైనా ఇబ్బంది అయితే... నా బ్రతుకేదో నేను బ్రతుకుతాను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టను, మీకు భారం కాను."

మాళవిక చెబుతుంటే పరిస్థితి చేయిదాటిపోయిందని అర్థమైంది. దీనికి సగం కారణమైన భార్య వైపు కోపంగా చూస్తూ లోపలికి వెళ్ళిపోయాడు ఆమె తండ్రి.

★★★

"ఇది మరీ బాగుంది, ఒక్కగానొక్క కొడుకు. మీరు పడిన కష్టం వల్లనే ఈరోజింత సుఖంగా ఉన్నాం. మనం పడిన కష్టం మన పిల్లలు పడకూడదనే వాడిని అపురూపంగా పెంచాం. ఆ ఆలోచన తప్పని ఇప్పుడేగా అర్థమైంది. మనం చేసిన గారం, ఈరోజు వీడి జీవితాన్ని ఇలాంటి సమస్యల్లోకి నెడుతుందని ఊహించామా! ఐనా ఆడపిల్ల తనైనా కాస్త తగ్గచ్చుగా?"

"మళ్ళీ అదేమాట. ఆడపిల్ల అయితే తగ్గాలా? ఆమాట నేను అనుంటే సరే. ఒక మహిళగా నువ్వనడమే బాలేదు. రోజులు మారాయి. ఇప్పుడు ఆడ, మగ అనే వ్యత్యాసం తప్ప ఇతరత్రా అన్ని విషయాల్లో సరిసమానంగా పోటీ పడుతున్నారు. మనమే లోకం తీరు గమనించుకుని, పిల్లలని మారుతున్న పరిస్థితులకి అనుగుణంగా పెంచుకోవాలి. ఇద్దరికీ అన్నీ సమానంగా అలవాటు చేయాల్సిన అవసరం ఉందని ఇప్పుడు అర్థమవుతుంది." నిట్టూరుస్తూ అన్నాడు.

"ఈసారికి కొంచెం నువ్వైనా తగ్గచ్చుకదా!" కొడుకుని అడిగింది తల్లి.

"ఉద్యోగం వదిలేసి ఇంటిపట్టునే ఉండి వంట చేసుకోమంటావా? అదే సరైందంటే చెప్పు, రేపటి నుండి ఇంట్లోనే ఉంటాను. వంటావార్పూ నేర్పించు." కోపంగా బదులిచ్చి తన గదిలోకి వెళ్ళిపోయాడు రంజిత్.

★★★

"ప్రియమైన శ్రీమతికి ప్రేమతో...

ఇన్నాళ్ళ నీ సహచర్యంలో నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. నువ్వూ అలానే ఉన్నావనే అనుకున్నాను. ఇప్పుడే నాకు అర్థమైంది. నువ్వూ నేనూ ఇద్దరం సంతోషంగా లేమని! ఒకరికొకరం సమాజం కోసం సర్దుకుపోయామని... ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది. మనకి మన పెద్దలు నేర్పింది అదే కదా! నేను నీ మీద కోప్పడినా, నువ్వూ నా మీద అరిచినా నా భార్యే కదాని నేనూ, నేనే కదాని నువ్వూ ఇన్నాళ్ళూ సర్దుకుపోయాం! ఐనా ఎన్నిసార్లు మనం గొడవ పడలేదు, మాట్లాడుకోవడం మానేసిన రోజులు ఎన్ని లేవు నిన్నమొన్నటి వరకూ! ఇంకా కలిసుంటే ఇప్పటికీ అలానే ఉంటాం. నీ కోపం పోవడానికి నీ కోసం నేను వండిపెట్టిన రోజులు గుర్తున్నాయా నీకు? ఏంటో ఎప్పుడూ మగాడిని నేను చేయడమేంటి అనుకోలేదు. నీ ఆరోగ్యం బాగాలేకపాతే, నువ్వు కూర్చుని చెబుతుంటే, నేను వండివార్చిన రోజులు నాకిప్పటికి గుర్తే! అలాగే నేను కోప్పడితే నాకిష్టమైనవి చేసి, నన్ను నువ్వు బ్రతిమాలుకున్న రోజులెన్ని లేవు. అప్పటికి ఏమైనా కానీ, ఇలాంటివి లేకపోతే మన సంసారంలో చిలిపి తీపి గుర్తులెక్కడివి! ఇప్పటికీ వాటిని తలుచుకుని మనం నవ్వుకోవడం లేదా! అయితే ఇదంతా తప్పని, తప్పనిసరై అలా ఉన్నామని, మారిన పరిస్థితులలో ఇక మీదట ఎవ్వరూ కూడా అలా ఉండక్కర్లేదని..చెప్పకనే చెబుతున్నాయి. సాక్ష్యం... నిన్న ఇంట్లో జరిగిన చర్చనే! నువ్వూ దాన్నే సమర్థించావు. అంటే నీకు నాతో కలిసి ఉండటం ఎంత ఇబ్బందిగా ఉందో అర్థమైంది. అందుకే ఇకమీదటైనా, నువ్వు నీకు నచ్చినట్టు సంతోషంగా జీవించు. నీకెలా ఉండాలనిపిస్తే అలానే ఉండు. నా కోసం ఎందులోనూ రాజీపడాల్సిన అవసరం లేదు. ఇన్నాళ్ళూ నా సహధర్మచారిణిగా నాకు సేవలు చేసినందుకు నా సంపాదనలో మూడువంతులు నీకే ఇచ్చేస్తున్నాను. ఇల్లు నువ్వే ఉంచుకో. నేను కూడా నా మనసుకు నచ్చింది ఎలాంటి సర్దుబాటు లేకుండా చేస్తూ నా మిగిలిన జీవితం గడపాలని నిర్ణయం తీసుకుని వెళ్తున్నాను. నా కోసం వెతకొద్దని కోరుతున్నాను.

ఇట్లు..."

ఆఖరున భర్త సంతకం చూసి ఘొల్లుమంది మాళవిక తల్లి. ఆమె ఏడుపుకి కంగారుపడిన మాళవిక ఉత్తరం మొత్తం చదివి చిన్నపాటి షాక్‌కి గురైంది.

మరో వైపు రంజిత్ కూడా తల్లి చేతిలో ఇలాంటి ఉత్తరమే చూసి కంగారు పడిపోయాడు.

★★★

"రంజిత్ టిఫిన్ రెడీనా! నాకు ఆలస్యమౌతుంది." అరిచింది మాళవిక.

"అలా అరిచే బదులు టేబుల్ దగ్గరకి వచ్చి చూసుకోవచ్చుగా. బద్ధకం పెరిగిపోయింది నీకు." అంతే గట్టిగా బదులిచ్చాడు.

"నువ్వెంత చురుకో మరి! ఆఫీసు నుంచి వచ్చేసరికి అయ్యగారికి చేతికిస్తే సరిపోదు. ముద్దలు చేసి నోటికివ్వాలి. వండిపెట్టడమే పని అనుకుంటే, ఈ తినిపించడాలు కూడా! మళ్ళీ నాకు బద్ధకం అని పేరు..." అంటుండగా వెనకనుండి వచ్చి ఆమె నడుముని చుట్టేసాడు.

"దీనికి మాత్రం అస్సలు బద్ధకం ఉండదేం." అని నవ్వుతూ, "ఇవన్నీ సాయంత్రం.. నాకు ఆలస్యమవుతుంది." అని చేతులు విడిపించుకుని టిఫిన్ తినడం కోసం టేబిల్ వైపు అడుగులేసింది.

★★★

ఒకరకంగా పిల్లల ఈ ప్రవర్తనకి తల్లిదండ్రులుగా తమ బాధ్యత కూడా ఉంది కాబట్టి, పిల్లలు మాట వినడం లేదని, వినరని అర్థమైన ఇద్దరి తండ్రులు రహస్యంగా కూడబలుక్కుని నాటకమాడి తమ భార్యలను, పెంపకాన్ని సరిదిద్దుకున్నారు.

# అమ్మ నవ్వింది

**గౌతమ్ లింగా**
(దక్షిణాఫ్రికా)
✆ +27 630255994

***వాడి తల నా చెంపకి ఆనిచ్చుకొని పడుకున్నాను. ఇల్లంతా నిశ్శబ్దం, వాడి శ్వాస నాకు తగలట్లేదు, గుండె చప్పుడు నాకు తెలియట్లేదు. నా మూడేళ్ళ కొడుకు చనిపోయాడు. రాత్రంతా అలానే పడుకోబెట్టుకున్నాను, ఏవేవో కథలు చెప్పాను, వాడు వింటూ పడుకున్నాడు. తెల్లవారబోతుంటే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను, నాకన్నా ముందు వాడ్ని తీసుకెళ్ళినందుకు!***

నా పేరు దుర్గ, అమ్మవారి పేరు, రూపం కూడా అలాంటిదే అని అందరూ అంటుంటే మా నాన్న మురిసిపోయేవారు! అమ్మానాన్నలకు నేనొక్కదాన్నే! నాన్న మా ఊర్లోనే మాకున్న ఇటుకబట్టీలు, పొలాలు చూసుకుంటాడు, అమ్మ మా ఇద్దరినీ చూసుకుంటుంది. నేను అల్లారుముద్దుగా, అల్లరిపిల్లగా పెరిగాను. పెళ్ళయ్యేదాకా కనీసం వంటగదికి వెళ్లాల్సిన అవసరమైనా రాలేదు. మా ఇంట్లో నా మాటకి అడ్డుండదు. ఎక్కువసార్లు నవ్వడం, కొన్నిసార్లు నవ్వించడం, అన్నిసార్లూ అల్లరి పనులు చేయడంతో... నా బడి చదువు పూర్తయింది. కాలేజీ చదువుకి పదికిలోమీటర్ల దూరమున్న ఊరు వెళ్ళాలి. అందరిలాగే నేను కూడా ఇంటర్మీడియట్ చదువు కోసం బస్సులో వెళ్లేదాన్ని. మొదటి ఆర్నెల్లు చాలా సరదాగా సాగిపోయాయి. కొత్త స్నేహితులు, రెక్కలొచ్చిన వయసు... కొత్త ఉత్సాహాన్ని మోసుకొచ్చాయి. నాకెందుకో ఆ రోజులు చాలా నచ్చాయి. పెద్దగా చదవకపోయినా మంచిమార్కులే వచ్చేవి. నాకొచ్చే గొప్ప మార్కుల కోసం మా ఊర్లో, మా ఇంట్లో ఎదురు చూసే వాళ్ళెవ్వరూ లేరు, కాబట్టి నేను కూడా వాటి కోసం ప్రయత్నించలేదు.

ఒకరోజు బస్సులో కిటికీ పక్కన కూర్చొని, చిన్నగా నిద్ర ఒళ్ళోకి వెళ్ళబోతున్నాను, పక్కనే ఉన్న అనిత నన్ను సున్నితంగా లేపి, “దుర్గమ్మా, రోజూ నీ కిటికీ పక్కనే బండిమీద వచ్చే వాడెవడమ్మా?” అని అడిగింది,

నాకేమీ అర్థం కాలేదు, “ఏంటీ?” అన్నాను

“నువ్వు కిటికీ పక్కనే కూర్చోవడం, నీ పక్కనే ఎవడో రోజూ బండి మీద నిన్నే చూసుకుంటూ రావడం... నేను రోజూ చూస్తున్నా” అని అనిత అనగానే, ముందు భయమేసింది.

తరువాత అబద్ధం అనిపించి బయటకు చూస్తే, నిజంగానే ఎవరో బండిమీద నా పక్కనే వస్తున్నాడు. ఒక్క క్షణం గుండె ఆగినంత పనయ్యింది. వెంటనే కిటికీ మూసేసి, వేరే సీట్లోకి మారిపోయాను. కానీ ఏదో ఉత్సుకత నన్ను వెంటాడుతూనే ఉండేది. నిజంగానే నాకోసం వస్తున్నాడా, నేనే తప్పుగా అర్థం చేసుకుంటున్నానా? అనే సందేహం వచ్చినా, మళ్ళీ అటు వైపు చూసే ధైర్యం చేయలేదు.

వారం పదిరోజులు గడిచేదాకా... మళ్ళీ ఎప్పుడూ కిటికీ పక్కన కూర్చోలేదు. కానీ ఒకరోజు 'నేనేమీ తప్పుచేయలేదు కదా, నాకు నచ్చినచోట నేను ఎందుకు కూర్చోకూడదు' అనిపించి, అదే సీటులో కూర్చున్నా! ఓ అరగంటకి నా పక్కన ముదురు నీలంరంగు బైక్ ప్రత్యక్షమైంది. అతని ముఖం చూసే ధైర్యం చేయలేదు కానీ, పొడుగుగా పెరిగిన నల్లని జుట్టు, వీపుకి తగిలించుకున్న ముదురు ఖాకీ రంగు బ్యాగు, గేర్లు వేయడానికి... ముందుకీ వెనక్కీ ఆడిస్తున్న కాళ్ళు, వాటికి తగిలించిన నలుపు తెలుపు కాన్వాస్ షూస్, మణికట్టుకు ఏదో పూసలదండ... ఇవన్నీ కనిపించాయి. నాకోసమే వస్తున్నాడు అని నేను అనుకోవడం వల్లనే, నాకు భయం వేసింది కానీ, నేను అలా అనుకోకపోతే ఏ సమస్యా ఉండదని అటువైపు చూడడం మానేసాను.



నేను బస్సు దిగే సమయానికి ఆ బండి అక్కడే ఉండేది. నన్నే చూస్తుంటే ఇబ్బందిగా కూడా అనిపించేది. కానీ నిజంగా నన్ను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు, కనీసం నాతో మాట్లాడడానికి కూడా ఆతను ప్రయత్నించలేదు, కాబట్టి నాకే సమస్యా కనబడలేదు. రోజులు ఎన్ని గడుస్తున్నా ఇదే జరుగుతూ వస్తుంది. నా పక్కనే నాకు తెలియనివాడు, నన్నే గమనిస్తూ ఉండడం ఒక్కోసారి విచిత్రంగా, ఆశ్చర్యంగా కూడా అనిపించేది. ఎప్పుడైనా అతను లేడనిపిస్తే ఏదో కోల్పోయినట్టు అనిపించేది. ఒకరోజు బస్సు దిగి త్వరత్వరగా నడుచుకుంటూ మా ఇంటికి వెళ్ళి, పైన అంతస్తులో నా గది కిటికీ లోంచి బయటకు చూస్తే... మా ఇంటినే చూస్తున్న బండివాడు కనిపించాడు. అందమైన ముఖం, చురుకైన కళ్ళు... అలా

రెండుమూడు నిముషాలు అతన్నే చూస్తుండిపోయాను. కొంతసేపటి తరువాత ఇంకెప్పుడైనా బయట కనిపిస్తే, గట్టిగా అడిగెయ్యాలనిపించింది. నాకు కూడా భయమే కానీ, ఇలానే ఉండడం మరీ కష్టం. గట్టిగా కడిగిపారేద్దామని నిశ్చయించుకుని, పొద్దున్నే కాలేజీకి బస్సెక్కాను. బస్సు దిగగానే ఆ బండి నా పక్కనుంచి వెళ్తుంటే, నేనే పిలిచి అతన్ని ఆగమన్నాను.

“ఎందుకు మీరు నా వెంట వస్తున్నారు? చాలా రోజులనుంచీ చూస్తున్నా, నాతో ఏమైనా పనా? నేను మీకు తెలుసా?” ఇలా పదుల సంఖ్యలో ప్రశ్నలు అడుగుతూనే ఉన్నా.

దేనికీ సమాధానం లేదు. అడిగి అడిగీ నేనే వెళ్ళిపోయా, నేనేమైనా తప్పుగా ప్రవర్తించానా అని భయమేసింది, ఇంతకు ముందు ఎవరి మీదా అలా చనువుగా అరచినట్టు నాకు గుర్తులేదు... ఒక్క మా నాన్నతో తప్ప! అతనితో మాట్లాడేటప్పుడు బయటకి ధైర్యంగా ఉన్నా, లోపల నా ఒళ్ళంతా చెమటలు పట్టి, వణికినట్టు అనిపించింది. కానీ ఎలానో అడిగేసా. అతను బాధపడి ఉంటే, మళ్ళీ రాడు అనుకుని... నా దారిలో నేను వెళ్ళిపోయా!

కానీ సాయంత్రం మళ్ళీ అదే తంతు! మాటలు రాని ఆ బండి, మాట్లాడని ఆ నడిపేవాడు నన్నే అనుసరిస్తున్నారు. నాకెందుకో ఒక్క నిముషం జాలేసింది. ‘పాపం నేనే లోకమైనట్టు నన్నే చూస్తూ ఒక మనిషి ఉండడం ఇదే మొదటిసారి. ఈసారి వీలైతే మంచిగా మాట్లాడాలి’ అనిపించింది.

కొన్ని రోజుల తరువాత, ఒకరోజు సాయంత్రం అంతపనీ చేసాను. ఈ విషయంలో నాకు ధైర్యం ఎక్కువేనేమో? నాకు కూడా తెలియదు. అతని మాటల్లో నేనంటే తనకు ఇష్టమనీ, అందుకే నా వెంట పడుతున్నాడనీ, అతని భాషలో వెంటబడడాన్ని ‘ప్రేమ’ అంటారనీ చెప్పాడు.

నేను ఏం మాట్లాడకుండా ఇంటికి వెళ్ళిపోయా, మంచివాడిలాగానే అనిపిస్తున్నాడు, ఏం చేయాలో అర్థం కాలేదు.

పదిరోజుల తరువాత నాకు పెళ్ళి చేయాలని మా ఇంట్లో మాట్లాడుకుంటున్నారు. నన్ను చూడడానికి ఎవరో వస్తున్నారని, ఆరోజు కాలేజీకి వెళ్ళకుండా ఇంట్లో ఉండమన్నారు. వాళ్ళెవరో వచ్చారు, చూసి వెళ్లారు. ఏ కారణం లేకుండా... నాకు నచ్చలేదు. సాయంత్రం నా గదిలోంచి చూస్తే, బయట అతను ఉన్నాడు. ఏవో ఆలోచనల్లో ఎప్పటికో నిద్రపోయాను. పొద్దున్నే లేచి మా నాన్నతో ‘నేను పెళ్ళిచేసుకోను’ అన్నాను, ఎందుకన్నారు? ఇష్టం లేదన్నాను, మంచి సంబంధమని ఏవేవో చెప్పారు. ఒక్కసారిగా ఎందుకో... ‘నేను ఒకతన్ని ప్రేమించాను, సాయంత్రం ఇంటికి తీసుకొస్తానని’ చెప్పాను. మా అమ్మా నాన్న ఒక్కమాట కూడా మాట్లాడలేదు... మాట్లాడలేకపోయారేమో? నేను నిజంగా ప్రేమిస్తున్నానా లేదా కూడా నాకు తెలియదు. ఆ క్షణం ఎందుకు అలా అన్నానో కూడా ఇప్పుడు అర్థం అవ్వట్లేదు. అంత ధైర్యం మా నాన్న ఇచ్చిందే, చిన్నప్పటి నుంచీ నా మీద ప్రేమే మానాన్నని నడిపిస్తుంది. నేనే మా నాన్న లోకం. నేను ఏం చేసినా మా నాన్న నన్నే సమర్థించేవాడు. బహుశా ఇప్పుడు కూడానేమో?

ఆ రోజు సాయంత్రం అతన్ని ఇంటికి తీసుకొచ్చాను. ఎన్నో మాటలు, ఏడ్పులూ, అలగడాలూ తరువాత మా నాన్న... అతనితో నా పెళ్ళిచేయడానికి ఒప్పుకున్నాడు. నా చదువుని విసిరి పారేసి, పెళ్ళిపీటలెక్కాను, అంతకు ముందెన్నడూ ఆ చుట్టుపక్కల జరగనంత వైభవంగా జరిగింది నా పెళ్ళి!

పెళ్ళై మూడునెలలైంది. మా మామయ్య ఎప్పుడో చనిపోయారు, అత్తయ్య ఒక్కత్తే ఉన్నారు. మా ఆయన పదోతరగతి కూడా పూర్తి చేయలేదని నాకు పెళ్ళయ్యాక తెలిసింది. వాళ్ళకి ఉన్న మూడెకరాల పొలం చూసుకుంటూ ఉండేవారు, కానీ చాలా మంచివారు. ఎవ్వరినీ ఒక్కమాట కూడా అనరు. వాళ్ళ ఊర్లో ఆయనకి సౌమ్యుడిగా మంచిపేరుంది. కానీ మా అత్తయ్య గయ్యాళి! ఏదో ఒక కారణంగా నాతో, మా ఆయనతో గొడవలు పెట్టుకునేది. కొన్నాళ్లు విడిగా ఉన్నాం. ఆవిడ ఆరోగ్యం బాలేదనీ, వాళ్ళతో వీళ్ళతో చెప్పించి, మమ్మల్ని మళ్ళీ ఇంటికి రప్పించింది. ఇక్కడ వ్యవసాయం సరిగా జరగక, మా పుట్టింటి నుంచే డబ్బులు వస్తుండేవి. అయినా ఎందుకో మా అత్తయ్య నన్ను ఎప్పుడూ తిడుతూ ఉండేది.

ఈ లోపు మేము ముగ్గురం నలుగురం అవ్వబోతున్నామని తెలిసింది. ఆ కారణంగా నేను మా ఇంటికి వెళ్ళాను. మాకు కొడుకు పుట్టాడు. వాడ్ని తీసుకొని మళ్ళీ తిరిగి అత్తగారింటికి రావాలంటే కష్టంగా అనిపించింది. బాబుతో తిరిగి వచ్చిన నెలకి నాకూ, మా అత్తయ్యకీ ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. నేను కూడా సహనం కోల్పోయి గట్టిగా అరిచాను. మా ఆయన అన్నీ విని ఆ రాత్రి ఎటో వెళ్ళాడు, ఆయనే వస్తాడులే అని నేనూ, బాబూ పడుకున్నాము.

ఈ మాటలు రాయడం తప్పించుకుందామని... చాలా ప్రయత్నిస్తున్నాను. రాస్తుంటే ఏడుపు కట్టలు తెంచుకొని వస్తుంది, మరుసటిరోజు పొద్దున్న పదిమంది ఎవర్నో మోసుకుంటూ వస్తున్నారు, వచ్చీ వచ్చీ మా ఇంటి ముందు ఒక మనిషిని పడుకోబెట్టారు. ఆ పడుకున్న మనిషి నాకు తెలుసు. అతనే నేను కాలేజీకి వెళ్తుంటే... నా పక్కన బండి వేసుకొచ్చింది, అతనే నేను మా నాన్న ముందు నిలబెడితే, కనీసం ఇంట్లో అడగకుండా నన్ను పెళ్ళి చేసుకుంటా అని ప్రమాణం చేసింది, అతనే నన్ను నా బిడ్డని వందేళ్లు జాగ్రత్తగా చూసుకుంటానని నమ్మించి మోసం చేసింది. ఇలా నిర్దాక్షిణ్యంగా నన్ను వదిలేసి ఆత్మహత్య చేసుకొని, తప్పించుకొని వెళ్ళిపోతే నేను ఏం చేయను? భూమి పగిలి, అందులో నేను కూరుకుపోతున్నానా, ఆకాశం నా మీద కూలిపోతుందా... అర్థం అవ్వలేదు. బాధ ఇంత తీవ్రంగా ఉంటుందని ఆ క్షణం దాకా నాకు తెలియదు. ఇంట్లో తలకొరివి పెట్టడానికి కూడా ఎవరూ లేరు, మా నాన్నే అల్లుడికి తలకొరివి పెట్టాడు. పదినెలల పిల్లాడితో నన్ను తనతో పాటు మా ఇంటికి తీసుకెళ్లాడు.

ఓ చీకటిగదిలో ఎన్నో నెలలు గడిచిపోయాయి. నేను అల్లరిగా, చనువుగా తిరిగిన ఈ ఇల్లు... నా కన్నీరు చూడడం ఇదే మొదలు. ఏడ్చి ఏడ్చి ఒక్కోసారి కన్నీరు అయిపోతుందేమో అనిపించింది. దీనికి కారణం నేనా? మా అత్తయ్యా? బ్రతకడానికి ధైర్యంలేని మా ఆయనా? ఎవరో కూడా నాకు అర్థం అవ్వలేదు.

నెలలు సంవత్సరాలు గడుస్తున్నాయి. బాబుని చూసుకుంటూ బ్రతకడం ఒక్కటే ఇప్పుడు నేను చేయాల్సిన పని!

నేను నా జీవితాన్ని కోల్పోయి రెండేళ్ళవుతున్నాయి! బాబుకి ఇప్పుడు మూడుసంవత్సరాలు. ఒకరోజు ఎందుకో బాగా లావు అవుతున్నాడనిపించి, హాస్పిటల్‌కు తీసుకెళ్ళాము. చాలా పరీక్షల తరువాత చాలామంది డాక్టర్లకు చూపించాక, బాబుకి 'ఆటిజం' అనే మానసిక సమస్య అని తేల్చారు. ఎందుకు వచ్చిందో ఎవ్వరూ చెప్పలేకపోయారు కానీ, తగ్గించే మందులు లేవనీ, ఉన్న మందులు కేవలం బ్రతకడానికి సహాయం చేస్తాయనీ చెప్పారు. నా జీవితంలో రెండోసారి కుప్పకూలిపోయాను. 'ఇంకెంత లోతుకి నన్ను తీసుకెళ్తావు దేవుడా?' అని ఏడ్చి మొరపెట్టుకున్నా ఏ లాభం లేదు. ఒక మనిషి కళ్ళముందు లేకుండా పోయి బాధపెడితే, ఒకడు ఉండి ఇంకాస్త ఎక్కువ బాధ పెడుతున్నాడు. ఆ మూడుసంవత్సరాలు ఏం నేర్చుకున్నాడో జీవితమంతా కేవలం అవే గుర్తుపెట్టుకుని ఏమీ తెలియని అమాయకుడిని జీవితాంతం నేను చూసుకోవాలి.

చూసుకుంటాను... నేను అమ్మని కదా! పిల్లల బాల్యం ఏ తల్లికైనా అయిదారేళ్ళు, కానీ నాకు ఈ మూడేళ్ళ మానసిక వయసున్న పిల్లాడే జీవితమంతా ఉంటాడు. మొదటి రెండు మూడు సంవత్సరాలు ప్రతీ క్షణం... బాధ, కోపం, విసుగు వచ్చేవి, కానీ క్రమంగా అవి కూడా పోయేవి. మానసికంగా నా అంత దృఢంగా లేని మా అమ్మ, నాన్న ఒక్కొక్కళ్ళుగా వెళ్ళిపోయారు. ఈ కళ తప్పిన ఇంట్లో నేనూ, నాతోపాటు అరుస్తూ అందర్నీ కొడుతున్న నా కొడుకూ!

కొన్నాళ్ళకు మా ఇంటివైపు ఎవ్వరూ రావడం మానేశారు. వచ్చిన వాళ్ళ మీదకి రాళ్ళు విసిరేస్తుంటే ఎవరైనా ఎందుకొస్తారు? ఒకరోజు బడికెళ్లే పిల్లల మీద రాళ్ళు విసిరేస్తే, వాళ్ళ తలలు పగిలి రక్తమొచ్చింది. వాళ్ళ అమ్మానాన్నా మా ఇంటి మీదకి గొడవకి వచ్చారు, వాళ్ళ కాళ్ళు పట్టుకొని బ్రతిమిలాడినా, ఊరుకోకుండా నా కొడుకుని కర్రతో కొట్టి వెళ్లారు, నాకు చాలా బాధేసింది, చాలాసార్లు ఇద్దరం చనిపోతే బాగుండు అనిపించింది.

నాన్న చనిపోయాక పొలం చూసుకునేవాళ్ళు డబ్బులు ఇవ్వడం మానేశారు, ఆర్థికంగా బాగా బ్రతికిన మేము ఇప్పుడు పిల్లాడి మందులకు ఇంట్లో సరుకులకు ఇబ్బంది పడడంతో బాధేసింది. కొంతమంది బంధువులు నా కొడుకుని ఏదో ఆశ్రమంలో వదిలేసి వచ్చి వేరే పెళ్ళిచేసుకొమ్మని సలహాలిచ్చారు. అంతే కాదు, ఒకసారి బలవంతంగా వాడిని తీసుకెళ్ళి ఏదో పిచ్చోళ్ళ హాస్పిటల్లో వదిలేసి వచ్చారు. ఆ రోజు రాత్రి ఇంటినిండా నిశ్శబ్దం... అది వాడి అరుపుల కంటే భయంకరంగా ఉంది. పొద్దున్నే నేను వెళ్ళి నా కొడుకుని తెచ్చుకున్నాను, వయసు పెరుగుతున్నా దేహం పెరుగుతున్నా మనసు మాత్రం మూడు సంవత్సరాలదే!

చూస్తుండగానే కాలం కదిలి వాడికి ఇరవైనాలుగేళ్ళు వచ్చాయి. ఈ వయసు కొడుక్కి స్నానం చేయించడం, మలమూత్రాలు కడగడం కన్నా బాధ... ఏ తల్లికైనా ఇంకోటేదైనా ఉంటుందంటే నేను నమ్మను! ఒక్కోసారి నన్ను కొడితే రెండుమూడు రోజులు లేవడం, నడవడం కూడా కష్టమయ్యేది. కానీ లేచి వాడ్ని చూసుకోవాలి అనే ఒకే ఒక్క సంకల్పం నాది, నాకు ఇప్పుడు ఏ కోరికా లేదు, నేను చనిపోతే వీడు ఏమైపోతాడా అన్న భయం తప్ప!

ఇరవై అయిదు సంవత్సరాల నుంచీ మందులు వాడుతూనే ఉన్నా... వాడిలో ఏ మార్పూ లేదు! నేను తిన్నా, తినకున్నా వాడి మందులు, ఆరోగ్యం విషయంలో ఏ లోటూ చేయలేదు. మందుల వల్లనో ఎందుకో తెలియదు గాని, గత రెండేళ్లుగా బాగా లావయ్యాడు... నేను మోయలేక పోయేదాన్ని.

ఆ రోజు రాత్రి వాడు పడుకున్న గంటకే... నాలుగైదు సార్లు గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇలా ఎప్పుడూ జరగలేదు, నా వైపు తిప్పుకొని పడుకోబెట్టుకున్నాను, వాడి చేయి తీసి నా మీద వేసుకున్నాను. వాడి తల నా చెంపకి ఆనిచ్చుకొని పడుకున్నాను. ఇల్లంతా నిశ్శబ్దం, వాడి శ్వాస నాకు తగలట్లేదు, గుండె చప్పుడు నాకు తెలియట్లేదు. నా మూడేళ్ళ కొడుకు చనిపోయాడు. రాత్రంతా అలానే పడుకోబెట్టుకున్నాను, ఏవేవో కథలు చెప్పాను, వాడు వింటూ పడుకున్నాడు. తెల్లవారబోతోంటే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను, నాకన్నా ముందు వాడ్ని తీసుకెళ్ళినందుకు!

నాకు చాలా సంతోషంగా ఉంది... ఎందుకో చాలా రోజుల తరువాత నాకు నవ్వొచ్చింది.

# బ్రెయిన్ గెయిన్!

**పాణ్యం దత్తశర్మ**

✆ 9550214912

***ఐన్‌స్టీన్, మార్క్స్, బార్న్ లాంటి వాండ్లను మన దేశం ఆహ్వానించింది. మార్క్స్‌బార్న్‌ను సాక్షాత్ సర్ సి.వి. రామన్‌గారే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు రమ్మని పిలిచారు. పండిట్ మదన్ మోహన్ మాలవ్యాగారు ఐన్‌స్టీన్‌కు లేఖ రాసి, బెనారస్ హిందూ యూనివర్సిటీని సందర్శించవలసిందిగా కోరారు. ఇవన్నీ మీకు తెలియవని కాదు. నాకు తెలుసని చెబుతాండా!" సభలో నవ్వులు!***

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం లైవ్‌స్టాక్, లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్, బీఫ్ పరిశ్రమల కేంద్రం. అమెరికాకు అత్యధిక ఆదాయ వనరు పశుసంపదకు ఆలవాలం!

టెక్సాస్ అంతటా 'ట్రైల్స్' అని ఉంటాయి. గుర్రాలను, గొర్రెలను, మేకలను ఇతర పశువులను తరలించే రవాణామార్గాలవి! చికాగో నగరానికి బీఫ్ సరఫరా చేసే ప్రధానమార్గం. 'ది గ్రేట్ వెస్టర్న్ ట్రైల్' అక్కడ పశువైద్యులకు డిమాండ్ ఎక్కువ.

'యానిమల్ ఫ్రెండ్ వెటర్నరీ హాస్పిటల్' అన్న పసుపు పచ్చని అక్షరాలు. నల్లనిరంగు బ్యాక్‌గ్రౌండ్‌లో వేసిన ఆర్చి మీద మెరుస్తున్నాయి. డా. సహదేవ్ తన రూములో కూర్చుని ఉన్నాడు. అప్పుడే ఒక గుర్రానికి సిజేరియన్ చేసి, పిల్లను బయటికి తీసి వచ్చాడు. ఆపరేషన్ విజయవంతమైంది. నర్సు మెక్సికన్... టెక్సాస్ మెక్సికన్ బార్డర్‌ను ఆనుకుని ఉంటుంది. ఆమె పేరు లిండా!

"యు హేవ్ డన్ ఎ గ్రేట్ టాస్క్ సహదేవ్!" అన్నదామె... డాక్టర్ను ప్రశంసగా చూస్తూ.

"సే వుయ్ లిండా!" అన్నాడు సహదేవ్ చిరునవ్వుతో.

అప్పుడు ఉదయం పదకొండు గంటలు దాటింది. అటెండెంట్ క్రిస్టఫర్ ఒక ట్రేలో బిస్కెట్లు, పొగలు కక్కే బ్లాక్ కాఫీ రెండుకప్పులతో తెచ్చి పెట్టాడు టేబుల్ మీద.

"థ్యాంక్యూ మైడియర్" అన్నాడు సహదేవ్.

క్రిస్టఫర్ ఒక హంబుల్ గెశ్చర్ ఇచ్చి వెళ్లిపోయాడు.

తర్వాత ఒక గొర్రెల మందకు ఏదో ప్రాబ్లం వచ్చిందని, సరిగ్గా మేత తినడం లేదని, దాని ఓనర్ వచ్చి డాక్టర్‌కు చెప్పాడు.

అతనితోబాటు, అతని కారులో ఎనిమిది మైళ్ళ దూరంలోని అతని షీప్ ఫామ్‌కి వెళ్లాడు సహదేవ్. వెంట లిండా కూడా వెళ్ళింది.

ఐదారు గొర్రెల బ్లడ్ శాంపుల్స్ తీసుకున్నాడు.

"ఈవెనింగ్ రిపోర్ట్స్ వస్తాయి. దెన్ ఐ విల్ ప్రిస్క్రైబ్ మెడికేషన్ ఫర్ యువర్ ఫ్లాక్. ఇఫ్ నెసెసరీ, లెటజ్ గివ్ ఇంజక్షన్స్ టూ... ఐ ప్రెస్యూమ్... దిసీజ్ డ్యూటు సమ్ వైరల్ ఇన్‌ఫెక్షన్" అన్నాడు.

"యాజ్ పర్ యువర్ విష్ డాక్టర్!" అన్నాడా యజమాని.

★★★



సహదేవ్‌కు హాస్పిటల్ ఆవరణలోనే రెసిడెన్షియల్ క్వార్టర్స్ ఇచ్చారు. ఫుల్లీ ఫర్నిష్డ్ అవి. అమెరికాలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలలో టెక్సాస్ లైవ్‌స్టోక్ ఇండస్ట్రీస్ కూడ కొన్ని ఉన్నాయి. అమెరికాకు హైయ్యెస్ట్ ట్యాక్స్, పేయింగ్ స్టేట్ టెక్సాస్. అన్ని రంగాలలోలాగే ఇక్కడ కూడా భారతీయ వైద్యులు, నర్సులు, ఇక్కడ వెటర్నరీ హాస్పిటల్స్‌లో పని చేస్తున్నారు.

సహదేవ్ సొంత ఊరు పలమనేరు. చిత్తూరు జిల్లా. ఇంటర్ బైపిసి... అక్కడే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివాడు. ఎంబిబిఎస్ చదవాలనే కల నెరవేరలేదు. ఎంసెట్‌లో తగిన ర్యాంకు రాలేదు. వెటర్నరీ సైన్సుకు నిత్య డిమాండ్ ఉందని తెలిసి, తిరుపతి యస్.వి.యూనివర్సిటీలో బి.వి.ఎస్.సి.లో చేరాడు. అక్కడే వెటర్నరీ సైన్సులో పి.జి. చేశాడు.

ప్రభుత్వం రెగ్యులర్ డాక్టర్ల నియామకాలను ఎప్పుడో ఆపేసింది. అంతా కాంట్రాక్టు నియామకాలే. అతనికి కాంట్రాక్టు వెటర్నరీ డాక్టరుగా ఉద్యోగం వచ్చింది. 'పెంగరకుంట' అనే గ్రామంలోని పశువుల ఆసుపత్రికి, మెడికల్ ఆఫీసరుగా వేశారు. నెలకు యాభై వేల రూపాయలు కన్సాలిడేటెడ్ వేతనం!

ఆ ఊర్లో ఆసుపత్రయితే ఉంది గాని, సౌకర్యాలు ఏవీ లేవు. జీతం నెలనెలా ఇచ్చేవారు కాదు. లోకల్ నాయకులు సహజంగానే తమ జులుం చూపించేవారు. ఒకసారి ఒక గేదెకు కాన్పు చేస్తున్నాడు సహదేవ్. అది నొప్పులు పడుతూ దీనంగా అరుస్తోంది. దానికి ఒక ఇంజక్షన్ ఇవ్వాలి. తన సొంతడబ్బుతో అలాంటి ఎమర్జెన్సీలకు కొన్ని మందులు, ఇంజక్షన్‌లు కొని పెట్టుకుంటాడు సహదేవ్. పాపం మూగజీవాలని వాటి మీద సానుభూతి అతనికి!

అప్పుడే తన జర్మన్ షెపర్డ్ కుక్కను పట్టుకొని వచ్చాడు ఆదికేశవులు. "ఏంది డాక్టరు! బాగుండావా?" అని అడిగి, "మా టైగరు నిన్నటి కాడినుంచి తిండి ముట్టడం లేదు. ఏమైందో సూడు!" అన్నాడు.

"ఒక్క అరగంట కూచోండి. ఈ గేదె ఈనింతర్వాత చూస్తాను" అన్నాడు సహదేవ్.

"య్యావ్! ఏంది! నాకేం పనీ పాటా లేదనుకున్నావేంది? ముందు మా టైగర్‌ను చూడు" అన్నాడు ఆదికేశవులు కోపంగా.

"సారీ! ఈ గేదెను మధ్యలో వదిలేస్తే ప్రమాదం! దయచేసి అర్థం చేసుకోండి'' అన్నాడు సహదేవ్.

ఆ గేదె ఒక పేదవాడిది. అతడు అక్కడే నిలబడి ఆదికేశవులు వైపు భయంగా చూస్తున్నాడు. పెద్దోండ్లకు కోపం వస్తే చానా ప్రమాదమని అతనికి తెలుసు.

"మీ డి.ఎం.వో.కు చెప్పి నీ ఉద్యోగం పీకించేస్తా. ఏమనుకుంటుండావో!" అని బెదిరించాడా నాయకుడు. సహదేవ్ జంకలేదు. ముప్పావుగంట తర్వాత గేదెకు సుఖ ప్రసవమైంది. దాని యజమాని కళ్ళనిండా నీళ్ళతో సహదేవ్‌కు నమస్కరించాడు. గేదె తన 'పడ్డ'ను నాలుకతో నాకి శుభ్రం చేసింది. పడ్డ అప్పుడే లేచి నిలబడాలని ప్రయత్నిస్తోంది. దాన్ని భుజాలమీద ఎత్తుకుని యజమాని వెళుతుంటే, గేదె అతన్ని అనుసరించింది.

జర్మన్ షెపర్డ్ సహదేవ్‌ను ముట్టుకోనివ్వలేదు. కాంపౌండర్ సాయంతో దాన్ని పట్టుకొని, పొట్ట నొక్కి చూశాడు. నోరు తెరిచి నాలుక చూశాడు.

"దీనికేం కాలేదండి! అజీర్ణమే! పొట్టలో గ్యాస్ చేరింది. ఒక పౌడర్ ఇస్తాను. రెండురోజులు మాంసం పెట్టకండి! పెరుగన్నంలో ఈ పౌడర్ కలిపి పెట్టండి!" అన్నాడు.

"సర్లే గాని, ఊర్లో చిన్నా పెద్దా తారతమ్యం తెలుసుకొని ఉద్యోగం చెయ్యి డాక్టరు! ల్యాకపోతే బాగుండదు" అన్నాడు ఆదికేశవులు తీవ్రంగా.

అతడు వెళ్ళిపోయిన తర్వాత ఉస్సురని నిట్టూర్చాడు సహదేవ్. పశువైద్యంలో పి.జి చేసిన తాను ఈ గ్రామంలో అరకొర వసతులతో, నెలనెలా రాని జీతాలతో అవస్థపడుతున్నాడు. ఏమాత్రం జాబ్ శాటిస్‌ఫాక్షన్ లేదు!

★★★

ఒకరోజు చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగిన మీటింగ్‌కు హాజరై, శరవణభవన్‌లో భోజనం చేస్తున్నాడు సహదేవ్. ఎదుటి సీట్లో ఉన్న మిత్రుడు రంగశాయిని చూసి ఆశ్చర్యపోయాడు.

''వాటే సర్ప్రైస్ రంగా!'' అని అరిచాడు.

భోజనం తర్వాత ఇద్దరూ మాట్లాడుకున్నారు. బి.వి.ఎస్.సి.లో ఇద్దరూ క్లాస్‌మేట్స్.

“అయితే ఇప్పుడేం చేస్తున్నావ్?” అనడిగాడు రంగశాయి.

సహదేవ్ తన గురించి చెప్పాడు.

రంగశాయి అన్నాడు.. “అయితే ఇక్కడే 'రాట్' అవుతున్నావన్నమాట! యు ఆర్ ఎ జెమ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, కదా! ఇదేం ఖర్మరా నీకు! నేను టెక్సాస్‌లోని ఒక హాస్పిటల్‌లో పని చేస్తున్నాను. అక్కడ మనకు బోలెడన్ని అవకాశాలు! నీవు సరేనంటే నేను నీ కోసం జాబ్‌కు ట్రై చేస్తా!”

''అంతకంటేనా రా రంగా!'' అన్నాడు సహదేవ్ కృతజ్ఞతగా.

అలా టెక్సాస్ చేరాడు. మంచి ప్యాకేజ్. క్వార్టర్స్, అత్యాధునిక ఎక్విప్‌మెంట్. ఫుల్ జాబ్ శాటిస్‌ఫేక్షన్!

★★★

కాలం శరవేగంగా పరిగెత్తుతుంది. అమెరికా అంతా, అన్ని రంగాలలో భారతీయులు తిష్ఠవేసి, తమకు ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారనే దుగ్ధ అమెరికన్ యువతలో మొదలైంది. భారతీయులు తక్కువ జీతానికి, కష్టపడి పనిచేస్తారు. వృత్తిపట్ల వారికి అంకితభావం. ట్రంప్ మళ్ళీ అధికారంలోకి వచ్చాడు. విదేశీయుల పట్ల అమెరికా వైఖరిలో చాలా మార్పు వచ్చింది. అక్కడ స్థిరపడి వివిధ రంగాల్లో రాణిస్తూన్న మేధావులను, ఉద్యోగులను వీలైనంత త్వరగా వదిలించుకోవాలని ట్రంప్ తాపత్రయ పడుతున్నాడు. దీన్ని గమనించిన భారతీయులంతా పునరాలోచనలో పడ్డారు.

ఆ రోజు సాయంత్రం సహదేవ్ డిపార్ట్‌మెంటల్ స్టోర్ నుండి వస్తున్నాడు. ఒక్క పెద్ద ఊరేగింపు వస్తూంది. అమెరికన్ యువత చేతుల్లో ప్లకార్డులు చేతబట్టుకుని, వాటిమీద రాసి ఉన్న మాటలనే నినాదాలిస్తున్నారు.

“ఇండియన్స్ గో బ్యాక్!”

“అన్‌ఎంప్లాయ్‌మెంట్ ఫర్ అమెరికన్స్! ఓన్లీ డ్యూటు ఇండియన్స్!”

గతవారం పొరుగున ఉన్న బ్రయాన్‌లోని జె.అండ్.జె. క్యాటిల్ ఫాంలో పని చేస్తున్న గుజరాత్‌కు చెందిన సోమనాథ్ ఝా మీద జరిగిన దాడి గుర్తుకు వచ్చింది సహదేవ్‌కు. రేపు అలాంటి దాడి తన మీద కూడ జరగదన్న నమ్మకమేమిటి? అతని ఒళ్లు జలదరించింది. సోమనాథ్ ఝా బుల్లెట్లు తగిలి, హాస్పిటల్‌లో చావు బ్రతుకుల్లో ఉన్నాడు.

తర్వాత వీకెండ్‌లో రంగశాయిని కలిశాడు సహదేవ్. ఇద్దరూ ఒక ఇండియన్ కేఫ్‌లో డిన్నర్ ముగించారు. రంగశాయి అన్నాడు.

"ఒరేయ్! చూస్తున్నావా టర్న్ ఆఫ్ ఈవెంట్స్‌ను! మనం ఇండియాకు పంపే డబ్బు మీద నలభై శాతం టాక్స్ వేశాడు. ట్రంపరితనం! పైగా అమెరికా ఫస్ట్! అట!"

"ఏం చేస్తాం రంగా! వాళ్ళదేశం ఇది! ఇదివరకు మనలాంటి విదేశీయులపై ఇంత ద్వేషం లేదు. పైగా వాళ్ళ నిరుద్యోగానికి మనమే కారకులమట!"

"ఇంకా నయం! మనకింకా పెళ్ళీ, పిల్లలూ, వాళ్ళ చదువులూలాంటి బెడదలేదు. అలాంటి వాళ్లు పాపం ఉండలేరు, వెళ్ళలేరు!"

"అవును... అందుకే మన వాళ్లంతా పునరాలోచనలో పడ్డారు. వచ్చే ఆదివారం టెక్సాస్‌లో మన వాళ్ళ మీటింగ్ ఉంది. ఇద్దరం వెళదాం!"

అమెరికన్ ఇండియన్స్ ఫోరమ్ (ఎ.ఐ.ఎఫ్) వారు నిర్వహిస్తున్న సమావేశం అది! దాని అధ్యక్షులు ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తిగారు. ఆయన సభికులనుద్దేశించి ఇలా ప్రసంగించారు.

"మిత్రులారా! 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని సాక్షాత్తూ శ్రీరామచంద్ర ప్రభువే సెలవిచ్చాడు. 'శ్రేయాన్ స్వధర్మో విగుణః, పరధర్మాత్ స్వనుష్ఠితాత్, స్వధర్మేనిధనం శ్రేయః పరధర్మోభయావహః' అని శ్రీకృష్ణ పరమాత్మ గీతలో చెప్పాడు. మనం మెరుగైన జీవితాన్ని వెదుక్కుంటూ ఈ దేశానికి వచ్చాం. కానీ వీళ్లు ఇప్పుడు మనల్ని పొమ్మంటున్నారే! భారతప్రభుత్వం వైఖరి కూడ మారుతుంది. సోదరులారా! మనం తిరిగి వెళితే, మనకు తగిన మౌలిక, ఆర్థిక సదుపాయాలను సిద్ధం చేయడానికి మనదేశం ఉవ్విళ్లూరుతూంది. గతప్రభుత్వాలు దేశమేధావులను నిర్లక్ష్యం చేసాయి. అందుకే 'బ్రెయిన్ డ్రెయిన్' అంటే 'మేధావుల వలస' సంభవించింది. దాన్ని 'బ్రెయిన్ గెయిన్'గా మార్చుకోవాలనుకుంటోంది మన మాతృదేశం. ఈ పరిస్థితి మనకే కాదు ప్రపంచం అంతటా ఉంది. నా మిత్రుడు, మన సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీ పరదేశినాయుడు గారిని ఈ విషయంలో మిమ్మల్ని చైతన్య పరచవలసినదిగా కోరుతున్నాను."

పరదేశినాయుడు హాస్యచతురుడు. ఆయన మైక్ ముందు నిలబడ్డాడు. "వీండ్లు పొమ్మనకుండా పొగబెడతా ఉంటే, వేలాడుతూ ఉండడానికి మనకేం పట్టింది? ఒకప్పుడు విదేశీయులే మన కాడికొచ్చి నేర్చుకునేవారు. భారత్ ఎందరో విజ్ఞానులను పిలిచి మరీ పీట వేసింది! జర్మనీ మేధావులకు పురిటిగడ్డ. ఆడ 1930లలో పరిస్థితులు శానా కంపరంగా మారితే, వాండ్లను విదేశాలు రమ్మన్నాయి. ఐన్‌స్టీన్, మార్క్స్‌బార్న్ లాంటి వాండ్లను మనదేశం ఆహ్వానించింది. మార్క్స్‌బార్న్‌ను సాక్షాత్ సర్ సి.వి. రామన్‌గారే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు రమ్మని పిలిచారు. పండిట్ మదన్ మోహన్ మాలవ్యాగారు ఐన్‌స్టీన్‌కు లేఖ రాసి, బెనారస్ హిందూ యూనివర్సిటీని సందర్శించవలసిందిగా కోరారు. ఇవన్నీ మీకు తెలియవని కాదు. నాకు తెలుసని చెబుతాండా!" సభలో నవ్వులు!

"ఇప్పుడేం మించి పోల్యా! మన భారతీయ రాయబార కార్యాలయంలో తిరిగి భారత్‌కు వెళ్లాలనుకునేవారికి గైడెన్స్ ఇవ్వడం కోసం ఒక వింగ్ ఏర్పాటు చేశారు. వారిని సంప్రదిస్తే సరి. మన మన రంగాలలో మనకు తగిన ప్రాస్పెక్ట్స్‌ను మనకు సూచిస్తారు." అంటూ ముగించారు.

మూడునెలలు గడిచాయి. సహదేవ్‌కు జైపూర్ రాజస్థాన్‌లోని అపోలో కాలేజ్ ఆఫ్ వెటర్నరీ మెడిసిన్ (ఎ.సి.వి.ఎమ్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. అతడు అమెరికాలోనే వెటర్నరీ సైన్స్‌లో తన పి.హెచ్‌డి పూర్తి చేసి ఉన్నాడు. రంగశాయికి ముంబాయిలోని టాటా యానిమల్ హాస్పిటల్‌లో డాక్టరుగా ఉద్యోగం వచ్చింది.

'ఘర్‌వాపసీ' మొదలైంది. స్వధర్మం 'నిధనం' ఏమీ కాదు! అమెరికాలో ఉన్నంత ఆదాయం లేకపోయినా, స్వదేశానికి సేవ చేస్తున్నామన్న ఆత్మ సంతృప్తి ముందు.. ఆదాయం అంత పరిగణించతగినది కాదు కదా! అమెరికాలో పరిస్థితికి ఇండియాలో పరిస్థితికి ఉన్నతేడా... హ్యాపీనెస్‌కు, కంటెంట్‌మెంట్‌కు ఉన్న తేడాలాంటిది!

కంటెంట్‌మెంట్ మేక్స్ ఎ పూర్ మ్యాన్ రిచ్, అండ్ డిస్ కంటెంట్‌మెంట్, ఎ రిచ్ మ్యాన్ పూర్! బ్రెయిన్ గెయిన్ వర్ధిల్లాలి!

# ప్రాణభిక్ష



ముద్దు హేమలత
✆ 92472 63240

***"అక్కా! నేను ఉంటున్నది మామిడిచెట్టు మీద కాదు! ఈ జామచెట్టు మీదే! నీకు ఆ రోజు అబద్ధం చెప్పాను!" అంది పిచ్చుకమ్మ.***

***"సరేలే! అబద్ధం చెప్తే చెప్పావు! ఇప్పుడు కాలిపోయింది గూడే కదా! కొత్తగూడు కట్టుకుందువు. అప్పటి వరకు నా గూటిలో ఉండు!" అంది కొంగమ్మ.***

***బిడ్డలు మంటల్లో చిక్కుకొని, కాలి బూడిద అయ్యారని చెప్పలేక వెక్కి వెక్కి ఏడ్చింది పిచ్చుకమ్మ.***

అనగనగా ఒక చెరువు ఒడ్డున, జామచెట్టు మీద కొత్తగా ఒక పిచ్చుకమ్మ గూడు కట్టుకుంది. అది నాలుగు గుడ్లు పెట్టింది. ఆ గుడ్లను పొదిగి, పిల్లల్ని చేసింది. పిచ్చుకమ్మకు వాటిని కంటిపాపలా, ప్రేమగా చూసుకోవటమే పని!

పిల్లల్ని చక్కగా తయారుచేయడం, వాటికి చిన్నచిన్న పురుగుల్ని ఆహారంగా అందించటం, పక్కనే చెరువులో ఉన్న నీటిని తీసుకొచ్చి తాగించటం చేస్తుండేది. జామచెట్టుకు కొద్ది దూరంలో, ఒక చింతచెట్టు ఉండేది. చింతచెట్టు మీద ఒక కొంగమ్మ నివసిస్తుండేది. అది ప్రతిరోజూ చెరువు దగ్గరకు వచ్చి చిన్నచిన్న చేపల్ని, కప్పల్ని తినేది.

పిచ్చుకమ్మ ఒకసారి చెరువులో నీటిని తాగుతుండగా అక్కడ ఉన్న చేపలు, కప్పలు గమనించాయి.

"ఆ జామచెట్టు మీద ఉన్న గూటిలో నీ పిల్లలేనా కిచకిచమని అరిచేది?" అడిగింది ఒక కప్ప.

"అవును మిత్రమా!" అంది పిచ్చుకమ్మ.

"నీ పిల్లలు జాగ్రత్త! ఆ చింతచెట్టు మీద ఉన్న కొంగమ్మ చాలా చెడ్డది. అది చేపల్ని, కప్పల్ని మాత్రమే కాదు, దొరికితే పాముల్ని, మొసల్ని కూడా చంపుకుతింటుంది!" అంది చేప.

పిచ్చుకమ్మకు, కొంగమ్మ అంటే భయం పట్టుకుంది.

ఒకరోజు పిచ్చుకమ్మ చెరువు ఒడ్డున గడ్డిమొక్కపై కూర్చుంది. అప్పుడే చెరువు దగ్గరకు కొంగమ్మ వచ్చింది. కొంగను చూసి పిచ్చుకమ్మ భయపడింది.

"చెల్లీ! నన్ను చూసి ఎందుకు భయపడుతున్నావు. నేను నీ శత్రువుని కాదు!" అంది కొంగమ్మ .

పిచ్చుకమ్మ మాట్లాడలేదు.

మళ్ళీ కొంగమ్మ "నిన్ను ఇక్కడ గతంలో చూడలేదు! కొత్తగా వచ్చావా? ఎక్కడ ఉంటున్నావు? ఎంతమంది పిల్లలు?" అడిగింది.

"అక్కా! నేను ఇక్కడకు కొత్తగావచ్చాను. ఆ మామిడిచెట్టు మీద గూడు కట్టుకుని ఒంటరిగా ఉంటున్నాను. ఇంకా పిల్లలు లేరు!" అంటూ, భయంతో అబద్ధం చెప్పింది పిచ్చుకమ్మ.

"నేను ఆ కనిపించే చింతచెట్టు మీద ఉంటాను. ఎప్పుడన్నా నీకు నా సహాయం కావాలంటే మొహమాటం పడకుండా అడుగు!" అంది కొంగమ్మ.



ఒకరోజు పిచ్చుకమ్మ బిడ్డలకి ఆహారం తేవటానికి బయటికి వెళ్లింది.

అది వెళ్లిన కొద్దిసేపటికి, అడవిలోమంట రాజుకుంది. ఆ మంటల్లో జామచెట్టు పూర్తిగా కాలిపోయింది. అప్పుడే అటుగా వచ్చిన కొంగమ్మ, మంటల్లో చిక్కుకున్న కొన్ని పక్షుల్ని సాహసించి కాపాడిఃది.

ఆహారం సంపాదించుకొని తిరిగి వచ్చిన పిచ్చుకమ్మ, కాలిన చెట్టును చూసి భోరున ఏడ్చింది.

"చెల్లీ! ఎందుకు ఏడుస్తున్నావు? నువ్వు ఉంటున్న మామిడిచెట్టు ప్రమాదానికి గురికాలేదు. పచ్చగానే ఉంది!" అంది కొంగమ్మ.

"అక్కా! నేను ఉంటున్నది మామిడిచెట్టు మీద కాదు! ఈ జామచెట్టు మీదే! నీకు ఆ రోజు అబద్ధం చెప్పాను!" అంది పిచ్చుకమ్మ

"సరేలే! అబద్ధం చెప్తే చెప్పావు! ఇప్పుడు కాలిపోయింది గూడే కదా! కొత్తగూడు కట్టుకుందువు. అప్పటి వరకు నా గూటిలో ఉండు!" అంది కొంగమ్మ.

బిడ్డలు మంటల్లో చిక్కుకొని, కాలి బూడిద అయ్యారని చెప్పలేక వెక్కివెక్కి ఏడ్చింది పిచ్చుకమ్మ.

తన గూటికి పిచ్చుకమ్మను వెంటబెట్టుకొని తీసుకెళ్ళింది కొంగమ్మ.

గూటిలో నాలుగు బుజ్జి పిచ్చుకలు ఆడుకుంటున్నాయి.

అవి తల్లిని చూసి ఆనందంతో కిచకిచమని అరుస్తూ దగ్గరికి వచ్చాయి.

పిచ్చుకమ్మ తన బిడ్డల్ని హృదయానికి, హత్తుకొని భోరున ఏడ్చింది.

"అక్కా! ఈ పిల్లలు నా పిల్లలే! నా పిల్లలకు ప్రాణభిక్ష పెట్టావు. చెప్పుడుమాటలు విని, నీ మంచితనం గ్రహించలేకపోయాను. అందుకే అబద్ధం చెప్పాను! నన్ను క్షమించు!" అంటూ కొంగమ్మ కాళ్లపై పడింది పిచ్చుకమ్మ.

అసలు విషయం తెలుసుకున్న పిచ్చుకమ్మను, దాని పిల్లలను దగ్గరికి తీసుకుంది కొంగమ్మ!

కథామంజరి బాలకథ

# అనుకున్నోడు దొరికాడు..

కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
✆ 9441561655

***"ఇన్ని రోజుల తరువాత నా అన్వేషణ ఫలించింది. నీవే నా స్వకార్యానికి తగిన వాడవని నా మనసు చెబుతోంది నాయనా..." అంటూ ఎంతో ఆప్యాయంగా ఆ యువకుడిని కౌగిలించుకొని, తన దగ్గర కూడబెట్టుకున్న సంపదనంతా ఇచ్చాడు.***

ఒకరోజు ధర్వేశిపురం అనే గ్రామానికి ఒక సాధువు వచ్చాడు. ఆ ఊరు పొలిమేరలో ఉన్న ఎల్లమ్మగుడి వద్ద కుటీరం ఏర్పరుచుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత ఆ సాధువు గ్రామంలోకి వెళ్లాడు.


"నా దగ్గర కొంత దాచుకున్న సంపద ఉంది. ఎప్పుడైనా ప్రజలకు ఉపయోగించాలనే ఉద్దేశంతో, నా వద్దే భద్రంగా ఉంది. ఆ సంపదనంతా ఎవరికైనా అప్పగించి, నేను హిమాలయాలకు వెళ్లి తపస్సు చేసుకోవడానికి పోవాలనుకుంటున్నాను. స్వార్థచింతన వదిలేసి ప్రజలకు ఉపయోగపడే పనులు చేసే నిస్వార్థపరులు నా దగ్గరున్న ధనం పొందడానికి అర్హులు. అలాంటివారు ఎవరైనా ఈ ఊర్లో ఉంటే వచ్చి, గతంలో తాము చేసిన ఒక మంచిపని గురించి చెబితే ఆ సంపద అంతా ఇచ్చేస్తాను. ఈ సంగతి ఊరంతా తెలియజేయండి. వచ్చే పౌర్ణమికి నా దగ్గరికి రమ్మని చెప్పండి" అని గ్రామస్థులతో సాధువు చెప్పాడు.

సాధువు చెప్పిన విషయం రెండు మూడు రోజుల్లోనే... ఆ ఊర్లోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు వార్త పాకిపోయింది. ఈ లోగా పౌర్ణమి రానే వచ్చింది. ఆ రోజు ఉదయం నుండే ఆసక్తి ఉన్నవారు, సాధువు ఆశ్రమానికి చేరుకోవడం మొదలైంది. మంచివాళ్ళమని అనుకునే వారు కొందరు, అసలేమి జరుగుతుందో చూద్దామని మరికొందరు వచ్చారు.

సాధువు నివసిస్తున్న కుటీరం చుట్టుపక్కల వచ్చిన జనంతో రద్దీగా నిండిపోయింది. ఒకరి తర్వాత ఒకరు సాధువు ముందుకు వచ్చి, తాము చేసిన మంచిపనుల గురించి, చేయబోయే పనుల గురించి ఒక్కొక్కరూ తమ గొప్పల గురించి ఇలా చెప్పసాగారు.

ఒక వ్యక్తి "స్వామీజీ! నేను నా పుట్టినరోజున ఎంతోమంది పేదలకు అన్నదానం చేస్తాను. ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నాను. మీరు నాకు ధనం ఇస్తే, ఆ ధనంతో ఒక అనాథాశ్రమం పెట్టి పేదవాళ్లకు మరింత సేవ చేస్తాను" అని చెప్పాడు.

మరొకవ్యక్తి ముందుకు వచ్చి, "నేను ఎంతమందికో దానధర్మాలు చేశాను. మీరే కనుక ఆ సంపదంతా నాకిస్తే పేదవాళ్లకు ఉచితంగా ఎన్నో సేవాకార్యక్రమాలు చేపడతాను" అన్నాడు.



ఇలా ఒకరి తర్వాత ఒకరు వచ్చిన వాళ్లంతా... తమతమ మంచి పనుల గురించి గబగబా తెలియజేశారు. సాధువు అందరి మాటలు చాలా సావధానంగా చిరునవ్వుతో విన్నాడు. చివరకు తాను అనుకున్న మనిషి దొరకనందుకు నిరాశకు గురయ్యాడు. ఈలోగా సాయంకాలం కావడంతో చీకటి పడుతుంది. ఇంతలో అక్కడికి నూనూగు మీసాల యువకుడొకడు ఆత్రమాత్రమంటూ ఉరికొచ్చాడు. అతడి జుట్టు చెదిరి, బట్టలు నలిగి ఉన్నాయి. ఎంతో అలసిపోయి ఉన్నట్లు కనిపించాడు. ఆ యువకుడి ముఖంలోని నిర్మలత్వం చూసి, దగ్గరకు పిలిచి... "ఏమిటి నాయనా, నీ హడావిడి? ఎవరు నీవు? అని అడిగాడు.

"నా పేరు సాయి చరణ్. మాది పక్కూరు. మీరు చెప్పిన విషయం మా ఊర్లో జనం అనుకుంటుంటే విన్నాను. అందుకే మిమ్మల్ని కలవడానికి వచ్చాను స్వామీ!" అంటూ రెండు చేతులు జోడించి చెప్పాడు. "మరి ఇంత ఆలస్యం ఎందుకు అయింది?" అని ఆ యువకుడిని సాధువు అడిగాడు.

"నేను ఉదయాన్నే బయల్దేరాను స్వామి. అయితే ఎంతోమంది కాలినడకన ఎండలో ప్రయాణం చేస్తూ మీ వద్దకు వస్తున్న సంగతి గమనించాను. వస్తున్నవారిలో స్త్రీలు, పిల్లలు కూడా ఉన్నారు. వారు ఎంతో దాహంతో ఉన్నందున, వారి బాధను గమనించి దారి మధ్యలో నున్న బావి దగ్గర నీళ్లను చేది, వారి దూప తీర్చడం వల్ల నాకు కాస్త ఆలస్యం అయింది. మన్నించు స్వామీ!" అని వినమ్రంగా సాయి చరణ్ అన్నాడు.

ఆ మాటలు విన్న సాధువు క్షణం ఆలోచించి, "ఇన్ని రోజుల తరువాత నా అన్వేషణ ఫలించింది. నీవే నా స్వకార్యానికి తగినవాడవని నా మనసు చెబుతోంది నాయనా!" అంటూ ఎంతో ఆప్యాయంగా ఆ యువకుడిని కౌగిలించుకొని, తన దగ్గర కూడబెట్టుకున్న సంపదనంతా ఇచ్చాడు.

ఆ తరువాత సమర్థుడైనవాడు దొరికినందుకు సాధువు సంతోషపడుతూ హాయిగా హిమాలయ పర్వతాలకు వెళ్ళిపోయాడు. సాధువు ఇచ్చిన డబ్బును వృధా చేయకుండా, తన ఊర్లో తల్లిదండ్రులు లేని పేద పిల్లలకు చదువుకోసం, దిక్కులేని ముసలివారికి సహాయం చేశాడు. ఆ యువకుడు చేసిన మంచిపనికి అందరూ మెచ్చుకొని అభినందించారు.

# గడ్డి గులాబి

అవధానుల విజయలక్ష్మి
✆ 9110724594

**విశిష్ట అతిథి కథ**

***"అమ్మగారి జబ్బు పూర్తిగా తగ్గిపోయిందట. మరో వారం రోజుల్లో ఇంటికెళ్లి పోవచ్చునట. ఇంక నేను సచ్చిపోయినా పర్లేదు. నేను పోతానని పాపం అమ్మగారికి తెలియదు. డాక్టర్లు చెప్పుకుంటుంటే విన్నానని డాక్టరు బాబులకి తెలియదు. నేను పోతే ఎవరికీ ఏమీ కాదు. కాని అమ్మగారు పోతే... అమ్మో! అంతమంది అనాథపిల్లలకెట్లాగా? అందుకే రోజూ దేముడికి దణ్ణం పెట్టుకొంటున్నాను. అమ్మగారికి పూర్తిగా నయమయి పోయిన తర్వాతనే నన్ను తీసుకుపో దేముడా అని!"***

"సిస్టర్!"

గంటన్నర పాటు కురిసి, వెలసిన వానలో హాయిగా స్నానం చేసిన నేలతల్లి నీరెండలో తన తడిజుత్తు ఆరబెట్టుకుంటుంటే... ఆ జుత్తులో చిక్కుకున్న ఓ చిన్న గడ్డిగులాబీ తడితడిగా చలికి ముడుచుకుపోతున్నట్టు కూర్చొంటే... పొడుగాటి కారిడార్ చివర నిల్చుని, ఆ చిన్నపువ్వునే తదేకంగా చూస్తున్న నేను ఉలిక్కిపడి వెనక్కు తిరిగాను.

ఆ అమ్మాయే...

కుట్లూడిపోయిన అంచులతో, దారాలు వేలాడుతున్న పొట్టి పరికిణీ, ఒదులొదులుగా వేళ్ళాడుతూ వెలసి పోయిన జాకెట్టు, అలసట నిండిన కళ్ళు, లోతుకు పోయిన బుగ్గలు, మొహంమీద చిందర వందరగా పడుతూ నూనెలేని పొడి జుత్తు...

"సిస్టర్!" అన్న పిలుపు, రోజుకి కొన్ని పదులసార్లు వినిపిస్తుంది.

కొన్ని పిలుపుల్లో విచారం, కొన్ని పిలుపుల్లో ఆందోళన, కొన్ని పిలుపుల్లో ఆక్రోశం... ఈ అమ్మాయి "సిస్టర్" అని పిలిచినపుడు మాత్రం అన్ని భావాలూ, ఒకదాని తర్వాతొకటి ఆ ఒక్క పిలుపులోనే ప్రతిధ్వనించేసి, వెనక్కు తిరిగి ఆ మొహం వైపు చూసేసరికి, 'విగ్బ్యియార్' ఏడురంగుల చక్రం గిర్రున తిరిగి అన్నిరంగులూ కలసిపోయి, ఉత్త తెల్లచక్రం కనిపించినట్టు... ఆ పిల్ల మొహంలో ఏ భావమూ కనబడక, ఓ నిర్వికార నిర్వికల్ప స్థితిలో ఉన్నట్లుంటుంది. నిండా పదిహేనేళ్లు లేని ఆ పిల్ల మొహం, అలా చూసినప్పుడల్లా ఎప్పుడూ గొప్ప ఆశ్చర్యమే నాకు!

"సీసా ఖాళీ అయిపోతున్నాదండీ" అంది.

పొడుగాటి వరండాలో ఒక్కో గదిని దాటుకుంటూ ఆ అమ్మాయి వెనకే నడిచాను. తెల్లటి పక్కమీద కళ్లు మూసుకొని పడుక్కొనుంది పదిహేనో నంబరు గదిలో ఆవిడ... చాచిన చేతిలో పొడిచిన సూది... మంచం పక్కనే సెలైను స్టాండు ఉన్నాయి.

నేను సరిగ్గా మంచం దగ్గరికి నడిచేసరికి, గ్లూకోజు సీసా ఖాళీ అయిపోయి నీటిమట్టం ఐవీ గొట్టంలోంచి కిందకు దిగుతోంది.

మంచం పక్కకి నడిచి, సీసాలోంచి సూదినూడబెరికి, పోలిథిన్ గొట్టంలోని ఆఖరి గ్లూకోజ్ బొట్టుని ఆవిడ శరీరంలోకి ఎక్కించేసి, చేతిలోని సూదిని లాగేశాను. సూదిలాగిన చోట స్పిరిట్‌తో తడిపిన దూదినుంచి, బయటకు నడిచాను.

బయట సుశీల. డ్యూటీ అయిపోయినట్లుంది, తాపీగా నడుస్తోంది.

"పని అయిపోయిందా?" పలకరింపుగా నవ్వుతూ అడిగింది.

"అయిపోయింది. పదిహేనో నంబరు గదిలోని ఆవిడ గ్లూకోజ్ డ్రిప్పు అయిపోయిందిగా... ఇక ఇవేళ్టి డ్యూటీ అయిపోయినట్లే" అలసటగా అన్నాను.

ఇద్దరం నిశ్శబ్దంగా నడవసాగాం. పొడుగాటి వరండాలో ఎండ పొడలు పొడలుగా పడుతోంది. గంజి పెట్టిన చీరలు ఆ నిశ్శబ్దంలో చేస్తున్న తపతప చప్పుడు అదేదో వింత సంగీతంలా వినిపిస్తోంది.

"నీకో ఆశ్చర్యకరమైన విషయం చెప్పనా?" అడిగాను.

గుండెలో కొట్టుకులాడుతున్న భావం. నాకిష్టమైన నిశ్శబ్దాన్ని తప్పనిసరై భంగపరిచేట్టు చేసింది.



"చెప్పు" అంది సుశీల నడుస్తూనే.

"ఆ పదిహేనో నంబరు గదిలో ఆవిడతో బాటు ఉంటుంది చూడు, ఒకమ్మాయి. సెలైను బాటిలు ఖాళీ అయినప్పుడల్లా ఆ అమ్మాయి పిలిచే పిలుపు ఆశ్చర్యంగా ఉంటుంది."

"అంత భయం భయంగా పిలుస్తుందా?" అడిగింది సుశీల.

"భయమా? అసలా మొహంలో ఏం భావాలున్నాయో కనబడితేగా? నేను చెప్పేది ఆ పిలిచే విధానం గురించి కాదు, పిలిచే సమయం గురించి!"

"అంటే?"

"సెలైను బాటిలు పెడతానా? మరో పది నిమిషాలకి బాటిలు ఖాళీ అయిపోతుందనగా, ముందుగా ఒకసారి వస్తుంది. నేనెక్కడున్నానో చూసుకుంటుంది. 'సీసా ఖాళీ అయిపోతుందండీ మరి కాస్సేపట్లో వస్తాను' అని చెప్పేసి వెళ్ళిపోతుంది. మళ్ళా రెండోసారి వచ్చి, నన్ను పిల్చి, నేను గదిలోకెళ్ళేసరికి, సీసా ఖాళీ అయిపోయి ద్రవం సరిగ్గా ఐవీ గొట్టం దగ్గరకొచ్చి ఉంటుంది. ఒక్క పిసరు పైకి ఉండదు. ఒక్క పిసరు కిందికి ఉండదు. అది ఏ డ్రిప్ అయినా సరే! నిమిషానికి అరవై చుక్కలు పడేదైనా సరే, ముప్పై చుక్కలు పడేదైనాసరే!"

"నిజమే?!" కళ్లు వెడల్పు చేసి చూస్తూ అడిగింది సుశీల.

"నిజం! డ్రిప్ వేగం, గదినుండి నేనున్న జాగాకి దూరం, అంతదూరం నడవడానికి పట్టే కాలం... ఎంతో మేధ ఉంటే తప్ప, సమయాన్ని అంత ఖచ్చితంగా లెక్క కట్టడం సాధ్యం కాదు!"

మౌనంగా నడవసాగింది సుశీల.

"లక్ష్మీ! ఇందాక నువ్వు చెప్పావే ఆ అమ్మాయి ఆ పేషెంటుకేమవుతుంది? కూతురా?" ఏదో ఆలోచిస్తూ అడిగింది సుశీల.

"ఊహూ! కూతురు కాదు. అయినా ఆ అమ్మాయి వేషభాషలు చూస్తుంటే తెలియడం లేదూ? అయినా ఎందుకడిగావ్?"

"లక్ష్మీ! ఇందాక నువ్వన్నావ్ చూడు మేధ అని... పిలిచే సమయంలోని ఆ ఖచ్చితత్వం రాడానికి మెదడు అక్కర్లేదు. అదో ఇన్ట్యూషన్. చేస్తున్న పనిమీద తప్ప మరోదాని మీద దృష్టి లేకపోవడం. ఆవిడ ఆ అమ్మాయికి చాలా ఆత్మీయురాలేమో? అందుకే ఆవిడ సేవల్లో ఆ అమ్మాయికి ఆ ఏకాగ్రత!"

"నాకూ అలాగే అనిపిస్తుంది సుశీ! ప్రపంచంలో ఆ అమ్మాయికి ఆవిడ తప్ప మరెవరూ లేరేమో... ఆవిడ చచ్చిపోతే ఆ అమ్మాయి అసలు బతకనేలేదేమో అనిపిస్తుంటుంది. ఆవిడకి ఆ పిల్ల చేసే సేవలు చూస్తుంటే!"

చాలాసేపు మౌనంగా గడిచిపోయింది.

"సుశీ!" అన్నాను ఎంత సేపటి తర్వాత బరువుగా.

"చెప్పు" కళ్లు తిప్పకుండా అంది సుశీల.

"ఇంకెక్కువ రోజులు ఈ ఒంటరి బతుకు బతకలేననిపిస్తోందే! పొద్దున్న లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకొనే దాకా గడిపే ఈ యాంత్రిక జీవితంలోకి... ఈ ఉరుకులు పరుగులు మధ్య నాకోసం అంటూ మిగుల్చుకొన్న ఈ కొద్ది సమయంలోకి... నాకో తోడు కావాలనిపిస్తోందే!" ఆర్తిగా అన్నాను.

"పెళ్ళి చేసుకోవాలనుందా?" తలతిప్పి చిలిపిగా చూస్తూ అంది.

"ముప్పై ఏళ్ళు దాటుతుంటే నన్నెవరు చేసుకుంటారు? అయినా సుశీ తోడు కావలసినది నా శరీరానిక్కాదే, మనసుకి!" మనసులో ఉబికిన ఆవేదన గొంతులోకి జీరను తెచ్చేయకుండా, ఆపుకొంటూ అన్నాను.

నిశ్శబ్దంగా నా చేతినందుకొని మెత్తగా నొక్కి వదిలేసింది సుశీల. ఓ చిన్నస్పర్శే... కంటిలోకి నీరు తెప్పించకుండా ఆపడం అసాధ్యం అయిపోయింది.

"ఏయ్ పిచ్చీ! కళ్ళంట నీళ్ళెందుకు? అయినా ఇది మొదటిసారి కాదుగా, నువ్వు ఒంటరితనంతో బాధ పడుతున్నావని నాతో చెప్పడం!" లాలనగా అంది.

"అదికాదే! పగలంతా ఆస్పత్రిలో ఊపిరాడని పన్లతో గడిచిపోయినా రాత్రి పడుకొనేటప్పుడు ఒంటరితనం ఎంత భయంకరంగా అనిపిస్తుందో తెలుసా? అమ్మా, నాన్నా, తోబుట్టువులూ ఎవరూ లేరు. ఈ బతుకు బతక్కపోతేనేం అనిపిస్తుంది."

చప్పున తన చేత్తో నా నోరు మూసేసింది సుశీల. "పిచ్చిదాన్లా మాట్లాడకు. ఎవరూ లేకపోయినా నీకు నేను లేనూ? ప్రాణం తీసుకొనే హక్కు... ఓ.... అది నీదైనా సరే... నీకు లేదు!" కోప్పడుతున్నట్టు అంది.

బుగ్గమీదికి జారుతున్న నీటి బొట్టుని తుడిచేసుకొంటూ నవ్వేశాను.

"నేనేం ఇప్పుడు చచ్చిపోతాననడం లేదులే. నిన్నంతా ఆలోచించాను సుశీ! నాకెవరినైనా పెంచుకోవాలనుంది. నాది అనుకొనే... కేవలం నాది అనుకొనే ఓ చిన్నారి పాపాయి నాకు కావాలి! ఆ చిన్న పాపాయికి పాలుపడుతూ, స్నానం చేయించుతూ, కాస్త పెద్దయ్యాక పక్కనే కూర్చొని సేవలు చేస్తూ, ఇంకాస్త పెద్దయ్యాక పక్కనే కూర్చొని అన్నం కొసరి కొసరి వడ్డిస్తూ... ఇంకా ఎన్నెన్నో కోరికలు! అందుకే మనసులో ఉబుకుతున్న మమతల్ని పంచడానికైనా ఓ తోడు కావాలనిపిస్తుంది."

"అయితే ఎవర్ని పెంచుకుంటావ్?"

"ఈ ఆస్పత్రిలోనే ఎందరో అనాథ శిశువులున్నారు. వాళ్ళలో ఒకర్ని పెంచుకుందా అనిపిస్తోంది."

అదోలా నవ్వింది సుశీల. "అల్లా నవ్వుతావేం?" ఉక్రోషంగా అడిగాను.

"అదిగో ఆ చిన్న గడ్డిగులాబీ పువ్వుంది చూడు. దాన్ని చూస్తుంటే ఓ విషయం గుర్తొచ్చింది." నవ్వుతూనే అంది.

"ఏ విషయమే అది?"

"నా చిన్నప్పుడు మేము మేడమీద వాటాలో ఉండేవాళ్లం. డాబామీద నిల్చుని చూస్తుంటే, ఓ రోజు కింద నేలమీద ఓ గడ్డిగులాబీ పువ్వు కనిపించింది. ఉదయపు నీరెండలో అప్పుడే విచ్చుకొని ఎంతందంగా కనిపించిందో! అప్పట్నించి రోజూ

పొద్దున్నే దాన్ని చూడ్డం అలవాటుగా మారిపోయింది. కొన్ని రోజులు అలా చూసి చూసి ఇక ఉండబట్టలేక, ఓ రోజు కిందికి దిగి వెళ్ళి దాన్ని భూమిలోంచి పీకేసి తెచ్చి ఇంట్లో ఉన్న కుండీలో వేసేశాను. అప్పటికీ గానీ తృప్తి తీరలేదు. కాని ఇప్పుడు తలుచుకుంటుంటే అనిపిస్తోంది, నేను డాబా మీంచి చూస్తున్నపుడు అది ఎంత అందంగా కనిపించేదో... మనసుకి ఎంత హాయినిచ్చేదో ఇంట్లో కుండీలో వేసుకున్నప్పుడు అంతే అందంగా కనిపించేది! ఇంట్లో వేశాక మనసుకి కలిగిన ఆ హాయి ఎక్కువేం కాలేదు. అయినా సరే అది నాది అనుకోవడానికి ఆ తాపత్రయం ఎందుకో?"

"అది సరే సుశీ, నేనో పిల్లనో పిల్లాడినో పెంచుకుంటానంటే నీకా విషయం ఎందుకు గుర్తొచ్చిందీ?" అడిగాను.

"గుర్తురాదూ మరి? రోజుకి ఎంతోమంది పురుటిగుడ్డకి స్నానం చేయించుతుంటావు. ఎంతోమంది పిల్లలకి నీ చేత్తో అన్నం పెడుతుంటావు. జబ్బుపడ్డ ఎంతోమందికి సేవలు చేస్తుంటావు. అయినా ఇంకా నీది అనిపించుకునే ఓ మనిషికి ఆ పనులన్నీ చేస్తే తప్ప మనసుకి తృప్తి దొరకదను కొంటున్నావు! నేను చెప్పిన విషయానికి దీనికి పోలికలేదూ?"

"కాని సుశీ, రోజులో ఒక్క నిమిషమైనా, నా కోసం అనుకోకుండా ఒక్క అనుభూతైనా నాది అనుకోకుండా గడపడం అసాధ్యం కాదూ?" బరువుగా అన్నాను.

చిన్నగా నవ్వింది సుశీల "ప్రతి నిమిషం అలా గడపక్కర లేదు లక్ష్మీ... కొన్ని నిమిషాలు గడిపినా చాలు... లక్ష్మీ భగవద్గీతలో ఆ శ్లోకం నాకెంత ఇష్టమో తెలుసా? 'యోగసన్న్యస్త కర్మాణం, జ్ఞాన సంచిన్న సంశయమ్ ఆత్మ వస్తంస కర్మాణి నిభధ్నస్త ధనంజయ' నిష్కామకర్మ చేసి ఫలాన్ని త్యజించినవాడిని ఏ కర్మలూ బంధించవట లక్ష్మీ! నర్సు వృత్తిలో ఉంటూ, నిష్కామకర్మతో సంతృప్తిని పొందడానికి అవకాశముండి కూడా ఇంకా సంతృప్తి దొరకడం లేదనుకోడం మన పిచ్చి కాదూ? నీకే కాదు. నాకు మాత్రం ఎవరున్నారు? నీకైతే బంధువులైనా ఉన్నారు. నాకు వాళ్ళు కూడా లేరుగా!" ప్రశాంతంగా అంది సుశీల.

విషాదంగా నవ్వుతూ అన్నాను. "ఒక్కటి చెప్తాను సుశీలా! ఇంతింత జీతాలు ఇయ్యకపోతే, ఇన్నిన్ని సౌకర్యాలు ఇయ్యకపోతే, మనం ఈ వృత్తి చేపడతామా! అంత మాత్రానికి నిష్కామకర్మలాంటి పెద్దపెద్ద మాటలు వాడుతూ, ఆత్మవంచన చేసుకోడమెందుకు? నువ్వు చెప్పిన మాటలన్నీ చదవడానికీ, వినడానికీ బాగానే ఉంటాయి కాని, నిజజీవితంలో మాత్రం అసాధ్యమే!"

"సిస్టర్! ఎర్రమాత్ర అమ్మగోరికి ఏసెయ్యమంటారా?" సన్నగా వినిపించిన స్వరానికి ఇద్దరం మాటలాపేసి తల తిప్పిచూశాం.

ఆ అమ్మాయే!

చేతి వాచీ చూసుకున్నాను. పది ఇరవై రెండు! ఏడూ ఇరవై రెండుకి ఆ మాత్రని పేషెంటుకిస్తూ, మూడు గంటల తర్వాత ఆ మాత్ర వెయ్యాలని ఆ పిల్లతో చెప్పాను. సెకెన్లతో సహా టైము తప్పలేదు!

"మాత్రనిచ్చేయ్" అన్నాను. గబగబా వెళ్ళి పోయిందా అమ్మాయి.

ఆ అమ్మాయి వెళ్లిన వైపే చూస్తూ అంది సుశీల "ఇప్పుడు నువ్వన్నావు చూడు లక్ష్మీ... నిష్కామకర్మ అన్న మాటకి అర్థం లేదని! కాని ఆ పిల్లను చూస్తుంటే నువ్వన్నది అబద్ధం అనిపించడం లేదూ? పది హేనో నంబరు గదిలో ఆవిడకి, ఆ అమ్మాయి

ఏ చుట్టమూ కాదు! ఇంట్లో పనిపిల్లా కాదు, ఆవిడ సేవలు చేయడానికి జీతమిచ్చిన మనిషి కూడా కాదు. ఓ ఏమాశించి ఇదంతా చేస్తోందంటావు? కనీసం పొగడ్తలు ఆశించి కూడా కాదు, ఆ పేషెంటు దగ్గరికొచ్చే మనుషులంతా ఆ అమ్మాయిని కసురుకుంటూ విసుక్కునే వాళ్ళే!"

నేను ఆలోచిస్తున్నాను! నిజమేనా? ఆ అమ్మాయికి ఏమీ అక్కర్లేదా? అసలు ఆవిడకి ఆ అమ్మాయికి ఉన్న బాంధవ్యం ఏమిటి? దానికి జవాబు మర్నాడే దొరికిపోయింది.

రాత్రి డ్యూటీకి రాగానే, ఇంజక్షన్ స్టెరిలైజు చెయ్యడానికి స్టెరిలైజేషన్ ట్రే పట్టుకొని సిస్టర్స్ రూమ్‌లోకొచ్చేసరికి, బయట వరండాలో దీపం కింద కూర్చోని, నేలమీద ఏదో పుస్తకాన్ని పెట్టి, పెదవులు కదిలిస్తూ పట్టి పట్టి చదువుతోంది ఆ అమ్మాయి.

రాత్రి పదకొండు గంటల వేళ... అన్ని గదుల్లో పేషెంట్లు, వాళ్ళతో ఉన్న వారు కూడా నిద్రలోకొరిగిన సమయంలో... ఆ నిశ్శబ్దంలో... ఆ అమ్మాయి నోట్లోంచి వస్తున్న శబ్దాలు... అవేమిటో సరిగ్గా వినబడక పోయినా, దేముడికి హారతిచ్చేటప్పుడు వాయించే చిరుగంటల చప్పుడులా వినిపిస్తున్నాయి.

స్టౌ వెలిగించి, దానిమీద ట్రేను పెట్టేసి ఆ అమ్మాయి కూర్చున్న వైపు నడిచాను. దగ్గరకు నడిచి ఆ అమ్మాయి మొహం వైపు చూసేసరికి, చదువుతున్న పుస్తకంలో ఒక్క వాక్యం కూడా ఆ అమ్మాయికి అర్థం కావడం లేదని ఆ మొహం చూస్తూనే తెలిసిపోయింది.

"ఏం పుస్తకమమ్మా అది?" నా మాటతో ఉలిక్కిపడి పుస్తకం మూసేసింది.

"నీ క్లాసు పుస్తకమా? నువ్వసలు స్కూలుకెళ్తున్నావా?" అడిగాను.

నిర్వికారంగా చూస్తూ అంది. "మునుపు స్కూలుకెళ్ళేదాన్ని! ఇప్పుడు మానేశానండీ. ఇది క్లాసు పుస్తకం కాదండీ... ఏదో గేయాలండీ!"

"గేయాలు చదువుతున్నావా? నీకసలు అర్థమౌతున్నాయా?" ఆశ్చర్యంగా అడిగాను.

తలదించుకొని మొహమాట పడుతున్నట్టు నెమ్మదిగా అంది ఆ పిల్ల. "సిస్టర్! మొన్న పొద్దున్న డాక్టరు బాబు అమ్మగార్ని సూడ్డాని కొచ్చినపుడు ఏటన్నారు? 'మీకింక జబ్బు తగ్గిపోతుంది. మనసులో మరేం ఆలోచనెట్టుకోకుండా హాయిగా మంచిమంచి పాటలింటూ, ఎవరిచేతైనా మంచిమంచి పుస్తకాలు సదివించుకొని ఇనండి. అప్పుడు జబ్బు పూర్తిగా తగ్గిపోతుంది' అనలా! అమ్మగారికీ పుస్తకమంటే సాలా ఇష్టమంట! ఓసారి నాతో సెప్పారు. నాకంత బాగా సదవడం రాదు కదా, అందుకే ఓసారి ప్రాక్టీసు సేస్తున్నా!"

అవాక్కయి ఆ అమ్మాయి వైపే చూస్తుండిపోయాను. నిజానికి నాకూ గుర్తుంది. డాక్టరు ఆ మాట చెప్తున్నపుడు, నేను పక్కనే ఉన్నాను. నేనే కాదు... ఆ రోజు ఆవిడ తాలూకు బంధువులూ, స్నేహితులూ చాలా మందే ఆ గదిలో ఉన్నారు. ఆ రోజు నుండి వాళ్ళలో కొంత మంది అదేపనిగా ఆవిడ్ని సరిగ్గా నిద్ర కూడా పోనియ్యకుండా, కాళ్ళూచేతులూ రాస్తున్నారు. కొంతమంది బజారుకి పరుగెత్తి ఆవిడ తిన్నా తినకపోయినా, ఏవేవో కొని తెచ్చి ఆవిడ పక్కన పెట్టేస్తున్నారు. కాని వాళ్ళెవరూ ఒక్క నిమిషం కూడా ఆలోచించని ఈ చిన్న విషయం గురించి ఈ అమ్మాయి ఎంతగా పట్టించుకొంది! పైగా బాగా

చదవాలని ప్రాక్టీసు కూడా! అదైనా, అందరూ నిద్ర పోయాక ఎవరికీ కనిపించని ఓ మూలన కూర్చొని! నా మనసు ఆర్ద్రమైపోయింది.

"ఆ అమ్మగారు నీకేమవుతారమ్మాయి?" అడిగాను.

"మామూలుగా సూస్తే ఏమికారండి... అనుకొంటే అన్నీ అవుతారండీ!"

"అంటే?"

ఆ అమ్మగోరికి బోలెడు ఆస్తి ఉందండీ. ఆ అమ్మగోరే తన డబ్బుతో ఓ అనాథ శరణాలయం నడుపుతుండారండీ. నేను అక్కడ పెరిగినదాన్నేనండీ. బంధువులెవురికీ ఆవిడ అట్టా శరణాలయం నడపడం ఇష్టం లేదండీ! అమ్మగోరెంతో మంచోరండీ. రోజుకొక్కసారైనా అక్కడికొచ్చి, పిల్లలందర్నీ పలకరించకుండా ఉండేవోరు కాదండీ!"

నాకంతా అర్థమైపోయింది. ఏమీ ప్రతిఫలాన్ని ఆశించకుండానే, ఆ పిల్ల అన్ని సేవలు చేస్తోందని సుశీల నాతో వాదించింది. ఆ ప్రతిఫలం డబ్బు కాకపోవచ్చు... సుఖం కాకపోవచ్చు. కాని ఆ ప్రతిఫలం అమ్మాయి జీవితానికో ఆలంబన! ఆవిడ పోతే ఆ అనాథ శరణాలయం మూతపడుతుంది. ఆ అమ్మాయి తిట్లు, చివాట్లు మధ్య బతకవలసొస్తుంది.

ఇన్నాళ్ళూ మనసుకి దొరికిన ఆ ఆలంబన పోతుంది. అందుకే ఆ అమ్మాయికి ఆ తాపత్రయం! నువ్వోడిపోయావు సుశీలా! మనసులోనే అనుకున్నాను. అలా అనుకుంటుంటే అందులో బాధుందో, సంతోషముందో నాకే తెలియలేదు.

ఆ రోజు రాత్రి డ్యూటీ ముగించుకొని, పొద్దున్న ఇంటికెళ్ళి పడుకుంటే ఎంతకూ నిద్రరాదు! కళ్ళు మూసుకొని చిన్న కలతనిద్ర పడుతుంటే కలల నిండా చిన్నచిన్న పాపాయిలే! మెలకువ వచ్చేసరికి ఆలోచనల నిండా ఆ అమ్మాయి రూపమే!

మళ్ళీ సాయింత్రం డ్యూటీకి బయల్దేరబోయేసరికి, ఆలోచనలకో రూపం వచ్చేసింది. మనసంతా తృప్తితో నిండిపోయింది. నాకూ జీవితానికో తోడు కావాలి. ఆ అమ్మాయికీ జీవితానికో ఆధారం కావాలి. నేనా అమ్మాయినే పెంచుకుంటే? మనసులో ఉబుకుతున్న అనురాగాన్నీ, వాత్సల్యాన్నీ ఆ పిల్లకి పంచియ్యచ్చు. ఆ అమ్మాయి ఆరాధన నేనూ పొందొచ్చు!

ఆ రోజు ఆస్పత్రి కెళ్ళడానికి తయారవుతున్నంత సేపూ రకరకాల కలలు! చక్కని శుభ్రమైన బట్టల్లో యాసలేని భాష మాట్లాడుతూ, ఆ పిల్ల. ఆ అమ్మాయికి అన్నం పెడుతూ, తల దువ్వుతూ, చదువు చెప్తూ నేను! ఆస్పత్రినుంచి వచ్చేసరికి చక్కని చిరునవ్వుతో ఎదురుచూస్తూ ఆ అమ్మాయి... ఆస్పత్రిలో అడుగు పెట్టేదాకా ఆ ఊహలతోనే గడిచిపోయింది.

ఉత్సాహంగా ఆస్పత్రికొచ్చేసరికి, అక్కడ ఆ అమ్మాయి కనబడలేదు. చుట్టుపక్కల వారిని అడగబోయేంతలో స్టాఫ్ నర్సు దగ్గర్నుంచి పిలుపొచ్చింది. పొరుగూళ్ళో ఉన్న ఆస్పత్రికి స్పెషల్ డ్యూటీ మీద అర్జంటుగా వెళ్ళాలట. ఆ ఊర్లో ఏదో బస్సు యాక్సిడెంట్ జరిగి, చాలా మందికి దెబ్బలు తగిలాయట. అక్కడ తగినంత మంది స్టాఫ్ లేరట.

సుశీలని కూడా కలవడానికి వీల్లేక, మరో నలుగురితో బాటు, ఆ రాత్రి ట్రెయినుకే హడావుడిగా బయల్దేరవలసి వచ్చింది.

ఇరవై రోజుల పాటు ఊపిరి తిరగని పని... ఏడ్పులు, ఆక్రందనలు, మూల్గులు, ఉరుకులు, పరుగులు... వీటి మధ్యే గడిచిపోయింది. మధ్యలో ఓరోజు వీలు చూసుకొని, అదే ఊర్లో ఉన్న వేలువిడిచిన మేనత్త ఇంటికెళ్ళాను తప్పనిసరిగా! ఆ మేనత్త కొడుకు రామ్మూర్తి అక్కడే ఉన్నాడు. పెళ్ళయి ఇద్దరు పిల్లలు పుట్టాక భార్య పోయిందట.

పిల్లల గురించి మళ్ళా పెళ్లి చేసుకోదలచుకున్నాడట. కాని ఒక్కటే షరతు. నేనా నర్సు ఉద్యోగం మానేసి ఇంటిపట్టున ఉంటూ అతని పిల్లల్ని చూసుకోవాలి. ఒకే ఒక నిమిషం మనసు కొట్టుకుపోయింది. నేను కోరుకున్న ఓ తోడు! నా వాళ్లు అంటూ ఇద్దరు పిల్లలు. పైగా ఇక ఈ ఉరుకులు, పరుగులు, చావులు, పురుళ్ళూ లేని నీడపట్టు జీవితం!

కాని ఆ అమ్మాయో? ఆ అమ్మాయి చుట్టూ నేను అల్లుకున్న ఆశలో? ఊహూ... ముందర ఆ అమ్మాయితో మాట్లాడిన తర్వాతనే, ఒకవేళ ఆ అమ్మాయి ఒప్పుకోకపోతేనే, అప్పుడు ఈ రామ్మూర్తిని పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకుంటాను!

ఇరవైరోజులు గడిచిపోయిన తరువాత, తిరిగి మా ఊరు వచ్చి, ఆఫీసులో అటెండెన్సు రిజిస్టరులో సంతకం చేసిన తరువాత నేను చేసిన మొట్ట మొదటి పని గబగబా పదిహేనో నంబరు గదివైపు పరిగెత్తడం!

గదిలో అడుగుపెట్టేసరికి గదంతా ఖాళీగా, బోసిగా ఉంది! గుండె వేగంగా కొట్టుకుంది. ఏమయిందావిడకి? బాగయిపోయి వెళ్ళిపోయిందా? లేక... లేక?

ఒకవేళ ఆవిడ పోతే? అనుక్షణం ఆవిడ బతకడం గురించి తపించి పోయిన ఆ పిల్ల ఇక బతకదు. ఈ నాకు తెలుసు. లోకంలో తనకెవరూ లేరని ఆత్మహత్య చేసేసుకుంటుంది. అసలీసరికే...

ఆ ఊహతోనే కాళ్ళు గడగడవణికాయి. గబగబా సుశీలను వెతుక్కుంటూ ముందుకు నడిచాను. ఇరవైయ్యో నంబరు గదిలో టెంపరేచరు చార్టులో రాస్తున్నదల్లా, నా పిలుపుతో వెనక్కు తిరిగి చూసి పలకరింపుగా నవ్వింది. సుశీల ఆ చార్టులో రాస్తున్నంత సేపూ అసహనంగా నిల్చున్నాను. రాయడం పూర్తి చేసి గది బయటికొచ్చింది.

"అయితే మళ్ళా ఇరవై రోజుల తర్వాత వచ్చావన్నమాట! పొరుగూరి ఆస్పత్రిలో నీ అనుభవాలు చెప్పు" కారిడార్లో నడుస్తూ అంది.

"ముందిది చెప్పు! పదిహేనో నంబరు గదిలో ఆవిడకేమయింది?" ఆత్రంగా అడిగాను.

"అయిదు రోజుల క్రితం డిశ్చార్జి అయిపోయి వెళ్ళిపోయింది"

గుండెల్నిండా గాలి పీల్చుకున్నాను. మనసు తేలికైపోయింది. ఆవిడ సంగతెలా ఉన్నా ఆ అమ్మాయి క్షేమంగా ఉంటుంది. అది చాలు! ఆవిడ వెళ్ళిపోతేనేం? ఆవిడ చిరునామా కనుక్కొని వెళ్ళడం అంత కష్టం కాదు. ఈ రోజే వెళ్ళి నా ఉద్దేశం చెప్పేయాలి. ఆ అమ్మాయి కళ్లలో మెరుపులు చూడాలి.

"నిజంగా ఆవిడ బతికి బయట పడడం అద్భుతమైన విషయమే. అసలు డాక్టర్లే ఆశలొదిలేసుకున్నారు" సుశీల అంటోంది.

కాని నాకు తెలుసు... డాక్టర్లు కూడా ఆశలొదిలేసుకొన్న ఆవిడ బతికి బయట పడ్డానికి కారణం.

"కాని లక్ష్మీ! ఆ అమ్మాయి... ఎప్పుడూ ఆవిడ దగ్గరే కూర్చొని ఉండేది చూడు ఆ అమ్మాయి..." చెప్తుంటే సుశీల గొంతు ఒణికింది.

ఏదో కీడుని శంకించి నా గుండె గుబగుబలాడింది. "ఏమయిందా పిల్లకి?" ఆత్రంగా అడిగాను.

"పోయింది." విషాదంగా అంది సుశీల.

మనసులో వేసుకున్న ఓ చిన్న ఆశాబీజం మొలకెత్తి.. మనసు నిండా వేళ్ళు విస్తరించేసుకుని, ఆ మొలక ఓ మహావృక్షమయ్యే సమయానికి, ఏ రాక్షసుడో వచ్చి ఆ మహావృక్షాన్ని క్రూరంగా కూకటివేళ్ళతో సహా పెకలించుకు పోతున్నట్టు మనసు బాధతో విలవిల్లాడిపోయింది.

"నో... అబద్ధం!" నాకు తెలియకుండానే గట్టిగా అరిచాను.

"అబద్ధం కాదు లక్ష్మీ! పచ్చి నిజం!" గొంతులో సన్నని జీరతో అంది సుశీల.

"కాని, అదెలా జరిగింది సుశీ?" కనుకొలుకుల్లో నిలిచిన నీటిని తుడుచుకుంటూ అన్నాను.

"ఆ అమ్మాయికి లుకేమియా! ఆవిడతోబాటు ఆ అమ్మాయి ఈ ఆస్పత్రిలో అడుగుపెట్టినపుడే డాక్టర్లకి తెలుసునట, ఆ అమ్మాయి ఇక ఎక్కువ కాలం బతకదని!"

'లుకేమియా? నిజంగానా! అంత బలహీనంగా ఉన్న ఆ పిల్లను చూస్తూ కూడా ఆ అమ్మాయికి ఏదో జబ్బుందని ఊహించలేకపోయానేమిటి?' మనసు మూగగా రోదిస్తోంది.

"కాని ఓ ఆశ్చర్యకరమైన విషయం తెలుసా లక్ష్మీ? ఆవిడకి పూర్తిగా నయమైపోయింది. మరో వారం రోజుల్లో డిశ్చార్జి అయిపోయి వెళ్ళిపోవచ్చని డాక్టర్లు చెప్పిన తరువాతే, ఆ అమ్మాయికి సీరియస్ అయిపోయింది. ఇక్కడే జనరల్ వార్డులో చేర్చారు. జబ్బయితే పూర్తిగా పోయింది, కాని ఆవిడ మంచం మీంచి లేచి అట్టే తిరగకూడదు. జనరల్ వార్డులో ఆత్మీయంగా పలకరించేవారు లేక అలా ఒంటరిగానే పోయిందా పిల్ల! ఆ అమ్మాయి పోయినరోజు ఆవిడ గుండెలవిసేలా ఎంతగా ఏడ్చిందో... మాకే భయమేసింది ఆవిడ కేమవుతుందోనని! ఆ అమ్మాయి పోయిన రెండోరోజే ఆవిడని డిశ్చార్జి చేసేశారు."

వింటుంటే గుండెలో కొండంత దిగులు నిండిపోయింది.

పిచ్చిపిల్ల! ఏ అనురాగం కోసమైతే, ఏ మానసిక ఆలంబన కోసమైతే ఆ అమ్మాయి ఇన్నాళ్లు కష్టపడిందో, ఆఖరి నిమిషంలో... అమ్మాయికి ఆ ఆలంబన దొరకనేలేదు. కనీసం మరో ఏడాది తర్వాత అయినా ఆవిడ వాత్సల్యం చివరి నిమిషంలో పుష్కలంగా దొరికి ఉండేదేమో! పాపం ఆవిడ మాత్రం ఏం చేస్తుంది? అశక్తురాలు.

నాకేం మాట్లాడ బుద్ధి కాలేదు. మౌనంగా నడవసాగాను. ఆ రోజుకి మరి డ్యూటీ చెయ్యబుద్ధి కాలేదు. సెలవు పెట్టేసి ఇంటికెళ్ళిపోయాను. ఆ రోజే కాదు. మరెప్పుడూ చెయ్యలేనేమో అనిపించింది. సేవాధర్మం, మానసిక సంతృప్తి అంటూ చేస్తున్న ఉద్యోగానికి ఏవేవో పేర్లు పెట్టుకోవడం అనవసరం!

ఈ నిరంతర మానసిక సంఘర్షణకి, ఈ ఒంటరితనానికి, ఈ ఉరుకులు పరుగులకి ఇక స్వస్తి చెప్పేయాలి! ఆ రామ్మూర్తినే పెళ్ళి చేసుకొని ఆ పిల్లల్ని నా పిల్లలుగా చూసుకుంటూ, ఇంటిపట్టున హాయిగా గడిపేయాలి! ఆ ఊహతో ఆ అమ్మాయి పోయిన విషాదంలోంచి మనసు కాస్త తేరుకొని, కాస్త నిశ్చింతగా అనిపించింది.

రామ్మూర్తికి ఉత్తరం రాయడంలో మరి ఆలస్యం చెయ్యలేదు. అతని షరతుకి ఒప్పుకుంటున్నానని, ఉద్యోగం మానేసి అతన్ని చేసుకోడానికి సిద్ధంగా ఉన్నానని రాసేశాను. ఉద్యోగానికి రాజీనామా కాగితం కూడా రాసేశాను.

మర్నాడు ఆస్పత్రికెళ్ళి ఆ రాజీనామా కాగితం ఇచ్చేయబోయే ముందు, ఒక్కసారి పదిహేనో నంబరు గదిని చూసుకోవాలనిపించింది.

అటువైపు నడిచాను. ఆ రోజే మరో పేషెంటు ఆ గదిలో చేరబోతున్నాడట. ఆయాలు గదిని శుభ్రం చేస్తున్నారు. గూళ్ళలోనూ, మంచం కిందా, కప్‌బోర్డులలోనూ ఉన్న చెత్త చెదారం గది బయట ఉన్న డబ్బాలో పడేస్తున్నారు. కాస్సేపలాగే చూసి బయటకు నడవబోయేంతలో డబ్బాలో పైన పడున్న ఓ చిన్న పుస్తకం నా దృష్టి కొచ్చింది.

పనికిరాని ఎక్సర్ సైజు పుస్తకాల కాగితాలను అడ్డదిడ్డంగా కుట్టి పేపరు అట్ట వేసిన పుస్తకమది. ఆ అమ్మాయి అప్పుడప్పుడు చిన్న పెన్సిలు ముక్కతో అందులో ఏదో రాయడం చాలా సార్లు చూశాను.

ఆ పుస్తకాన్ని డబ్బాలోంచి తీసి పట్టుకుని, సిస్టర్స్ రూమ్ వైపు నడిచాను. ఒక్కో పేజీ తిరగేయసాగాను. పెద్దపెద్ద అక్షరాలు... పట్టి పట్టి రాసినట్టున్నాయి. పుస్తకంనిండా వాళ్ళ అమ్మగారి విషయాలే. ఏ రోజు అమ్మగారికి జ్వరం ఉన్నదీ... ఏ రోజు తగ్గినదీ... ఏయే మందులు ఎప్పుడు అయిపోతాయో... అన్నీ!

ఆఖరి పేజీ తీశాను...

“అమ్మగారి జబ్బు పూర్తిగా తగ్గిపోయిందట. మరో వారంరోజుల్లో ఇంటికెల్లి పోవచ్చునట. ఇంక నేను సచ్చిపోయినా పర్లేదు. నేను పోతానని పాపం అమ్మగారికి తెలియదు. డాక్టర్లు చెప్పుకుంటుంటే విన్నానని డాక్టరు బాబులకి తెలియదు. నేను పోతే ఎవరికీ ఏమీ కాదు. కాని అమ్మగారు పోతే... అమ్మో అంతమంది అనాథపిల్లలకెట్టాగా! అందుకే రోజూ దేముడికి దణ్ణం పెట్టుకొంటున్నాను. అమ్మగారికి పూర్తిగా నయమైపోయిన తర్వాతనే నన్ను తీసుకుపో దేముడా అని!”

అంతే... ఇంక తర్వాత పేజీల్లో అక్షరాలు లేవు. అన్నీ ఖాళీ కాగితాలు. కళ్ళలోంచి జలాజలా నీళ్ళు రాలాయి. ఆ అమ్మాయికి తాను చనిపోతానని తెలుసు. ఆ విషయం తల్చుకుంటేనే మనసు నిండా ఆశ్చర్యం నిండిపోతోంది. ఓ చిన్నపిల్ల... చింపిరి బట్టలతో, లోతు బుగ్గలతో నా ముందు తిరిగిన పిల్ల... చూస్తూండగానే హిమవన్నగమంత ఎత్తుకి ఎదిగినట్టు అనిపించింది.

‘నువ్వోడిపోలేదు సుశీ! నువ్వే గెలిచావు... నువ్వే గెలిచావ్...’ అనుకున్నాను.

ఆ అమ్మాయి ఇక్కడున్నన్ని రోజులూ, ఎంత బలహీనంగా ఉన్నా, ఆ పిల్ల కళ్ళలోని సంతృప్తి గుర్తొచ్చింది. మొహంలోని ప్రశాంతత గుర్తొచ్చింది. రేపు నేను.. చుట్టూ బంధువులూ పిల్లల మధ్య చనిపోయినా, నా మొహంలో ఆ ప్రశాంతత ఉంటుందా? జీవితంలో ప్రతి నిమిషం కాకపోయినా కొన్ని నిమిషాలైనా ఆ పిల్లలా గడపగల్గితే? అంతే! ఏదో ఆవేశం వచ్చినట్టు బేగులోంచి రాజీనామా కాగితాన్నీ, రామ్మూర్తికి రాసిన ఉత్తరాన్నీ తీసి చింపేశాను. రామ్మూర్తికి అక్కడికక్కడే మరో ఉత్తరం రాసేశాను. నర్సు ఉద్యోగం మానే ఉద్దేశ్యంలేదని, అందుకు అభ్యంతరం లేకపోతేనే అతన్ని వివాహం చేసుకొంటానని!

ఇప్పుడు నాకు ఎంతో సంతృప్తిగా ఉంది. దూరంగా ఉదయపు నీరెండలో ఓ గడ్డిగులాబీ ఎర్రగా మెరుస్తోంది... బతికిన కొద్ది క్షణాలు తన ఉనికిని సార్థకం చేసుకుంటోంది. అది నా ముంగిట్లోనే ఉండాలన్న స్వార్థం!

*04.11.1988 ఆంధ్రపత్రిక వారపత్రిక నుంచి పునర్ముద్రణ.*

*1988లో ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీలలో ప్రథమ బహుమతి పొందినది.*

# పాకశాస్త్ర పరీక్ష

కీ. శే. చింతా దీక్షితులు

**కథామార్గదర్శి కథ**

***"అన్నం చిమిడింది, పప్పు ఉడకలేదు, కూర చేదుగా ఉంది, గారెలు కొన్ని మాడాయి, కొన్ని అసలు ఉడకనే లేదు. అతడు ఏమనుకున్నాడో పాపం!" అంది.***

***"భార్య వంటే నచ్చకపోతే... పాకశాస్త్ర పరీక్ష పాసైన భార్య వంటే నచ్చకపోతే, అతనికి ఎవరి వంట నచ్చును?" అన్నాను.***

"అమ్మాయీ... చంటిపిల్ల ఏడుస్తూ ఉంది. కొంచెం ఎత్తుకో అమ్మా" అని కేక వేశాను.

మా అమ్మాయి గదిలో కూర్చుని తదేక ధ్యానంగా చదువుతూ మాట్లాడలేదు. ఏమి చదువుతూ ఉందో అని జాగ్రత్తగా విన్నాను. ఈ విధముగా చదువు వినిపించింది.

"వంగకాయకూర నాలుగు విధంబులు! వంగకాయకూర నాలుగు విధంబులు. పులుసు కూర, ఇగురుకూర, పప్పుకూర, కారపుగూర–పులుసుకూర, ఇగురుకూర, పప్పుకూర–కారపుగూర! కారపుగూరకు ఎండు మిరపకాయ లైనను, పచ్చి మిరపకాయలైన ఉపయోగింపదగు!"

మళ్లీ మా అమ్మాయిని పిలిచాను.

"తీరుబడి లేదు నాన్నా. ఈవేళ పరీక్ష" అంది.

"ఏం పరీక్షమ్మా" అన్నాను.

"పాకశాస్త్ర పరీక్ష... చదువుకుంటున్నాను నాన్నా!" అంది.

మా రోజుల్లో పాకశాస్త్ర పరీక్షలు లేవు. కనుక్కోగా, తేలిన విషయం ఏమిటంటే.. ఈ కాలంలో పాకశాస్త్రం మీద శాస్త్రపరీక్షే కాకుండా, ప్రత్యక్షంగా వంటచేసే పరీక్ష కూడా ఉందని తేలింది. నిజంగా ఈ కాలములో ఇదొక కొత్తలాభం మనకు

చేకూరిందని సంతోషిస్తూ, మా అమ్మాయి పాకశాస్త్ర పారీణతను వినియోగపరిపించాలని ఆలోచించినాను. పూర్వకాలపు ఆడవాళ్లు... అంటే పాకశాస్త్రాదులు బళ్ళలో చదవని రకంవాళ్లు... వంటచేస్తే మనం పడే అవస్థలు, వేరే బహిరంగంగా చెప్పడము వివేకము కాదు. ఇక పాకశాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణులైన ఈ కాలపు ఆడవాళ్లు, నిజముగా వంటంటూ చేస్తే అది నలపాక భీమపాకములను మించి ఉంటుందని వేరే చెప్పక్కర్లేదు గదా! ఇంతే కాకుండా ఇంకో విశేషం... ఇదివరదాకా అడ్డమైనవాళ్ళూ వంటచెయ్యడమే! ఆడదై పుట్టిందీ అంటే పెళ్లిచేసుకోవడం ఎంత సహజమని భావిస్తున్నారో, వంటచేయడం కూడా అంత సహజమని భావిస్తున్నారు. నిజానికి వంట అనేది ఒక 'లలిత కళ' అనే విషయం ఇంతవరకు ఎవరు కనిపెట్టలేదు.



ఇప్పుడు పాకశాస్త్ర పరీక్షలు చేసి కృతార్థులైన వాళ్లకి తగిన సర్టిఫికెట్లు ఇచ్చి, 'ఇటువంటి సర్టిఫికెట్లు ఉన్నవాళ్లే వంట చేయడమునకు అర్హులు, మిగిలిన వాళ్ళు కారు, అర్హులు కానివాళ్ళు వంట చేసినట్లయితే పీనల్ కోడ్ (నూతన ముద్రణము) ప్రకారము శిక్షాపాత్రులు' అని నిర్ణయము చేయడము వల్ల పాకశాస్త్రమునకు, మిగిలిన శాస్త్రములకు వలెనే గౌరవస్థానం లభించిందని ఊహించవచ్చు.

ఈ విధంగానే ముగ్గులశాస్త్రం, అలుకుశాస్త్రం మొదలైన శాస్త్రాలలో పరీక్షలు పెట్టి, అందులో నెగ్గినవారే ముగ్గులు పెట్టడానికీ, ఇళ్ళూ, వాకిళ్ళూ, గోడలూ అలకడానికీ అర్హులని ఏర్పాటు చేసినట్లయితే.. ఈ విధంగా కొంతవరకు భారతదేశానికి శ్రేయస్సు కలగవచ్చును.

పాకశాస్త్రానికి వలెనే ముగ్గులశాస్త్రానికీ, అలుకు శాస్త్రానికీ కూడా తెల్లదొరలే, తగిన పుస్తకాలు వ్రాసినట్లయితే మరీ భేషుగ్గా ఉంటుంది.

ఇక మా అమ్మాయి సంగతి...

పాకశాస్త్ర పరీక్షకని మా అమ్మాయి ఇంట్లో పనులు ఏమీ ముట్టుకోకుండా రాత్రి ఒంటిగంట దాకాను, పగలు పగలంతాను కష్టపడి చదివి చదివి, ఎలాగైతేనేమి పరీక్షకు వెళ్ళింది.

పరీక్షలో ఏమి వ్రాసిందో ఏమి మానిందో గానీ, ఇంటికి మాత్రం ముఖమంతా చిరునగవులతో వచ్చింది.

"అమ్మాయీ, పరీక్షలెలాగ వ్రాశావు?" అన్నాను.

"చాలా బాగా వ్రాశాను నాన్నా!" అంది.

"శాస్త్రపరీక్షలో ఇచ్చిన ప్రశ్నలన్నింటికీ సమాధానం వ్రాశావా" అన్నాను.

"వ్రాశాను. కానీ ధనియాలకి పాకశాస్త్రంలో ఉన్న స్థానము వ్రాయమన్నారు, అది మాత్రం వ్రాయలేదు నాన్నా... తెలిసింది కాదు!"

"ప్రాక్టికల్ పరీక్షో?" అన్నాను.

"అల్లం పెసరట్టు వెయ్యమని ప్రశ్న ఇచ్చారు నాన్నా. కొంచెం మాడింది గాని 'మినిమం' పరీక్ష మార్కులు వస్తాయి నాన్నా!" అంది.

"ఒక్క పెసరట్టేనా... ఇంకా ఏమైనా వండమన్నారా?" అన్నాను.

"ఛాయిస్ ఇచ్చారు నాన్నా. అల్లం పెసరట్టేనా సరే, లేకుంటే అరటికాయ బజ్జీ అయినా సరే."

మా అమ్మాయి తన పరీక్ష పత్రాలు నా చేతిలో పెట్టింది.

పాఠకులు కూడా కుతూహలంతో ఉంటారు కాబట్టి వాటిని వారికి కూడా చూపిస్తాను.

శాస్త్ర పరీక్షలు

1. పాకశాస్త్ర పరీక్ష (శాస్త్ర భాగము)

మూడు గంటలు

1. వంగకాయ పులుసు, ఇగురు కూరలకు భేదమేమి? వంగకాయతో కూడా నేయే కాయగూరలను నాకుగూరలను చేర్చి వండవచ్చును?

2. (అ) మనము సాధారణంగా ఉపయోగించు వానిలో నేకాయగూరలు, ఏ దుంపకూరలు, ఏ ఆకుకూరలు పచ్చడి చేయుటకై పనికివచ్చును?

(ఆ) నల్లేరు వడియంబుల బెట్టు విధానంబును బూర్తిగా వ్రాయుడు.

3. (అ) అన్నమును వార్చునప్పుడు, చేయి పట్టుకొనుటకేయే వస్తువులు పయోగించవచ్చును?

(ఆ) పులుసునకు బెట్టిన తాలింపు... చారునకు బనికి వచ్చునా?

(ఇ) కారపు గారెలకును, వడలకు గల భేదసాదృశ్యముల నెఱింగింపుడు?

4. (అ) ఏయే గూరలలో కరివేపాకు వేయవచ్చును? వేనిలో వేయరాదు?

(ఆ) ఇంగువ, ఆవాలు, మెంతులు, మిరియాలు, ధనియాలు, జీలకర్ర... పాకశాస్త్రమున వీనికి గల స్థానంబుల నిర్ణయింపుడు.

5. (అ) దక్షిణాది వారి చారునకును, ఆంధ్రుల చారునకును గల భేదములను విశదీకరింపుడు.

(ఆ) పప్పు కూరలలో నెయ్యది మిక్కిలి రుచికరమైనదో సకారణంబుగా నిర్ణయింపుడు.

6. కుక్కుటము, హరిణము, ఛాగము, లావుకపిట్ట, పావురము – పాకకళ కివి ఎట్లు తోడ్పడుచున్నవి!

7. (అ) అజీర్ణవ్యాధి ఎందువలన కలుగుచున్నది. దానిని వారించు మార్గములెయ్యవి?

(ఆ) అజీర్ణవ్యాధిచే బాధపడు ముగ్గురు ఆంధ్ర కవులు, ఇద్దరు న్యాయాధిపతులు, పదుగురు ఆంధ్ర వైద్యులు, పదునేనుగురు న్యాయవాదులు... వారి పేర్లను వ్రాయుడు.

8. (అ) గోగుకూర, దోసకాయ, పనసకాయ, మామిడికాయ... ఏ దేశమందు ఫలించునవి మిక్కిలి రుచికరముగా నుండును?

(ఆ) స్టవ్ వంట, కుక్కర్ వంట, సాదా వంటల మంచి చెడ్డల నిర్ణయింపుడు.

(P.T.O.)

శాస్త్ర పరీక్షలు

1. పాక శాస్త్ర పరీక్ష: ప్రాక్టికల్

3 గంటలు

[షరా; ఈ కింది ప్రశ్నలను బాగుగా చదువుకొని ఒక ప్రశ్న మాత్రమే యత్నించవలెను. కారము, ఉప్పు ఎక్కువ గాని తక్కువ గాని యున్నచో గుణములు తగ్గించబడును.]

1. అల్లపు పెసరట్ల నయిదింటిని వేయుము. [పెసరపప్పు కొలతయును, అందులో వేయు పదార్థముల మానమును వ్రాయవలెను. పెసరట్లు దోరగా వేగవలెను.]

లేక

2. అరటికాయ బజ్జీలను ఐదుగురకు సరిపోవునట్లు తయారుజేయుము. [బజ్జీలకు కావలసిన వేర్వేరు పదార్థముల మానమును సూచింపవలెను]

పరీక్షపత్రాలు చదువుకున్నాను. సంతోషించాను.

కొన్నాళ్లవరకూ మా అమ్మాయి పరీక్షపత్రములు దిద్దే వాళ్ళ ఇళ్ళకు తిరగడముతో సరిపోయింది. చివరకు ప్రాక్టికల్ పరీక్షలో పోయినట్లూ, శాస్త్ర పరీక్షలో బాగా మార్కులు వచ్చినట్లూ... మొత్తం మీద ఎలాగైతేనేమి పరీక్ష ప్యాసయినట్లు తెలిసింది.

"ప్రాక్టికల్లో ఎందుకు పోయిందమ్మా?" అని మా అమ్మాయిని అడిగాను.

"ఐదుగురు జడ్జీలకి ఐదు పెసరట్లు వేయించుకున్నారు"

"ఐదుగురు జడ్జీలేమిటి?"

"మరి ప్రాక్టికల్ పరీక్షలో సరిగా వ్రాసిందీ లేనిదీ చూడడానికీ, వండిన పదార్థాలు రుచిగా ఉన్నదో లేదో చూడ్డానికీ జడ్జిలు అక్కర్లేదు నాన్నా?"

"ఈ ఐదుగురూ రుచి చూచి ఇచ్చిన మార్కులిస్తే వాటిని బట్టి పరీక్షాఫలం నిర్ణయిస్తారా?"

"ఐదుగురు ఇచ్చిన మార్కులూ కలిపి సరాసరి చేసి అప్పుడు నిర్ణయిస్తారు నాన్నా."

"సరే ఏమి జరిగింది?"

"ఐదుగురూ కూర్చుని, ఐదు పెసరట్లు తినడానికి మొదలుపెట్టారుట."

"ఏం జరిగింది."

"తినలేక పోయారట."

"ఎంచేత?"

మా అమ్మాయి సందేహంగా చెప్పింది, "కారం ఎక్కువై తినలేక, అరగంట దాకా నోరు స్వాధీనం అయ్యింది కాదట!"

"అంత కారం ఎందుకు వేశావమ్మా?"

"మిరపకాయలు తూచడంలో పొరపాటు వచ్చింది నాన్నా! ఒక ఔన్స్ పచ్చిమిరపకాయలూ, పాతిక ఔన్స్ ఎండుమిరపకాయలూ వేయడానికి బదులు, తప్పు తూనిక రాయి తీసుకోవడం వల్ల ఎక్కువ కారం పడింది నాన్నా!"

"ఎన్ని ఔన్సులు వేశావు."

“ఎనిమిది ఔన్సులు పచ్చిమిరపకాయలూ, రెండు ఔన్సులు ఎండు మిరపకాయలూ వేసాను.”

“పోనీలే... ఎలాగో పాసయ్యావు అదీ కావలసిఉంది!” అన్నాను.

“పొరపాటు వచ్చింది కానీ, అసలు చాలా బాగా వండుతాను నాన్నా!” అంది మా అమ్మాయి.

“సరే, ఒక మాటు నీ వంట చూపిద్దువు గాని!” అన్నాను.

“ఎప్పుడు నాన్నా, ఎప్పుడు?”

“చెప్తుతాలే” అన్నాను.

ఇంట్లో పొయ్యిమీద మామూలుగా వండుతుందనుకున్నాను మా అమ్మాయి. కానీ ఆ విధంగా తాను తర్ఫీదు కాలేదనీ, తాను తర్ఫీదైన విధంగా వంట చేయడానికి, కనీసం పాతిక రూపాయలు నా చేత ఖర్చు పెట్టించింది.

మిరపకాయలూ, ఉప్పూ, ఆవాలూ, మెంతులూ, కరివేపాకు మొదలైనవి తూచడానికి ఒక సున్నితమైన తులామానమూ, ‘గ్రాము’ తూనికరాళ్లు ఉండే పెట్టీ కొన్నాను. బియ్యములోనూ, పప్పులోనూ, కూరలలోనూ, పచ్చళ్ళలోనూ, ఉప్మా మొదలైన వాటిల్లోనూ పొయ్యడానికి, నీళ్లు కొలవడానికి, రెండు మూడు రకాల గాజు కొలత పాత్రలు కొన్నాను.

నూనె, నెయ్యి కొలవడానికి ఒక చిన్న ఔన్స్ గ్లాస్ కొన్నాను.

అన్నంగిన్నె, పప్పుగిన్నె, పెనమూ, బూరెలు మూకుడు మొదలైనవి పట్టుకోవడానికి నాలుగైదు రకాల పట్టకారులు కొన్నాను.

ఉష్ణోగ్రత తెలుసుకోవడానికి రెండు మూడు రకాల థెర్మామీటర్లు కొన్నాను.

ఇంకా మా అమ్మాయి చెప్పిన చిల్లర వస్తువు లేవేవో కొన్నాను.

ఈ సాధన సామాగ్రి సంపాదించుకొని, మా అమ్మాయి తన వంట నేర్పు నాకు చూపించవలెనని తగిన సమయము కోసం వేచి ఉంది.

తగిన తరుణం కూడా త్వరలోనే వచ్చింది.

★★★

తాను బి. యల్ పరీక్ష చదవడానికి నేను డబ్బు ఇస్తానేమోనని కనుక్కోవడానికి వచ్చాడు మా అల్లుడు. మొట్టమొదట ఈ విధంగా సామోపాయం వల్ల ప్రయత్నం చేసి, నెగ్గకపోయినట్లయితే భేద, దండములు ప్రయోగించవలెనని అతగాడి అభిప్రాయమైనట్లు నేను గ్రహించాను.

అల్లుడు వచ్చిన ఇటువంటి తరుణం ఊరికే పోనివ్వడం ఎందుకని, ఆ రోజున మా అమ్మాయిని వంట చెయ్యమన్నాను. మా ఆవిడను చూస్తూ ఉండమన్నాను. మా అల్లుడికి ఇష్టమైన పిండివంట గారెలు వండమన్నాను.

మా అమ్మాయి వంట చేయడం ప్రారంభించింది. రెండు స్టవులు వెలిగించింది. బర్రుమని శబ్దం చేస్తున్నాయి. తులామానంతో బియ్యం తూచింది. గాజుపాత్రతో నీళ్లు కొలిచి పోసింది. తను కొలిచిన మినప్పప్పు నానేసి, తల్లిని రుబ్బమంది. నన్ను ఆవాలూ, జీలకర్రా, మెంతులూ రెండేసి డ్రాముల చొప్పున కొంచెం తూచి పెట్టమంది.

“అమ్మాయీ, పప్పులో నీళ్లు చాలవే” అని తల్లి అంటే...

“నీకు తెలియదు, ఊరుకో అమ్మా! 150 గ్రాముల కందిపప్పుకి 100 క్యూబిక్ సెంటీమీటర్ల నీళ్ల చొప్పున పోశాను. తక్కువ లేదు!” అంది మా అమ్మాయి.

బియ్యంలో నీళ్లు ఎక్కువ అయ్యేయనీ, కూరలో ఎక్కువ మెంతులు పడ్డాయనీ, పులుసులో ధనియాలక్కర్లేదని... తల్లి చెప్పితే, తల్లితో ఘర్షణ పడింది. దాని ఇష్టము వచ్చినట్లు చేయనివ్వమనీ, ఏమీ అడ్డు చెప్పవద్దనీ... తల్లిని నేను మందలించాను. ఎలాగైతేనేమి... ఒక గాజుపాత్రా, రెండు థెర్మామీటర్లూ బద్దలుకొట్టి, అయిదారు గంటలలో మా అమ్మాయి వంట చేసి, ఒగుర్చుకుంటూ వెళ్లి తన గదిలో కుర్చీలో కూర్చుని, పాకశాస్త్ర గ్రంథము తిరగవేస్తూ, తాను సరిగ్గా వండినదీ లేనిదీ సరిచూచుకుంటోంది.

మా ఆవిడ వడ్డించింది... మా అల్లుడికీ, నాకూ!

అంతవరకూ ఉత్సాహంగా మాట్లాడుతున్న మా అల్లుడు, మొదటిముద్ద నోటిలో పెట్టుకున్నది మొదలు చివరిదాకా ధుమధుమలాడుతున్నాడు.

తన భార్య పాకశాస్త్ర పరీక్ష పాసయిందనీ, అదే ఆ రోజున పంట చేసిందనీ... నేను చెప్పినా అతడు సుముఖుడు కాలేదు.

అర్థాకలిగా లేచిపోయి, బి. యల్. చదువుకు డబ్బు అడగకుండానే, అతగాడు సాయంత్రం బండిమీద ఇంటికి వెళ్లిపోయాడు.

“అతనికేం కోపం వచ్చిందో... గారి ముక్కైనా ముట్టుకున్నాడు కాదు! ఎందుకో కనుక్కోండి?” అంది మా ఆవిడ.

“ఎందుకు కోపం?” అన్నాను.

“అన్నం చిమిడింది, పప్పు ఉడకలేదు, కూర చేదుగా ఉంది, గారెలు కొన్ని మాడాయి, కొన్ని అసలు ఉడకనే లేదు. అతడు ఏమనుకున్నాడో పాపం!” అంది.

“భార్య వంటే నచ్చకపోతే... పాకశాస్త్ర పరీక్ష పాసైన భార్య వంటే నచ్చకపోతే, అతనికి ఎవరి వంట నచ్చును?” అన్నాను.

మా అమ్మాయి మా మాటలు విన్నది. తన భర్త ఏమీ అననిదే, మేమే అతనికి అన్ని మాటలూ ఆరోపిస్తున్నామని భావించింది. కోపం వచ్చి అన్నది కదా “ఇలాగ పరీక్షలో వండి ఉన్నట్లయితే తప్పకుండా ఫస్ట్ క్లాసులో పాసై ఉందును. ఎంత బాగా వండినా బాగా లేదంటున్నారు... పోనీలెండి!” అనీ, కంటతడి పెట్టి ఏడ్చింది.

అనలేదు కానీ తన భర్త తిండి తినకుండా లేచిపోవడానికి మేమే కారణమని మా అమ్మాయి ఊహించినట్లు స్పష్టము!

*(భారతి మాస పత్రిక, జూన్ 1931 నుండి పునర్ముద్రణ)*

# బాలకథా రచయితలకు మనవి

కథామంజరిలో ప్రచురిస్తున్న బాలకథలకు
అనూహ్యమైన స్పందన వచ్చి,
ఎక్కువ సంఖ్యలో కథలు మాకు చేరుతున్నాయి.
ఇప్పటివరకు ప్రచురణకు స్వీకరించిన కథలు,
మరో ఏడాది వరకు అంటే,
సుమారుగా డిసెంబర్ 2026 వరకు
ప్రచురణ చేయడానికి సరిపోతాయి.
కావున బాలకథలను పంపవలదని
రచయితలకు మనవి చేసుకుంటున్నాం.
ఒకవేళ పంపినప్పటికీ .. ఎంపికైన కథల ప్రచురణ
జనవరి 2027 తర్వాతనే
జరగగలదని గమనించగలరు.

oOo

**సంపాదకుడు**